ఆదివారం

ప్రజాశక్తి

జూలై 4, 2004



దిగువ సభకు పెద్ద దిక్కు సోమనాథ్

హ్యాపీ బర్త్‌డే

(4-7-2004 నుండి 10-7-2004 వరకు)

ఎ.యువశ్రీ
3 సం॥. 4-7-2001
బాలహారతి-మాణిక్యాలరావు
దరియాలతిప్ప-యానాం

టి. తరుణ్
6 సం॥. 4-7-1998
రజని-శ్రీనివాసరావు
బోనకల్లు-ఖమ్మం

సాయినిహిల్
5 సం॥-1999
లక్ష్మి-లక్ష్మణరావు
మర్రిపాలెం-విశాఖపట్నం

సూర్యసోనిక
5 సం॥. 4-7-1999
రమాదేవి-శ్రీనివాస్
కాజ-గుంటూరు

మాధురి
9సం॥. 4-7-1995
జానకి-కుమారస్వామి
కొత్తూరు-శ్రీకాకుళం

విన్ని
1సం॥. 5-7-2003
శోభ-మల్లారెడ్డి
బంగారిచెర్వు-నల్లగొండ

ఎం.డి. రసూల్
6 సం॥. 7-7-1998
జహారాబీ-గఫూర్
బాలాజీనగర్-కర్నూలు

బిందుప్రియా
5 సం॥. 7-7-1999
మంగా-రాములు
ఎల్.బి.నగర్-హైదరాబాద్

సాయికిరణ్
3 సం॥. 7-7-2001
లక్ష్మి-రమేష్
రామచంద్రాపురం-మెదక్

స్వాతి
1 సం॥. 8-7-2003
వేణు-రామకృష్ణ
ధవళేశ్వరం-రాజమండ్రి

మేఘనశ్వేతప్రియ
6 సం॥. 9-7-1998
బాలమహాలక్ష్మి-వెంకటపున్నారావు
తుళ్లూరు-గుంటూరు



నవీన్
3 సం॥. 10-7-2001
నళిని-నాగేశ్వరరావు
మాధవధార-విశాఖపట్నం

ప్రణయా
2 సం॥-2002
రాధ-భాస్కర్
అమరచింత-మ॥నగర్

సృజన్
9 సం॥జులై-1995
మణి-రాంబాబు
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

మౌనిక
వరలక్ష్మి-నరేందర్
కొండమల్లెపల్లి-నల్లగొండ

సాయితేజ
1సం॥. జులై-2003
సైదమ్మ-వీరయ్య
ఓగోడు-నల్లగొండ

తేజస్వి
8సం॥1996
మాధవి-గణేష్‌కుమార్
ఉక్కునగరం-విశాఖపట్నం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

మత్తులో గమ్మత్తు - అది తెచ్చే విపత్తు

జూన్ 20 ఆదివారం అనుబంధంలో అధోజగత్తులోకి జారుతున్న యువత అన్న శీర్షికన ప్రచురించిన కవర్ స్టోరీ బాగుంది. వర్తమాన సమాజంలో యువత, మత్తులో గమ్మత్తు, అది తెచ్చే విపత్తు గురించి తెలిసినా, సహవాస దోషం వల్లా, మానసిక దౌర్బల్యం వల్లా మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. మానవ కల్యాణానికి జీవితాన్ని అంకితం చేయవలసిన యువత, కాయకష్టం చేసి భార్యాబిడ్డలను పోషించవలసిన కొందరు పేద, మధ్యతరగతి కుటుంబాలవారు మత్తులో పడి అయిన వారికి అన్యాయం చేస్తున్నారు. అటువంటివారికి ఈ కవర్ స్టోరీ కనువిప్పు కావాలి. జీవన శైలి బాగుంది. చౌకబారు దృశ్యాలతో యువతను తప్పుదారి పట్టించే వెండితెర, బుల్లితెర నిర్మాతల అపభ్రంశ దృక్పథాన్ని చక్కగా వర్ణించారు.

- గో.వా.నరసింహరావు,
రామకృష్ణాపురం, ఆదిలాబాద్ జిల్లా

మంచి పరిచయం



మా అభిమాన దినపత్రిక ప్రజాశక్తి ఆదివారం అనుబంధం జూన్ 20వ తేదీ సంచికలోని శీర్షికలన్నింటికంటే కవి షేక్ కరీముల్లా గూర్చి ఇచ్చిన వ్యాసంలోని కవి భావాలు, ఆలోచనలు, ఆవేశాలు, ఆశ్చర్యానికి గురి చేసి ఆలోచింప చేశాయి. జెండా పట్టుకొని, రొమ్ము చరుచుకున్నంత మాత్రాన దేశభక్తి ఉన్నట్లా? అన్న కరీముల్లా మాటలు ఆలోచింపచేశాయి. మాతృభూమి మీద మమకారం చూపెట్టడానికి జెండాలు, కర్రలు, కొలబద్దలు కావన్నది నూటికి నూరుశాతం నిజం. కరీముల్లా ఆవేదన ఆలోచింప జేసింది. ముస్లింలు భారతీయులు కారా? ఈ భారత గడ్డ ఒక్కరిదేనా? అందరిది కాదా? ముస్లింల పట్ల ముభావంగా ఉండటం తగునా? కరీముల్లా రచన కుహనా దేశ భక్తులకు హితబోధ కావాలి.

- ఎం.డి.ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్.

రంజింప చేసిన సోమనాథపుర దేవాలయం

మన భారతీయ శిల్పకళ, సంస్కృతి, సాహిత్యం అద్భుతం! ప్రాచీన శిల్పకళా వైభవాలను పరిరక్షించుటకు ప్రభుత్వం



స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ప్రజలు కూడా అప్రమత్తం కావలసి వుంది. మహాబలిపురం, ఖజురహో శిల్పకళా వైభవాలు ఎందరో విదేశీయులకు సైతం అంతరార్థ విశ్లేషణలకు పరిశోధనలకు స్ఫూర్తి నిస్తున్నాయి! ఈ వారం టూరిస్ట్‌గైడ్‌లో చూడచక్కని సోమనాథపురం దేవాలయం విశేషాలు ఆసక్తికరంగా చదివింప చేశాయి. కేశవుడ్ని, జనార్ధనుడ్ని, వేణుగోపాలస్వామి, సోమనాథపురం దేవాలయంలో ప్రతిష్ఠింప చేయడం వలన ఆనాడు కొన్ని ప్రాంతాలలో శివభక్తులకు, విష్ణుభక్తులకు, భేదభావాలు లేవని మాకు అవగాహన అయ్యింది. వ్యాస రచయితకు కృతజ్ఞతలు.

- జె.సుధాకరరావు, కాకినాడ.

ప్రపంచ ప్రముఖుల విశేషాలు ఇవ్వండి

ఆదివారం అనుబంధంలో వస్తున్న శీర్షిక మనలోమాట విజ్ఞాన వినోదాల మిశ్రమంగా చాలా బాగుంటున్నది. రచయితకు అభినందనలు. కవర్‌స్టోరీ, కార్టూన్‌లు, ఔరా శీర్షికలు కూడా బాగుంటున్నాయి. ప్రపంచ ప్రముఖులు, పార్టీ నాయకుల గురించి క్లుప్తంగా వారానికి ఒకరి గురించి ఇస్తే బాగుంటుంది. పరిశీలించగలరు.

- పి.ప్రభాకరరావు, హైదరాబాద్.

'మూడు ముళ్ళు' బాగుంది

20 జూన్ ఆదివారం అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన మూడుముళ్ళు చాలా బాగుంది. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఈ దేశానికి వచ్చి ఉష, దినేష్‌లుగా పేర్లు మార్చుకుని భారతీయ సంప్రదాయం ప్రకారం పెద్దల సమక్షంలో ఒకటి కావడం నిజంగా భారతావనికే గర్వకారణం.

- మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా.

మనలో మాట

సినీమా ప్రేమ

పూర్వం రోజుల్లో సినీమా ప్రేమలు ఎంతో హుందాగా, చూడముచ్చటగా ఉండేవి..

నాయకా, నాయికలు అందమైన దుస్తులు వేసుకుని దూరం దూరంగా ఉంటూ పాటలు పాడుకునేవారు....

తర్వాతర్వాత సినీమా పాటలు రోత పుట్టే విధంగా, జుగుప్స కలిగించేవిగానూ తయారయ్యాయి.....

ఇప్పటి సినీమా కథలైతే ప్రమాదభరితంగానూ, ప్రాణాంతకంగానూ ఉంటున్నాయి...

ఒకనాడు సినీమాల్లో కాలేజీ అధ్యాపకులను ఎంతో గౌరవంగా చూపించేవారు... విద్యార్థులూ అలాగే ఉండేవారు...

మరిప్పుడో.. అధ్యాపకుల్ని జోకర్లుగా చూపిస్తూ అపహాస్యం చేస్తున్నారు. గౌరవప్రదమైన ఆ వృత్తిని అవమానిస్తున్నారు...

ఈ సినీమాలే సమాజంపై చెడు ప్రభావం కలిగిస్తున్నాయని, యువతను పెడమార్గం పట్టిస్తున్నాయని కొందరు పెద్దలంటుంటారు....

సమాజంలో జరుగుతున్నవే తాము తీస్తున్నాం గాని లేనివి కాదు గదా? అని సినీమా వాళ్ళు దీర్ఘాలు తీస్తుంటారు....

ప్రేమ సఫలమైతే పరిణయం, విఫలమైతే విరహగీతాలు పాడుకునే రోజులు పోయాయి...

అమ్మాయి పెళ్ళికి ఒప్పుకుంటే బతికిపోతుంది.. ఒప్పుకోకపోతే చచ్చిపోతుంది.. అడ్డువచ్చిన తల్లిదండ్రులైనా అంతే.....

ఇప్పటి మగ ప్రేమికులు కర్కోటకుల్లా తయారవుతున్నారు..

దీనికంతటికీ సినిమాల్లో చూపించే దృశ్యాలు, పాశ్చాత్య పోకడలే కారణమని చాలామంది అంటున్నారు.....

ఈ చర్చ లోతుల్లోకి వెళితే విత్తు ముందా? చెట్టు ముందా? అనే అంశం ముందుకు వస్తుంది...

ఏమైనా సమాజంలో చాలా దారుణాలు జరుగుతున్నాయి...

ఇలా ఎందుకు జరుగుతున్నాయి? సినీమాలు చూశా, టీవీలు చూశా అనేది ప్రస్తుతానికి అప్రస్తుతం....

కాలేజీ అమ్మాయిలూ బహుపరాక్!

◆

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 6
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

వేలం
కథ ... 9, 19

ఒదిగిన పర్వత శిఖరం
రియల్‌స్టోరీ... 14, 15



మహాబలిపురం
టూరిస్ట్ గైడ్ . . . 21



కళాసాహితి . . . 22, 23



ఇరవై అడుగుల జుట్టు

కొందరు ఎంత కష్టపడినా, ఎన్నిరకాల ఎరువులు వాడినా జుట్టు పెరగదు సరికదా ఉన్నది ఊడిపోతుంది.. వియత్నాంలో ఉన్న ఆ మనిషి ఎత్తేమో ఐదడుగులు, జుట్టేమో ఇరవై అడుగులు. విచిత్రంగా ఉంది కదూ? అవును ట్రాన్ వాన్ హే అనే 67 సంవత్సరాల వృద్ధుడు 31 సంవత్సరాలుగా బార్బర్ షాప్‌కు వెళ్ళడం మానేశాడు. జుట్టు అలా అలా పెరిగి 20 అడుగులై దేశంలో పొడవాటి జుట్టుగల వ్యక్తిగా పేరుగాంచాడు. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇంత పొడవైన జుట్టుగల వ్యక్తి ఇంతవరకూ ఎవరూ లేరు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు ఎక్కించుకోవడానికి ప్రయత్నించవలసిందిగా అతనికి మిత్రులు సలహా ఇచ్చారట. వ్యవసాయదారుడైన వాన్ హే పొలంలో పనిచేయడానికి జుట్టు అడ్డం వస్తోంది. కాళ్లకు, చేతులకు అడ్డం పడే జుట్టుకు ముడులు వేసి జాగ్రత్తగా కాపాడుకుంటూ గిన్నిస్ బుక్ వారికోసం ఎదురు చూస్తున్నాడట?!

ఏసి దిండు!?

భారతీయులు ఎండవేడి తట్టుకోలేక రాత్రుళ్ళు సరిగా నిద్రపోవడం లేదట? ఈ విషయాన్ని అమెరికాలోని ఓ పరుపుల కంపెనీ కనిపెట్టి చాలా జాలిపడింది. వెంటనే వేసవిలో తల కింద చల్లగా ఉంటూ హాయిగా నిద్రపోవడానికి వీలుగా ఎయిర్ కండీషన్డ్ దిండును కనిపెట్టింది. ఆ దిండులో ఎటువంటి ప్రత్యేకమైన యంత్రాలు వాడలేదు. కాని అందులో వాడే మెత్తడి పదార్థాన్ని దేనితో తయారుచేసిందో వెల్లడించలేదు. ఈ దిండు తలకింద ఉంచుకుంటే వేడిగా ఉండే రాత్రుళ్ళు చల్లగా మారిపోతాయట! తెల్లవారుజామున వాతావరణం చల్లబడినపుడు దిండులోని చల్లదనం తగ్గిపోయి శరీరానికి అవసరమైన మేరకే చల్లదనాన్ని ఇస్తుందట?! ఇదేదో బాగానే ఉందిగాని దాని ధర మన రూపాయిల్లో 1350 మాత్రమే?!

సిగరెట్ తాగుతున్నారా? తస్మాత్ జాగ్రత్త!?

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంభవించే విపరిణామాల గురించి ప్రపంచవ్యాప్తంగా చైతన్యం పెరుగుతోంది. మన దేశంలో సిగరెట్ పెట్టెల కింద కంటికి కనిపించని చిన్న అక్షరాలతో మాత్రమే 'సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం' అనే అక్షరాలు ఇంగ్లీష్‌లో కనిపిస్తాయి. సిగరెట్ వాడకాన్ని తగ్గించడానికి, ప్రజలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరగడానికి ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇటీవల ఒక ఉత్తర్వు జారీచేసింది. ఆ దేశంలో అమ్మే సిగరెట్ పెట్టెల మీద పైభాగంలో 30 శాతం, అడుగు భాగంలో 90 శాతం సిగరెట్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు తెలిసేవిధంగా బొమ్మలు, క్యాప్షన్‌లు ముద్రించాలని ఆదేశించింది. పెట్టె పైభాగం మీద కేన్సర్‌తో పాడైపోయిన ఊపిరితిత్తుల రంగుల బొమ్మను ముద్రించాలని సిగరెట్ కంపెనీలకు ఆదేశాలు జారీచేసింది. అడుగున సిగరెట్ తాగడం వల్ల 'మీ గుండెకు కలిగే ప్రమాదం రెట్టింపవుతుంద'ని పెద్ద అక్షరాలతో ముద్రించాలి. ఇక ఆస్ట్రేలియా పౌరులు సిగరెట్ లైటర్ వెలిగించే ప్రతిసారీ కేన్సర్‌తో పాడైపోయిన ఊపిరితిత్తుల బొమ్మను చూడాల్సిందే?!

కార్టూన్ కదంబం


మీ అన్నో, తమ్ముడో లీడరయి వుంటే నా పరిస్థితి గిట్లుండేదా
కెసిఆర్ మేనల్లుడు హరీష్‌కు మంత్రివర్గంలో స్థానం
నారు


పాక్ కొత్త ప్రధాని
ముషార్రఫ్
జమాలీ
ప్రజాస్వామ్య ప్రభుత్వం

ఈయనకే జీవితఖైదు శిక్ష పడాలి...
మహిళలపై ఎస్ఐ అత్యాచారం
ఐఎస్ఐ ఏజెంట్లకు జీవిత ఖైదు — కోర్టు తీర్పు

కావలెను...

WANTED

For a reputed company in Vijayawada

MANAGER
RECEPTIONISTS
OFFICE ASSISTANTS

Experienced / Fresh Candidate with good academic back-ground, fluency in English a[illegible] knowledge of computer ma[illegible] apply to [illegible]
Patamata, Vijayawada-520006.

సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం తెలుసా మీకు?

ఉద్యోగ ప్రకటనలలోను, ఇంటర్వ్యూలలోను ఇలాంటి ప్రశ్న ఉండటం మీరు గమనించే ఉంటారు.

'Yes' అంటే ఆ ఉద్యోగం మీకే !

కావలసిన విద్యార్హతలు, అనుభవం ఉన్నప్పటికీ ఇంగ్లీషు మాట్లాడలేని ఒకే కారణంవల్ల మీకు వచ్చిన అవకాశాలు జారవిడవకండి.

మీ తీరిక వేళలో ప్రతిరోజు అరగంట సమయం కేటాయించి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ అందించే సులభమైన శిక్షణ ద్వారా సరళంగా ఇంగ్లీషులో మాట్లాడటం నేర్చుకోండి.

ఇప్పటికి 16 లక్షలకు పైబడినవారు ఈ శిక్షణ మూలంగా ప్రయోజనం పొందారు.

మీరు కూడా ఈ ప్రయోజనం పొందటానికి క్రింద ఉన్న కూపన్ పూర్తిచేసి ఈ రోజే పంపించండి. శిక్షణకు కావలిసిన పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్‌వద్ద **రూ. 575/-** చెల్లించి తీసుకోండి.

రోజూ అరగంట ప్రాక్టీసు చేయండి. తడబడకుండా ఇంగ్లీషులో మాట్లాడండి.

(044) 24347034

నెంబరుకు ఫోన్ చేస్తే చాలు శిక్షణ పాఠాలు V.P.P. ద్వారా ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి.

—ఇదిగో కూపన్—

నేనూ ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి **రూ. 575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

KPS

పేరు: ....

వయసు:.................... ఆడ ☐ మగ ☐

చిరునామా:..

....

.... పిన్‌కోడ్ ....

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T. Nagar, Chennai-600017.

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R.NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. VANASTHALIPURAM ☎24122464. MEHDIPATNAM ☎55755888. A.S.RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. KARIMNAGAR ☎ 2234883. WARANGAL ☎ 2578946. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.

సిపిఎం పార్లమెంటరీ పార్టీ సీనియర్ నాయకులు సోమనాథ్ ఛటర్జీ 14వ లోక్‌సభలో స్పీకర్ పదవి చేపట్టటంతో 1968లో ప్రారంభమైన ఆయన రాజకీయ జీవితం కొత్త మలుపు తిరిగింది. గత దశాబ్ద కాలంగా ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు అనేక విధాలుగా దుష్ప్రచారం ఎదుర్కొంటున్నాయి. అయితే రెండు మూడు సంవత్సరాలుగా లాటిన్ అమెరికాలోని పలు దేశాల్లో వామపక్షాలు అధికారంలోకి వచ్చాయి. యూరోప్‌లో వామపక్ష కార్మికోద్యమాలు విస్తరిస్తున్నాయి. ఈ తరుణంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఒక మార్క్సిస్టు నేత అత్యున్నత చట్టసభ అధ్యక్షపదవికి ఎన్నిక కావడం ప్రపంచ రాజకీయాలు ఎటు మళ్ళుతున్నాయో తెలుస్తోంది. ఇటీవలి ఎన్నికల్లో దేశంలో వామపక్ష సభ్యులు అత్యధికంగా ఎన్నిక కావడం, లోక్‌సభ స్పీకర్‌గా సిపిఎం నేత సోమనాథ్ ఎన్నిక భారత రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలకు గల ప్రాధాన్యతను తెలియచేస్తున్నాయి.

దిగువ సభకు పెద్ద దిక్కు సోమనాథ్

కొండూరి వీరయ్య

రెండునెల్ల క్రితం ముగిసిన 14వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు దేశాన్ని రెండు విపత్తుల నుండి కాపాడాయి. అందులో ఒకటి అడ్డు అదుపు లేని సరళీకరణ విధానాల ప్రమాదం కాగా దేశాన్ని గతకాలపు చీకటి చరిత్రలోకి నెట్టే బిజెపి హిందూమతోన్మాదం రెండవ ప్రమాదం. ఈ ఓటమికి 13వ లోక్‌సభ చివరి సంవత్సరంలోనే నేపథ్య రచన జరిగింది. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా పార్లమెంట్ వెలుపల జరిగే పోరాటంతో సమన్వయం చేసుకుంటూ పార్లమెంట్ లోపల పోరాటం సాగించాలన్న సిపిఎం నిర్ణయాన్ని అమలు చేయటంలో భాగంగా 2002 చివర్లో అప్పట్లో సిపిఎం పార్లమెంటరీ పార్టీ నాయకునిగా ఉన్న సోమనాథ్ ఛటర్జీ తన నివాసంలో ఎన్‌డిఏ యేతర పార్లమెంటరీ పార్టీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సిపిఎం అగ్రనేతలు జ్యోతిబసు, సూర్జిత్‌లతో పాటు యువతరం నేత సీతారాం ఏచూరి కూడా హాజరయ్యారు. తరువాతి కాలంలో ఈ వ్యూహాన్ని మరింతగా పటిష్టం చేస్తూ పార్లమెంట్‌లో పలు సమస్యలపై బిజెపిని, ఎన్‌డిఏను నిలదీయటంలోను, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టటంలోను సోమనాథ్ ఛటర్జీ తనదైన పాత్ర పోషించారు. అప్పటికే విశిష్ట పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన సోమనాథ్ ఛటర్జీ ఈ కార్యక్రమాల ద్వారా పార్లమెంట్‌లోపలా బయటా మొత్తం ప్రతిపక్షానికి తన గొంతు అరువిచ్చేవారు. తద్వారా తాను అధికారికంగా ఏ పదవినీ అధిష్టించకపోయినా పార్లమెంటరీ రంగంలో సోనియా, వాజ్‌పేయి, అద్వానీల సరసన చేరేంత ఉన్నత స్థాయికి ఎదిగారు.

పార్లమెంటేరియన్లందరికీ సోమనాథ్ 'దాదా'

సహజంగానే దేశంలో అత్యుత్తమ న్యాయవాదుల్లో ఒకరైన ఛటర్జీ పార్లమెంట్‌లో జరిగే చర్చలను తన అనుభవాలు, అవగాహనలతో మరింత పటిష్టం చేశారు. బాబ్రీ మసీదు కూల్చి వేత కేసు విషయమై 2002 డిశంబరులో జరిగిన చర్చ ఈ సందర్భంగా ప్రస్తావించటం సముచితంగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియరంజన్ దాస్ మున్షీ చర్చను ప్రారంభిస్తూ అద్వానీ, మురళీమనోహర్ జోషీ ప్రభృతులపై సిబిఐ ఛార్జి షీటు దాఖలు చేసినందున , అలహాబాద్ హైకోర్టు విచారణ జరుపుతున్నందున వీరు మంత్రి వర్గం నుండి వైదొలగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. మున్షీ ఉపన్యసిస్తున్నంత సేపు బిజెపి నాయకులు అరుణ్‌జైట్లీ, మల్హోత్రా, మహాజన్‌లు అడుగడుగున ఆటంకపెట్టే ప్రయత్నం చేశారు. తరువాత వంతు సోమనాథ్ ఛటర్జీకి వచ్చింది. తన సహజసిద్ధమైన వాదనా పటిమతో పాలకపక్షం నోరు మూయించటమే కాక మొత్తం చర్చకు ఒక దిశను నిర్దేశించారు ఛటర్జీ! అనంతరం జోక్యం చేసుకున్న మాజీ ప్రధాని చంద్రశేఖర్ మొత్తం చర్చకు దిశా నిర్దేశం చేసిన ఛటర్జీకి సభా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆ చర్చకు సమాధానమిచ్చిన అప్పటి ప్రధాని వాజ్‌పేయి కూడా తన ప్రసంగం మొత్తాన్ని సోమనాథ్‌ను ఉద్దేశించి చేయటం గమనార్హం. గత ముప్పై ఏళ్లలో ఈ విధంగా సభలో ప్రశంసలు పొందిన సందర్భాలు సోమనాథ్‌కు కోకొల్లలని పార్లమెంట్ వార్తలు కవర్ చేసే సీనియర్ జర్నలిస్టులు చెప్తుంటారు. పాలకపక్షంలో ఎంత పెద్ద నాయకుడైనా సోమనాథ్ ప్రశ్న వేస్తున్నాడంటే ఇతరులకు ఇచ్చినట్లు దాటవేత సమాధానం ఇచ్చి సరిపెట్టలేరు. అంతేకాదు, ఒళ్లు దగ్గరపెట్టుకుని సమాధానం ఇవ్వకపోతే సభలో పరువు పోతుందన్న భయం ఉండేది. తన రచనలతో అందరినీ ఇరుకున పెట్టే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మాజీ ఎడిటర్ అరుణ్‌శౌరీ సైతం సోమనాథ్ ఛటర్జీ మాట్లాడుతుంటే చేతులు కట్టుకుని బుద్ధిమంతుడైన విద్యార్థిలాగా వింటారు. ఆయన పెట్టుబడుల ఉపసంహరణ శాఖ మంత్రిగా పని చేసిన సంగతి పాఠకులకు తెలిసే ఉంటుంది. ఒకప్పుడు ఇదే శౌరీ ప్రజాస్వామిక విలువల కోసం సాగిన ఉద్యమంలో జూనియర్‌గానే అయినా సోమనాథ్‌తో కలిసి పని చేశారు. అటువంటి శౌరీ బిజెపి పక్షాన

కొత్త పాత్రలో కొత్త బాధ్యతలు

ఎన్నో ప్రత్యేకతలు సముపార్జించుకున్న సోమనాథ్ చటర్జీ ఎన్నటికీ పార్టీ విషయంలో మాత్రం క్రమశిక్షణ కలిగిన సైనికునిగానే ఉంటారు. గతంలో ఒకసారి లోక్‌సభ స్పీకర్ పదవి అధిష్టించేందుకు అవకాశం వచ్చినా పార్టీ ఆదేశానుసారం తిరస్కరించానని ప్రజాశక్తికి తెలిపారు. స్పీకర్ హోదాలో కొత్త సభ్యులకు పార్లమెంటరీ సంప్రదాయాలు నేర్పేందుకు తన అవకాశాన్ని వినియోగించుకుంటునానని, ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని కాపాడేందుకు పార్లమెంట్ ప్రధాన వేదిక కావాలని ఆయన అంటున్నారు. రాజకీయాల్లోకి యువతరం రావటం తగ్గుతున్న సమయంలో ఇటువంటి అనుభవజ్ఞులు ఏ పార్టీలో ఉన్నా వారి అడుగుజాడలు అనుసరణీయం అని స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగే అభినందన సభల్లో పలువురు వ్యాఖ్యానించటం ఆయన విశిష్టతకు నిలువెత్తు నిదర్శనం. నిజంగా సోమనాథ్ రాజకీయ జీవితం పరిశీలిస్తే లోక్‌సభలో జూన్ 4వ తేదీన రాంవిలాస్ పాశ్వాన్ అన్న మాటలు గుర్తుకురాక మానవు. తాను సహజ వామపక్ష వాదినని, అందువలన తనకు వామపక్షం వైపు కూర్చునే ప్రతిపక్షం పట్ల కరుణ చూపుతానని సోమనాథ్ చేసిన ప్రకటనకు పాశ్వాన్ స్పందిస్తూ, దళితులు, పీడితులకు నిజమైన ప్రాతినిధ్యం వహించే సిపిఎం అగ్రనేత లోక్‌సభలో స్పీకర్‌గా ఎన్నిక కావటంతో దేశంలో అణగారిన వర్గాలకు నిజమైన సోమనాథ్ జైత్రయాత్ర నేడే మొదలయ్యిందని వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే దేశానికి రక్ష అని లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ అభిప్రాయపడుతున్నారు. ప్రజాశక్తి ఢిల్లీ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రజాస్వామ్యం, పార్లమెంట్, ఎంపీల గురించి ఆయన వెల్లడించిన అభిప్రాయాలు క్లుప్తంగా ఇలా ఉన్నాయి.

గతంలో పోల్చితే ఎంపీల స్థాయిల్లో దిగజారుడుతనం ఉందంటారా?

ఆమాట నేననను. కానీ అప్పటి నిబద్ధత ఇప్పుడు కనిపించటం లేదని మాత్రం చెప్పగలను, అప్పట్లో ఎంపీగా ఎన్నికయిన తర్వాత పార్టీల కతీతంగా ప్రజా సమస్యలపై కేంద్రీకరించేవారు. అవసరమైతే ఉమ్మడిగా ప్రభుత్వాన్ని నిలదీసేవారు. ఇప్పుడు కంపార్ట్‌మెంటలిజం ఎక్కువయ్యింది. సమస్య వాస్తవమని అంగీకరించినా పార్టీ పరిధి దాటి బయటికి రాలేకపోతున్నారు. పార్లమెంట్ వెలుపల రాజకీయ రంగంలో ఉండే సంక్లిష్టత వారిపై కూడా ప్రభావం చూపుతోంది.

పార్లమెంట్‌లో ప్రజా సమస్యలు చర్చించే సమయం తగ్గిపోతుందని విమర్శలు వస్తున్నాయి. మీ వ్యాఖ్య ఏమిటి?

ఈ మాటలో అనుకున్నంత నిజం లేదు. పార్టీల అవగాహనతో పాటే పార్లమెంట్ నిర్వహణ కూడా మారుతుంది. ద్రవ్యసంబంధమైన బిల్లులపై పార్లమెంట్‌లో చర్చించే సమయం దొరకటం లేదు. అందవలన స్థాయీ సంఘాలు పని చేస్తున్నాయి. వీటిలో చర్చ ఉపయోగకరంగా ఉంటుంది. అయితే స్థాయీ సంఘాల సమావేశాలకు, నివేదికలకు ఎంపీలు, పార్టీలు ప్రాధాన్యత ఇవ్వటం లేదు. కేవలం అది అధికారుల పనిగా మారుతోంది. పత్రికలు కూడా స్థాయీసంఘాల నివేదికలకు ఇవ్వవల్సినంత ప్రాధాన్యత ఇవ్వటంలేదు. చట్టసభలు ప్రజా సమస్యలపై చర్చకు నిజమైన వేదికలుగా మార్చటానికి అందరమూ కృషి చేయాలి.

స్పీకర్‌గా మీ ప్రాధాన్యతలు ఏమిటి?

పార్లమెంట్‌ను నిజమైన ప్రజా ప్రాతినిధ్య సంస్థగా మార్చటమే నాముందున్న ఏకైక ప్రాధాన్యత. మరో ప్రత్యామ్నాయం సాధించగలిగే వరకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మించిన ప్రత్యామ్నాయం లేదు. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని డేగ కన్నుతో పరిశీలిస్తుండాలి. ప్రజా ప్రయోజనాలకు కస్టోడియన్‌గా వ్యవహరించగలగాలి. పార్లమెంట్ రాజ్యాంగం ఇచ్చిన బాధ్యతలను సంపూర్ణంగా నెరవేర్చగలిగిన సంస్థగా రూపొందించాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలకు విశ్వాసం కలిగేలా చట్టసభలు నిర్వహించాలి. నియమనిబంధనలకనుగుణంగా సభను నిర్వహించటం, ప్రజాసమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి చర్చ జరిగేలా చూడటం ప్రధాన కర్తవ్యం.



లోక్‌సభ కెప్టెన్ సోమనాథ్‌తో భారత క్రికెట్ కెప్టెన్ గంగూలీ

చేరి ఒక సారి సభలో మంత్రిగా ప్రభుత్వరంగ పరిశ్రమలు తాకట్టు పెట్టటమే కాక, స్వేఛ్ఛావాదిగా ఉన్న శౌరీ సంఘపరివారంలో సిద్ధాంతవేత్తగా మారి తన ఆలోచనలనే తాకట్టు పెట్టారని విమర్శించటంతో ఒక్కసారిగా సభ నివ్వెరపోయింది. పాలక ఎన్‌డిఎ తరపున వాజ్‌పేయి మొదలు, అద్వానీ ఫెర్నాండెజ్ వంటి ద్వితీయ శ్రేణి నేతలు, కొత్తగా సభలోకి వచ్చిన జ్యోతిరాదిత్య సింధియా వరకు, అంతేకాదు, చివరకు స్పీకర్ స్థానంలో ఉన్న వారు సైతం సోమనాథ్ ఛటర్జీని దాదా (పెద్దన్నయ్య) అని గౌరవంగా సంభోధించటం ఆయనకు పార్లమెంట్‌లో గల ప్రతిష్టను తెలియచేస్తుంది. ఈ విధంగా తనకంటూ ఒక చరిత్రను రూపొందించుకున్న సోమనాథ్ ఛటర్జీ పుట్టింది భద్రలోక్‌గా పిలువబడే బెంగాలీ కులీన వంశంలోనైనా తనకంటూ ఒక రాజకీయ అవగాహన ఏర్పడింది మొదలు పీడితుల హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. ఒక్క ఉదాహరణ చెప్పాలంటే న్యాయవాదిగా బెంగాల్‌లోను, దేశవ్యాప్తంగాను కార్మికుల పక్షాన వేలాది కేసులు వాదించిన ఛటర్జీ ఒక్క కేసులోకూడా నయా పైసా ఆశించలేదంటే ఆయన ఎటువంటి విలువలకు కట్టుబడి ఉంటారన్నది తెలుసుకోవచ్చు.

న్యూఢిల్లీ సందర్శించిన పాక్ ప్రజాప్రతినిధుల బృందంతో సోమనాథ్

కుటుంబ నేపథ్యం

సోమనాథ్ తండ్రి ఎన్.సి. ఛటర్జీ కూడా న్యాయశాస్త్రంలో మేధావి. స్వాతంత్ర్యానికి ముందు కలకత్తా హైకోర్టు జడ్జిగా పని చేశారు. తండ్రి నుండి ప్రాథమిక రాజకీయ పాఠాలు నేర్చుకున్న సోమనాథ్ తాను విద్యార్థి దశలో ఏమంత ప్రతిభావంతుడైన విద్యార్థిని కాదని చెప్తారు. అప్పట్లో కులీన, మధ్యతరగతి బెంగాలీలు చదువుకునే మిత్రో పాఠశాలలో ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం, కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో అర్ధశాస్త్రంలో బిఎ ఆనర్స్ పూర్తి చేశారు. ఆ సమయంలో సోమనాథ్ తండ్రి ఒక సమావేశానికి హాజరయ్యేందుకు లండన్ వెళ్లటం, ఆ సమావేశంలో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌తో పరిచయం కావటంతో యూనివర్శిటీ వెళ్లి అక్కడి బోధనా పద్ధతులు చూసి సోమనాథ్‌ను కేంబ్రిడ్జికి పంపాలని నిర్ణయించుకుని వచ్చారు. తర్వాత డిగ్రీలో ఆయనకు వచ్చిన పట్టా యూనివర్శిటీకి పంపటం , వారు అంగీకరించి సీటు ఇవ్వటం జరిగాయని తన గతాన్ని ప్రజాశక్తికి వివరించారు. స్వాతంత్ర్యానికి పూర్వపు సంగతి ఇది. అప్పటికే బెంగాల్‌లో ప్రభవించిన సాంస్కృతిక పునరుజ్జీవనం, రాజకీయ చైతన్యం సోమనాథ్‌ను కూడా ప్రభావితం చేశాయి. అయితే తల్లిమాత్రం వీటికి దూరంగా ఉండేది. తల్లి ఒత్తిడి మేరకు ఇంగ్లండ్ పయనమయ్యే ముందే చిన్న వయసులో పెళ్లి చేసుకోవాల్సి వచ్చిందని నవ్వుతూ చెప్తారు సోమనాథ్. ఆయనకు ఇప్పుడు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ఇద్దరు కొడుకులు న్యాయవాద వృత్తిలో తమకంటూ గుర్తింపు తెచ్చుకున్నవారే అని చెప్పేటప్పుడు సోమనాద్ ముఖంలో వెలుగు కొట్టొచ్చినట్లు కనిపించింది. ఆయనకు ఓనమాలు నేర్పిన మిత్రో పాఠశాల ప్రస్తుతం వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్నది. ఈ సందర్భంగా జరిగే ఉత్సవ కమిటీకి సోమనాథ్ అధ్యక్షులు!

రాజకీయ ఓనమాలు

విద్యార్థి దశలో ఉన్న సోమనాథ్‌పై స్వాతంత్ర్యోద్యమం నాటి ఉద్యమాలు, ఆందోళనల ప్రభావం ఉన్నది. అయితే మధ్యతరగతికి ఉండే సహజమైన పరిమితుల కారణంగా కార్యకర్తగా మాత్రం తయారు కాలేదు. ఆయన లండన్ నుండి తిరిగి వచ్చేటప్పటికి సోమనాథ్ తండ్రి బెంగాల్‌లో ప్రముఖ పౌరహక్కుల ఉద్యమ నాయకునిగా ఎదిగారు. స్వాతంత్ర్యానంతరం తొలిసంవత్సరాల్లో నిర్బంధం ఎదుర్కొంటున్న పలువురు ఉమ్మడి కమ్యూనిస్టు నాయకులకు ఆయన లాయర్‌గా పని చేశారు. మొదటి, రెండవ లోక్‌సభల్లో ఆయన హిందూమహాసభ తరపున ఎంపీగా కూడా ఎన్నికయ్యారు. క్రమంగా జాతీయ రాజకీయాల్లో హిందూ మహాసభ పాత్ర కుదించుకుపోయిందని, అది తిరిగి విస్తృతమైన ప్రజా ఉద్యమం రూపం నుండి సంకుచితమైన మతోన్మాద ఉద్యమం దిశగా పయనిస్తోందని గుర్తించిన సోమనాథ్ తండ్రి క్రమంగా హిందూమహాసభకు దూరమయ్యారు. ఈ కాలంలోనే ఆయన ప్రజాస్వామ్య ఉద్యమ నాయకునిగాను, పౌరహక్కుల ఉద్యమనాయకునిగా పని చేస్తూ కమ్యూనిస్టు అగ్ర నేతలైన జ్యోతిబసు, ఎస్‌కె ఆచార్య, సుందరయ్యలతో పరిచయం పెంచుకున్నారు. క్రమంగా వీరి ప్రభావానికి లోనయి కమ్యూనిస్టు సానుభూతిపరునిగా మారారు. ఇదేసమయంలో సోమనాథ్ కలకత్తా బార్ అసోసియేషన్‌లో పేరున్న యువన్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తండ్రి సలహా మేరకు తొలుత వృత్తిలో తనదైన గుర్తింపు సాధించుకుని తర్వాత ఇతర రంగాలవైపు దృష్టి మళ్లించాలని నిర్ణయించుకున్నానని సోమనాథ్ తెలిపారు. న్యాయవాదిగా ఉంటూనే సోమనాథ్ కార్మికుల కేసులు వాదించటం ప్రారంభించారు. క్రమంగా కార్మికుల సమస్యలతో మమేకం అయ్యారు. కార్మిక న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజాదరణ కూడా సంపాదించారు. వివిధ కార్మిక సంఘాలకు గౌరవాధ్యక్షునిగా ఉన్నారు. అదేసమయంలో జరిగిన పార్లమెంట్ మూడవ సాధారణ ఎన్నికల్లో సోమనాథ్ తండ్రి వామపక్షాలు బలపర్చిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత పార్టీ కార్యకర్తగా పని చేయటం ప్రారంభించారు. ఇదేకాలంలో కలకత్తా బార్ అసోషియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా ఉన్న ఎస్‌కె ఆచార్యకు సోమనాథ్ సన్నిహితులయ్యారు. ఆయన ప్రభావమే తాను రాజకీయాల్లోకి రావటానికి ప్రధాన ప్రేరణ అంటారాయన. తరువాత వచ్చిన నాలుగవ లోక్‌సభ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా పోటీ చేయాలని పార్టీ కోరటం, అంతకు ముందే పార్టీ సభ్యత్వం తీసుకున్న సోమనాథ్ దానికి అంగీకరించటం జరిగాయి. నాటి నుండి నేటి వరకు పార్లమెంటరీ రంగంలో తిరుగులేని నాయకునిగా తన ముద్ర వేసుకున్నారు.

అగ్రనేతల సహచర్యంలో రూపుదిద్దుకున్న వ్యక్తిత్వం

సోమనాథ్ చటర్జీ తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టే నాటికి పార్లమెంట్ రాజకీయాల్లో తమ చరిత్రను సుస్థిరం చేసుకున్న నేతలు, మహామహులనదగిన ఎ.కె.గోపాలన్, హీరేన్ ముఖర్జీ, సమర్ ముఖర్జీ, జగజ్జీవన్‌రాం, మధులిమాయె, వై.బి.చవాన్ వంటి ఉద్దండులతో నిండి ఉండేది. వీరిలో ఒక్కొక్కరు మొత్తం పార్లమెంట్‌ను నియంత్రించగల శక్తి సామర్థ్యాలు, రాజకీయ అనుభవం, సమస్యలపై పట్టు కలిగిన వారు. వారితో తాను కలిసి పని చేయటం ద్వారా పలు విషయాలు నేర్చుకునేందుకు అవకాశం కలిగిందని ఆయన అంటారు. అదేసమయంలో భారత ప్రజాస్వామ్యం ఎమర్జెన్సీ పడగ నీడలో ఉంది. ఇందిరాగాంధీ కబంధ హస్తాలనుండి ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను, పార్లమెంట్‌ను కాపాడేందుకు ఉద్యమం ప్రారంభించిన వారిలో పైన ప్రస్తావించిన ఉద్దండులు కొందరు. ఈ ఉద్యమంలో మమేకమయ్యారు సోమనాథ్ ఛటర్జీ. అతి చిన్న వయసులోనే పార్లమెంట్‌లో కీలకమైన ప్రివిలేజెస్ కమిటీకి ఆయన అధ్యక్షునిగా పని చేశారు. తనకున్న అపార న్యాయ శాస్త్ర విజ్ఞానంతో తనకు ఏ బాధ్యత అప్పగించినా తనదంటూ ప్రత్యేకతను నిరూపించుకునేవారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయటం, అవగాహన చేసుకోవటం ఆయనకు మొదటి నుండీ ఉన్న అలవాటు. ఈ అలవాటు ఆయనను పార్లమెంటరీ వ్యవహారాల్లో ఇతరులకంటే అగ్రభాగాన నిలబెట్టేందుకు దోహదం చేసిందని చెప్పవచ్చు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన 25సంవత్సరాలు అయిన సందర్భంగా పార్లమెంట్ సచివాలయం ప్రచురించిన పుస్తకంలో సోమనాథ్ రాసిన ఎమర్జెన్సీ - 25 సవంత్సరాలు అన్న రచనను కూడా ప్రచురించారు. మరో మాట ఈయన గురించి చెప్పాల్సి ఉంది. సాధారణంగా దీర్ఘకాలం పార్లమెంట్‌లో ఉంటే అధికార వ్యామోహానికి సంబంధించి పలు భ్రమలు ఏర్పడటం చూస్తున్నాము. పదవి రాలేదని ఏకంగా కొత్తగా పార్టీలే పెట్టిన వారు మన ముందున్నారు. కానీ సోమనాథ్ పార్లమెంటరీ రంగం మొత్తం సమాజాన్ని మార్చేందుకు బయట జరుగుతున్న రాజకీయ పోరాటానికి ఉపాంగమే అని విశ్వసించే వ్యక్తి. అందువల్లే 35ఏళ్ల పాటు ఎంపీగా ఉన్నా ఏ ఇతర ప్రభావాలకు లోనుకాకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారు. పలు కమిటీలకు నాయకత్వం వహించిన సోమనాథ్‌పై ప్రత్యర్థులు రాజకీయప్రయోజనాల కోసం చేసే ఆరోపణలు మినహా మరేఇతర అవినీతి, ఇతర పొరపాట్లకు సంబంధించిన ఆరోపణలు ఒక్కటి కూడా కనిపించవంటే ఆయన వ్యక్తిత్వం, వ్యక్తిగత నడవడిక ఎలా ఉంటాయన్న సంగతి తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. నేటికీ అప్పుడప్పుడూ పార్టీ వాదనను రాజ్యాంగపరమైన అంశాలపై వినిపించాల్సి వచ్చినప్పుడు సోమనాథ్ కోటు వేసుకుని కోర్టుకెళ్లుతూ ఉంటారు. 75 ఏళ్ళు వచ్చినా ఆయనకు చదువు, విజ్ఞానసముపార్జన పట్ల మోజు తగ్గలేదు. అందువల్లే ఆయన నివాసంలోకి ఎప్పుడు వెళ్లినా పుస్తకాభిమానులకు కనుల పండుగగా ఉంటుంది. ◆



మొలకలపల్లి కోటేశ్వరరావు

ఉదయం నిద్రలేచిన దగ్గర్నించీ రుసరుస లాడుతూ వుంది సుగుణ. మనసంతా అశాంతిగా, ఆందోళనగా, కోపంగా వుంది. భర్త వెంకటేశ్వర్లు వేకువజామునే లేచి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

టీ నీళ్ళకోసం ఇంట్లోకీ, వీధి వాకిట్లోకీ పదిసార్లు తిరిగి, తను టీ ఇచ్చిన తరువాత తాగి వెళ్ళేవాడు. ఇవ్వాళ నిద్రలేచీ లేవకముందే రెండు జోళ్ళు నీళ్ళు తీసుకొచ్చి పడేసి వెళ్ళిపోయాడు.

రాచకార్యాలు ఏమైనా వున్నాయా అంటే అవేమీ కాదు. ముఖం తప్పించాడు.

సుగుణ ఇంకా పొయ్యి ముట్టించలేదు.

కనీసం వీధి వాకిట్లో అయినా కసువు చిమ్మి, కళ్ళాపి చల్లి ముగ్గు వేయలేదు ఈ రోజు. అసలు ఏ పనీ చేయబుద్ధి కావడం లేదు.

"ప్రయివేటుకి టయమవుతుంది, జడవేయమ్మా!" అంటూ వచ్చింది సౌమ్య.

"గూట్లో దువ్వెన వుండిద్ది, తెచ్చుకో" అంది సుగుణ. పంచలో గుండని ఆనుకుని దిగులుగా కూర్చున్న సుగుణ దగ్గరకి దువ్వెన, నూనె, అద్దం తెచ్చుకుని కూర్చుంది సౌమ్య.

దాదాపు నాలుగు నెలల నించీ ఈ సమస్య నలుగుతోంది. డబ్బు కట్టి బంగారం విడిపించుకుపొమ్మనీ, లేకపోతే వేలం వేస్తామనీ నాలుగు నెలల నాడు బ్యాంకు వాళ్ళు మొదటి నోటీసు ఇచ్చారు. రెండు నెలల క్రితం మళ్ళీ మరో నోటీసు కూడా పంపించారు. 20 రోజుల నాడు మళ్ళీ మూడో రోజు నోటీసు, ఇదే చివరి నోటీసు అనీ, ఇక వేలం వేయడం ఖాయమనీ!

మొదటి నోటీసు వచ్చిన రోజు నించీ తను భర్తతో పోరు పెడుతూనే వుంది. మనిషికి కనీసం చీమకుట్టినట్టయినా లేదు.

తాను పోరు అధికం చేయడంతో ఒకసారి తనమీద చేయిచేసుకున్నాడు. అయినా తను తగ్గదలుచుకోలేదు. కాస్తాకూస్తా కాదు. ఐదు సవర్ల బంగారం. తనకి పెళ్ళప్పుడు పుట్టింటి వాళ్ళు పెట్టింది.

"అమ్మా..." జుట్టుని లాక్కుంటూ, ముందుకి జరిగి కేక పెట్టింది సౌమ్య. "ఏం మాయరోగం వచ్చిందే?" విసుక్కుంటూ అంది సుగుణ.

"మాయరోగం నాక్కాదు, నీకు! జుట్టు లాగా జడేసేదీ? ఎంత నొప్పి పుట్టిపోయిందో!"

పరధ్యానంగా వుండటంతో జుట్టు లాగిందేమో సుగుణ ఆ విషయం గుర్తించలేదు.

"సరే ఇటు చావు"

"నువ్వు సరిగా జడవేస్తే వేయి, లేకపోతే లేదు. నేనే వేసుకుంటా!"

"సరిగా అంటే ఇంక ఎట్టేస్తారే? నువ్వు కుదురుగా తలకాయ వుంచు కొక్కెర తెగులు తగిలిన కోడి పెట్ట మెడతిప్పినట్టు తిప్పవాకు!" "అమ్మా..." నెమ్మదిగా పిలిచింది సౌమ్య. "ప్రైవేటు మాష్టారు రోజూ ఫీజు అడుగుతున్నాడే! ఇయ్యని వాళ్లని నించో పెడతన్నాడు. ఇయ్యాల కానీ ఇయ్యకపోతే ఇంటికి పంపిస్తానన్నాడే!"

"నన్ను అడిగితే నేనేం చేసేదే! మీ అయ్యని అడుగు ఇస్తాడో, అగోరిస్తాడో!" కోపంతో రగిలిపోతూ అంది సుగుణ.

"నిన్న అడిగితే నాల్రోజుల్లో చూద్దామన్నాడే! ఏం చూట్టమో, ఏం పాడో! రెండు నెల్లునించీ అదేమాట!"

"మాకు బిడ్డల్ని చదివించుకునే రాత కూడా లేదులే! తోటోళ్ళు అందరూ ఎట్టా వున్నారూ మనం ఎట్ట వున్నాం? దేశంలో జనాభా తక్కువని పుడతారు ఇసుంటి మనుషులు!"

అసహనంతో సుగుణకి కోపం, ఏడుపు, బాధ కలుగుతున్నాయి. నానుతాడు, రెండుగాజులు, ఒంటిపేట గొలుసు కళ్ళలో మెదులుతున్నాయి. కళ్ళు మూసినా అవే, తెరిచినా అవే!

తన రెండో తోడికోడలికి 50 సవర్ల బంగారం వుంది. మూడోతోడి కోడలికి కూడా 20 సవర్ల బంగారం.

తనకి ?... పెద్దకోడలు తను! ఉన్న 5 సవర్లూ వేలానికి వచ్చింది. వేలం ఇవ్వాళే!

వారం రోజుల నాడు వేలం వేస్తున్నామని పేపర్‌లో కూడా ప్రకటన ఇచ్చారు, బ్యాంకు వాళ్ళు. నిన్నటి వరకూ కనీసం బ్యాంకులో అయినా వుందనే ఆశ వుంది. ఇవ్వాల్టితో దింపుడు కళ్ళం ఆశని కూడా వదులుకోవాల్సిందే! తన బిడ్డలు ఇద్దరికీ రేపట్నించీ ముక్కు పుడక సైతం వుండదు.

ఉమ్మడి సంసారంలో పదకొండేళ్ళపాటు గొడ్లు మాదిరిగా చాకిరీ చేశారు తనూ, భర్తా! ఆయనగారి ఇద్దరి తమ్ముళ్ళనీ చదివించారు.

చివరికేమైంది?

వాళ్ళు బాగా స్థిరపడ్డారు,
తాము చితికిపోయారు.

ఇవ్వాళ పెద్ద మరిదీ, అతని భార్యా గవర్నమెంటు స్కూలు టీచర్లు, జతమీద నెలకి 15, 16 వేలు సంపాయించుకుంటున్నారు. ఆమెకి 50 సవర్ల బంగారం. ఇద్దరు మగపిల్లలు.

చిన్న మరిది హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంచి జీతమే! వాళ్ళకి ఒక కొడుకూ, ఒక కూతురు. 20 సవర్ల బంగారం వుంది వాళ్ళకి.

వాళ్ళు జీవితంలో స్థిరపడి సుఖంగా బతుకుతున్నందుకు కాదు తనకి బాధ! అన్నా వదినా కష్టపడి చదివించారనే కనీస విశ్వాసం కూడా లేకపోయిందనే బాధ!

ఉమ్మడిగా వున్నది 13 ఎకరాల పొలం.

పెళ్ళి కావాల్సిన ఆడబిడ్డ వుంది. అత్తమామలు. వాళ్ళ ముగ్గురికీ కలిపి 4 ఎకరాలు పంచి మిగతా 9 ఎకరాలూ అన్నదమ్ములు ముగ్గురూ మూడేసి ఎకరాలు తీసుకున్నారు.

ఇంట్లో వున్న చెంబు, కంచం, మంచం, గ్లాసుతో సహా భాగాలు వేసి పంచుకున్నారు.

అత్తమామలు ఇద్దరికీ చిన్నకొడుకులు ఇద్దరి మీదనే భ్రమలు వున్నాయి. పనిచేసే వాళ్ళంటే చిన్న చూపు, చులకన!

"నాకు పెళ్ళయ్యి పదకొండేళ్ళు. అంతకుముందు మూడేళ్ళ పాటు తమ్ముళ్ళు చదువుకుంటుంటే ఆయన పొలం పని చేశాడు. వాళ్ళ చదువులకు చాలా ఖర్చయ్యింది. ఉమ్మడిగా ఉంటూ పని చేసినందుకు మాకూ, వాళ్ళకీ సమాన భాగమేనా? మాకు ఎక్కువ ఏం ఇవ్వరా?" అని పంచడానికి వచ్చిన పెద్ద మనుషుల్ని అడిగింది తనే.

"మీరు వూరక చేశారా ఏంది? తిన్నారూ, చేసారూ! కోరిన తిండి తిన్నారు, కోరిన గుడ్డ కట్టుకున్నారు. మా భాగం పొలం మగతాకి ఇచ్చుకుంటే మాకు డబ్బు రాకపోయిందీ? మా మగతా కంటే ఎక్కువ ఖర్చు పెట్టామా మేము? ఇంటరు ఇంట్లో తినిపోయి చదువుకుని

(మిగతా 19వ పేజీలో)

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

వాస్తవికతకు దూరమైన కథలు!

హ్యారీ పాటర్!
హ్యారీ పాటర్!

ఎవరు చూసినా అదే పాట. ఎవరిని అడిగినా అదే ముచ్చట. అవే పుస్తకాలు చదవటం! అవే సినిమాలు చూడటం! తీరా చూస్తే ఏముంది వాటిల్లో... మన పాతాళభైరవి కథలాగా గులేబకావళి సినిమాలాగా మాయలు మంత్రాలు! భూతాలు! రాక్షసులు! వింత వింత ఆకారాలు! వాటితో హీరో పోరాటాలు, యుద్ధాలు. దయ్యాలు, భూతాల మీద, మాయలు మంత్రాల మీద నమ్మకం కలిగించేలాగా ఏమిటీ కథలు! సినిమాలు! పిల్లల్ని పెడదారి పట్టించి అమానుష శక్తుల మీద నమ్మకం కలిగించేవిగా వున్నాయి.... అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మాలిని ఒక్కతె లోపలికి తలుపు తోసుకొని వచ్చింది.

"ఏం మాలినీ! ఆదిత్య ఏడి? సెలవుల్లో ఊరికెళ్ళాడా ఏమిటి?" అడిగాను.

"లేదు ఆంటీ! ఫ్రెండ్స్‌తో హ్యారీ పాటర్ సినిమాకు వెళ్ళాడు. ఇప్పుడే పంపించి ఇటు వస్తున్నా. నాతో ఒకసారి చూశాడు హారీ పాటర్. మళ్ళా ఫ్రెండ్స్‌తో వెళ్తానని వెళ్ళాడు" అంది మాలిని.

"పెద్ద వాళ్ళు చిన్నవాళ్ళు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. ఈ హ్యారీపాటర్ సినిమాలు" అన్నాన్నేను.

"అవును ఆంటీ! హ్యారీ పాటర్ నవలలన్నా, సినిమాలన్నా నాకూ ఇష్టమే" అంది మాలిని.

నేను మాలిని మాటలు విని చిరునవ్వు నవ్వాను.

"హ్యారీ పాటర్... నాలుగు నవలలు వచ్చాయి. నాలుగు నవలలూ విపరీతంగా అమ్ముడుపోయాయట. అంతేకాదు ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువాదమై ఆ నవలలు బోలెడు అమ్ముడుపోయాయట. ఆ నవలల రచయిత్రి జె.కె.రౌలింగ్ ఇప్పుడు ప్రపంచంలో అతి ధనవంతుల పక్కన స్థానం సంపాదించుకుందట!" అన్నాన్నేను.

"అవును ఆంటీ! ఆ నవలలు చదువుతుంటే చాలా గమ్మత్తుగా వుంటాయి. బాగా విడిచిపెట్టకుండ చదివించేట్లుగా వుంటాయి" అంది మాలిని. ఆమె కండ్లు ఆనందంతో మెరుస్తున్నాయి.

"నిజమే! అట్లా చదివించేట్లుగా వున్నాయి కాబట్టే వందల కొద్ది పేజీలున్నా పాఠకులు విసుగూ విరామం లేకుండా ఆ నవలల్ని చదువుతున్నారు. మొత్తం మీద ఆ సాహిత్యం పిల్లల్ని ఆకర్షించి వాళ్ళల్లో మళ్ళా చదివే ఆకాంక్షను పెంచింది. లేకపోతే టీవీల ముందు కూర్చొని సృజనాత్మకత చంపేసే ఆ ప్రోగ్రామ్‌లు చూస్తుండే వాళ్ళు. అది పోయి మళ్ళా పుస్తకాల వైపు మళ్ళించాయి ఈ నవలలు అందర్నీ" అన్నాన్నేను.

"అవును ఆంటీ! ఆ నవలల్ని చదువుతుంటే ఈ లోకాన్నే మరచిపోతాం. చకచక కథ, సంఘటనలు నడిచిపోతుంటాయి" అంది మాలిని మళ్ళా ఉత్సాహంగా.

"మాలినీ! నువ్వన్నట్లు ఆ నవలల్లో చదివించే భాష, శైలి వున్నాయి. మా పిల్లలు చిన్నగా వున్నప్పుడు ఎనిడ్ బ్లైటన్ మొదలైన వాళ్ళు రాసిన నవలలు వచ్చేవి. ఆ నవలల్లో పిల్లల సాహసకార్యాలుండేవి. పిల్లల్ని ఉత్సాహవంతులుగా చేసే ఇతి వృత్తాలుండేవి. తోటిమానవులకు సాయం చేయాలి. జంతువుల మీద ప్రేమ కరుణ చూపాలి అని జీవిత క్రమాన్ని బోధించే ఇతి వృత్తాలు, కథలు సంఘటనలుండేవి. కాని ఇట్లా సమాజంతో సంబంధం లేని మాయలు మంత్రాలు, దయ్యాలు భూతాలుండేవి కావు. ఈ నవలలు, సినిమాలు మన విఠాలాచార్య సినిమాలను గుర్తుకు తెస్తున్నాయి. వాటిల్లో ఇతివృత్తం రాజులు, రాజకుమారులకు సంబంధించినవి కాబట్టి అవి ఏ కాలానికో సంబంధించినవిగా మనల్ని ఊహాలోకాలకు తీసుకొనిపోయేవి. మనల్ని ఆనందం, అద్భుత రసాల్లో ముంచేసేవి. కాని ఇప్పటి నవలల్లో ఇతివృత్తం సామాజికం ఇప్పటి కాలానికి సంబంధించినవిగా వుంటున్నాయి. పాత్రలు సమకాలిక సమాజంలో వుండేవే. కాలేజీలనీ హాస్టళ్ళని క్లాసురూమ్‌లని ప్రొఫెసర్లని ఇప్పటి వాతావరణంతో కలగలసి వుంటున్నాయి. దాంతో పాఠకులు సమకాలికమైన ఇతివృత్తాలను, కథలను చదివి ఆ మాయలు, మంత్రాల మీద నమ్మకం ఏర్పరచుకునే అవకాశం ఎక్కువగా వుంది" అన్నాన్నేను. మాలిని నా లెక్చరంతా ఓపిగ్గా వింది.

"అవును ఆంటీ! మీరన్నది నిజమే అనిపిస్తోంది నాకూ ఆలోచిస్తుంటే" అంది మాలిని మెల్లగా ఆలోచనలో పడిపోతూ.

"మాలినీ! పిల్లలకు హేతుబుద్ధిని పెంచే విధంగా కథలుండాలి. సమాజం పట్ల అవగాహన కలిగించేవిగా నీతిని, ధైర్యసాహసాలను బోధించేవిగా వుండాలి. కాని ఈ విధంగా అతీత శక్తుల మీద, మాయల మీద నమ్మకం కలిగించే విధంగా వుండటం మళ్ళా మనం మన అల్లావుద్దీన్ అద్భుతదీపం కథల్లోకి, ఇంద్రజాలం నవలల్లోకి వెళ్ళిపోయేటట్లుగా వుండటం పిల్లల్ని పెడదారి పట్టించినట్లవుతుందేమోనని నా భయం!" అన్నాన్నేను.

"ఈ రోజు చాలా ఆవేశంగా మాట్లాడుతున్నారు ఆంటీ!" నవ్వింది మాలిని. నేనూ నవ్వాను.

"సమాజానికి దూరంగా తీసుకెళ్ళిపోతున్న ఈ నవలలు, సినిమాలు నన్నిట్లా మాట్లాడించాయి. అంతే!" అన్నాన్నేను.

"అవును ఆంటీ! మీరన్నది నిజమే. ఆ మధ్య 'లార్డ్ ఆఫ్ రింగ్స్" అనే ఓ సినిమా వచ్చింది. దానికి ఎన్నో అవార్డులు రావడం నాకు ఆశ్చర్యం కలిగించింది. అది ఇట్లానే మన భైరవద్వీపం కథ లాగానే వుంది. అంతేకాదు ఈ కంప్యూటర్ వచ్చిన తర్వాత సినిమా టెక్నిక్‌లో అద్భుతాలే ఎక్కువ కనిపిస్తున్నాయి కాని వాస్తవికత ఆలోచింప జేసే అంశాలు లేకుండా పోతున్నాయి" అంది.

"అదే నేను అనేది. సాంకేతిక విజ్ఞానం వల్ల మన సరళమైన ఊహాత్మకతను పెంచే శైలి పోయి కేవలం మనల్ని అద్భుతంలో ముంచెత్తే అవాస్తవికత చోటు చేసుకుంటు న్నదన్నదే నా బాధ" అన్నాన్నేను ఆవేదనను వ్యక్తం చేస్తూ. ◆

జంతువుల కుస్తీపోటీ

కొమ్మాలపాటి సాహిల్

ఆదివారం కదా. పిల్లలంతా నానమ్మ చుట్టూ చేరారు. 'కథ చెప్పాల్సిందే'! అని పట్టుపట్టారు. 'ఏం కథ చెప్పమంటారర్రా!' అంది నానమ్మ సాలోచనగా. ఇంతలో అందరికంటే బుడ్డోడు లేచి 'నానమ్మా! నానమ్మా!! కొంతమంది పిల్లిని పెంచుకుంటారు కదా. అనలు బోలెడన్ని జంతువులు వున్నప్పుడు ... వాటన్నిటినీ వదిలేసి .... దాన్నే ఎందుకు పెంచుకుంటారు? మాకు దీని గురించి కథ చెప్పవూ' అన్నాడు గారాంగా. నానమ్మ వాడి బుగ్గలు పట్టుకుని ముద్దు చేసి 'సరే' అని మొదలెట్టింది.

❀ ❀ ❀

'అనగనగా ఓ చిన్ని దేశం. దానికి మాధవవర్మ రాజు. పాపం ఆయనకు 'నా' అన్నవాళ్లు ఎవరూ లేరు. తల్లిదండ్రులేమో వయోభారం వల్ల చనిపోయారు. ఏ కారణంగానో అతను పెళ్లి చేసుకోలేదు. అందువల్ల అంత పెద్ద రాజభవనంలో బిక్కుబిక్కుమంటూ ఒక్కడే వుండేవాడు. ఆయనకు సపర్యలు చేయడానికి పరివారం వుండేది. అయినప్పటికీ ఒంటరితనం ఆయనను బాధించేది. దాంతో బాగా ఆలోచించి ...ఏదైనా ఒక జంతువును పెంచుకోవాలనుకున్నాడు. వెంటనే ఓ సైనికుణ్ణి పిలిచి 'నేను ఏదైనా జంతువును పెంచుకోవాలనుకుంటున్నాను. అడవిలోకి వెళ్లి బాగా వెతికి తీసుకురా! ఇది మా ఆజ్ఞ!!' అన్నాడు. 'చిత్తం మహారాజా' అని గబగబా రాజభవనం నుంచి బయటకు వచ్చాడు సైనికుడు.

కానీ ఆ తర్వాత అతనికి అదో పెద్ద సమస్య అయ్యింది. రాజుగారు పెంచుకోవడానికి ఏ జంతువును తీసుకెళ్లాలో అతనికి అర్థం కాలేదు. బుర్రబద్దలు కొట్టుకుని మరీ ఆలోచించాడు. అయినా ఏం తట్టలేదు. ఏదైతే అదైందని చివరికి అడవిలోకి వెళ్లాడు.

జంతువులన్నిటినీ పిలిచాడు. పులి మొదలుకుని పిల్లి వరకు అన్ని జంతువులు అక్కడకు వచ్చాయి. ఓసారి వాటిని పరిశీలనగా చూసి 'జంతువులారా! మా రాజుగారు మీలో

ఒకరిని పెంచుకోవాలనుకుంటున్నారు. కానీ దేన్ని తీసుకెళ్లాలో నాకర్థం కావడంలేదు. అందుకని ఒక నిర్ణయానికి వచ్చాను. మీకు కుస్తీ పోటీ పెడతాను. అందులో నెగ్గిన వారిని మా రాజుగారి దగ్గరకు తీసుకెళతాను. ఎంచక్కా రాజభవనంలో దర్జాగా బతకొచ్చు. కాకపోతే ఈ పోటీకి సంబంధించి ఒక షరతు పెడుతున్నాను. అదేంటంటే! పోటీలో ఎవరైనా సరే.... కిందపడటం అంటూ జరిగితే... అది కాళ్ల మీదే నిలబడాలి. అంతేకాని మరే విధంగా పడినా ఓడిపోయినట్టే' అన్నాడు. అందుకు జంతువులన్నీ అంగీకరించాయి.

మొదట ఏనుగు, నీటి ఏనుగు పోటీ పడ్డాయి. పాపం నీటి ఏనుగు ఓడిపోయింది. తర్వాత ఏనుగు, సింహం ఎదురుపడ్డాయి. సింహం గెలిచింది. ఆ తర్వాత గొరిల్లా, సింహం తలపడ్డాయి. గొరిల్లా నెగ్గింది. ఆనక మొసలి, గొరిల్లాను ఎదుర్కొంది. దాన్ని మట్టి కరిపించింది. తర్వాత కోతి, మొసలిని ఓడించింది. ఇహ ఆ తర్వాత నిప్పకోడి, కోతితో తలపడి ఓడించింది. పిదప జీబ్రా దిగింది రంగంలోకి. నిప్పకోడిని మట్టి కరిపించింది. ఆ తర్వాత కుక్క వచ్చి జీబ్రాను ఓడించింది.

చివరికి పోటీలో రెండంటే రెండే జంతువులు మిగిలాయి. అవే... కుక్క, పిల్లి. ఓడిపోయిన జంతువులు, సైనికుడు 'ఎవరు గెలుస్తారా?' అని ఎంతో ఉత్సుకతతో చూస్తున్నారు. చివరికి కుక్క, పిల్లి మధ్య కుస్తీ పోటీ జరిగింది. కుక్క ఎంతో తెలివిగా పిల్లిని దెబ్బ తియ్యాలని చూసింది. కానీ పిల్లి మరింత ఉపాయంతో .... కింద పడిన ప్రతిసారీ కాళ్ల మీదే నిలిచింది. కిందపడలేదు. అలా పిల్లిని మట్టి కరిపించాలని కుక్క ఎంతగానో ప్రయత్నించి... చివరికి నీరసించి కింద పడిపోయింది.

అప్పుడు సైనికుడు ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ 'జంతువుల కుస్తీ పోటీ ముగిసింది. పిల్లి గెలిచింది' అని ప్రకటించాడు. జంతువులన్నీ పిల్లిని అభినందించాయి. సైనికుడు దాన్ని చంకలో పెట్టుకుని రాజభవనానికి తీసుకెళ్లాడు.

ఇహ అప్పటి నుంచి పిల్లి రాజుగారికి బాగా దగ్గరైంది. అలా... అలా... పిల్లులు మనుషులకు సన్నిహితమయ్యాయన్న మాట. ఇంతకీ ఎన్నో బలమైన జంతువులు వుండంగా పిల్లే ఆ పోటీలో ఎందుకు గెలిచిందో తెలుసా? అది ఎంత ఎత్తు నుంచి దూకినా, కింద పడినా కాళ్ల మీదే నిలబడుతుంది. అందుకు' అంది నానమ్మ. కథ విన్న పిల్లలంతా ఎంతో సంతోషించారు. ఆనందంగా ఇళ్లకు వెళ్లిపోయారు. ✪



చిన్నారి చిత్రకారులు



కె.అస్మిత,
5వ తరగతి,
విజయవాడ.



జె.గణేష్,ఆంధ్రపబ్లిక్‌స్కూల్, హరిపాలెం.



జ్ఞానేశ్వర్, 1వ తరగతి,
లైఫ్‌లైన్ స్కూల్,
భ్రమరాంబిక నగర్, బీరంగూడ.

ఎస్.సాయినాథ్, 7వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం,
సుందరయ్యనగర్, తాడేపల్లి, గుంటూరు.



పి.నాగప్రవీణ్,
7వ తరగతి,
రఘుట్యూషన్ సెంటర్, పామర్రు, కృష్ణా.

కళ్లల్లో కళ్లు పెట్టి చూడు!

నేస్తాలూ! ఈ బొమ్మను బాగా పరిశీలనగా చూడండి. ఎవరు కనిపిస్తున్నారు? ఓ అమ్మాయి. అవునా! మరి ఆమె ఎలా వుంది? 'కళ్లు మూసుకుని వుంది' అంటున్నారు చిన్నారులంతా ఎంతో ఉత్సాహంగా. కానీ ఇక్కడే పప్పులో కాలు వేశారు. మరింత పరిశీలనగా చూసి చెప్పండి. 'ఎంత గుచ్చి గుచ్చి చూసినా అంతే. ఆమె కళ్లు మూసే వున్నాయి' అంటున్నారు నేస్తాలు కాస్త చిరాగ్గా. కానీ మేం ఓ క్లూ ఇస్తాం. ఆ తర్వాత చూసి ఎలా వుందో చెప్పాలి. ఓకేనా!

మీరు రెప్పవెయ్యకుండా 30 సెకండ్లపాటు ఆ అమ్మాయి మూసిన కళ్ల వైపు చూడండి. ఆలా చూస్తే ... ఆమె కళ్లు తెరుస్తుంది. అప్పడు ఆమె కనుగుడ్లు కూడా కనిపిస్తాయి. చూశారా! అలా కనిపించిందా!! కాని బొమ్మ మూసిన కళ్లను తెరవదుకదా. అదే మరి దృష్టి భ్రమ అంటే. మనల్ని అలా భ్రమింపచేసేలా బొమ్మ వేసిన ఆర్టిస్టు అంకుల్‌ని అభినందించాల్సిందేకదా.

మ్యాజిక్
మ్యాజిక్

చుక్కలు కలిపేద్దాం



వేలం

మొలకలపల్లి కోటేశ్వరరావు

ఉదయం నిద్రలేచిన దగ్గర్నించీ రుసరుసలాడుతూ వుంది సుగుణ. మనసంతా అశాంతిగా, ఆందోళనగా, కోపంగా వుంది. భర్త వెంకటేశ్వర్లు వేకువజామునే లేచి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

టీ నీళ్ళకోసం ఇంట్లోకీ, వీధి వాకిట్లోకీ పదిసార్లు తిరిగి, తను టీ ఇచ్చిన తరువాత తాగి వెళ్ళేవాడు. ఇవ్వాళ నిద్రలేచీ లేవకముందే రెండు జోళ్ళు నీళ్ళు తీసుకొచ్చి పడేసి వెళ్ళిపోయాడు.

రాచకార్యాలు ఏమైనా వున్నాయా అంటే అవేమీ కాదు. ముఖం తప్పించాడు.

సుగుణ ఇంకా పొయ్యి ముట్టించలేదు.

కనీసం వీధి వాకిట్లో అయినా కసువు చిమ్మి, కళ్ళాపి చల్లి ముగ్గు వేయలేదు ఈ రోజు. అసలు ఏ పనీ చేయబుద్ధి కావడం లేదు.

"ప్రయివేటుకి టయమవుతుంది, జడవేయమ్మా!" అంటూ వచ్చింది సౌమ్య.

"గూట్లో దువ్వెన వుండిద్ది, తెచ్చుకో" అంది సుగుణ. పంచలో గుండని ఆనుకుని దిగులుగా కూర్చున్న సుగుణ దగ్గరకి దువ్వెన, నూనె, అద్దం తెచ్చుకుని కూర్చుంది సౌమ్య.

దాదాపు నాలుగు నెలల నించీ ఈ సమస్య నలుగుతోంది. డబ్బు కట్టి బంగారం విడిపించుకుపొమ్మనీ, లేకపోతే వేలం వేస్తామనీ నాలుగు నెలల నాడు బ్యాంకు వాళ్ళు మొదటి నోటీసు ఇచ్చారు. రెండు నెలల క్రితం మళ్ళీ మరో నోటీసు కూడా పంపించారు. 20 రోజుల నాడు మళ్ళీ మూడో రోజు నోటీసు, ఇదే చివరి నోటీసు అనీ, ఇక వేలం వేయడం ఖాయమనీ!

మొదటి నోటీసు వచ్చిన రోజు నించీ తను భర్తతో పోరు పెడుతూనే వుంది. మనిషికి కనీసం చీమకుట్టినట్టయినా లేదు.

తాను పోరు అధికం చేయడంతో ఒకసారి తనమీద చేయిచేసుకున్నాడు. అయినా తను తగ్గదలుచుకోలేదు. కాస్తాకూస్తా కాదు. ఐదు సవర్ల బంగారం. తనకి పెళ్ళప్పుడు పుట్టింటి వాళ్ళు పెట్టింది.

"అమ్మా..." జుట్టుని లాక్కుంటూ, ముందుకి జరిగి కేక పెట్టింది సౌమ్య. "ఏం మాయరోగం వచ్చిందే?" విసుక్కుంటూ అంది సుగుణ.

"మాయరోగం నాక్కాదు, నీకు! జుట్టు లాగా జడేసేదీ? ఎంత నొప్పి పుట్టిపోయిందో!"

వరధ్యానంగా వుండటంతో జుట్టు లాగిందేమో సుగుణ ఆ విషయం గుర్తించలేదు.

"సరే ఇటు చావు"

"నువ్వు సరిగా జడవేస్తే వేయి, లేకపోతే లేదు. నేనే వేసుకుంటా!"

"సరిగా అంటే ఇంక ఎట్టేస్తారే? నువ్వు కుదురుగా తలకాయ వుంచు కొక్కెర తెగులు తగిలిన కోడి పెట్ట మెడతిప్పినట్టు తిప్పవాకు!" "అమ్మా..." నెమ్మదిగా పిలిచింది సౌమ్య. "ప్రైవేటు మాష్టారు రోజూ ఫీజు అడుగుతున్నాడే! ఇయ్యని వాళ్లని నించో పెడతన్నాడు. ఇయ్యాల కానీ ఇయ్యకపోతే ఇంటికి పంపిస్తానన్నాడే!"

"నన్ను అడిగితే నేనేం చేసేదే! మీ అయ్యని అడుగు ఇస్తాడో, అగోరిస్తాడో!" కోపంతో రగిలిపోతూ అంది సుగుణ.

"నిన్న అడిగితే నాల్రోజుల్లో చూద్దామన్నాడే! ఏం చూట్టమో, ఏం పాడో! రెండు నెల్లునించీ అదేమాట!"

"మాకు బిడ్డల్ని చదివించుకునే రాత కూడా లేదులే! తోటోళ్ళు అందరూ ఎట్టా వున్నారూ మనం ఎట్టా వున్నాం? దేశంలో జనాభా తక్కువని పుడతారు ఇసుంటి మనుషులు!"

అసహనంతో సుగుణకి కోపం, ఏడుపు, బాధ కలుగుతున్నాయి. నానుతాడు, రెండుగాజులు, ఒంటిపేట గొలుసు కళ్ళలో మెదులుతున్నాయి. కళ్ళు మూసినా అవే, తెరిచినా అవే!

తన రెండో తోడికోడలికి 50 సవర్ల బంగారం వుంది. మూడోతోడి కోడలికి కూడా 20 సవర్ల బంగారం.

తనకి ?... పెద్దకోడలు తను! ఉన్న 5 సవర్లూ వేలానికి వచ్చింది. వేలం ఇవ్వాళే!

వారం రోజుల నాడు వేలం వేస్తున్నామని పేపర్‌లో కూడా ప్రకటన ఇచ్చారు, బ్యాంకు వాళ్ళు. నిన్నటి వరకూ కనీసం బ్యాంకులో అయినా వుందనే ఆశ వుంది. ఇవ్వాల్టితో దింపుడు కళ్ళం ఆశని కూడా వదులుకోవాల్సిందే! తన బిడ్డలు ఇద్దరికీ రేపట్నించీ ముక్కు పుడక సైతం వుండదు.

ఉమ్మడి సంసారంలో పదకొండేళ్ళపాటు గొడ్డు మాదిరిగా చాకిరీ చేశారు తనూ, భర్తా! ఆయనగారి ఇద్దరి తమ్ముళ్ళనీ చదివించారు.

చివరికేమైంది?

వాళ్ళు బాగా స్థిరపడ్డారు, తాము చికితిపోయారు.

ఇవ్వాళ పెద్ద మరిదీ, అతని భార్యా గవర్నమెంటు స్కూలు టీచర్లు, జతమీద నెలకి 15, 16 వేలు సంపాయించుకుంటున్నారు. ఆమెకి 50 సవర్ల బంగారం. ఇద్దరు మగపిల్లలు.

చిన్న మరిది హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంచి జీతమే! వాళ్ళకి ఒక కొడుకూ, ఒక కూతురు. 20 సవర్ల బంగారం వుంది వాళ్ళకి.

వాళ్ళు జీవితంలో స్థిరపడి సుఖంగా బతుకుతున్నందుకు కాదు తనకి బాధ అన్నా వదినా కష్టపడి చదివించారనే కనీస విశ్వాసం కూడా లేకపోయిందనే బాధ!

ఉమ్మడిగా వున్నది 13 ఎకరాల పొలం.

పెళ్ళి కావాల్సిన ఆడబిడ్డ వుంది. అత్తమామలు. వాళ్ళ ముగ్గురికీ కలిపి 4 ఎకరాలు పంచి మిగతా 9 ఎకరాలూ అన్నదమ్ములు ముగ్గురూ మూడేసి ఎకరాలు తీసుకున్నారు.

ఇంట్లో వున్న చెంబు, కంచం, మంచం, గ్లాసుతో సహా భాగాలు వేసి పంచుకున్నారు.

అత్తమామలు ఇద్దరికీ చిన్నకొడుకులు ఇద్దరి మీదనే భ్రమలు వున్నాయి. పనిచేసే వాళ్ళంటే చిన్న చూపు, చులకన!

"నాకు పెళ్ళయ్యి పదకొండేళ్ళు. అంతకుముందు మూడేళ్ళ పాటు తమ్ముళ్ళు చదువుకుంటుంటే ఆయన పొలం పని చేశాడు. వాళ్ళ చదువులకు చాలా ఖర్చయ్యింది. ఉమ్మడిగా ఉంటూ పని చేసినందుకు మాకూ, వాళ్ళకీ సమాన భాగమేనా? మాకు ఎక్కువ ఏం ఇవ్వరా?" అని పంచడానికి వచ్చిన పెద్ద మనుషుల్ని అడిగింది తనే.

"మీరు ఊరకర చేశారా ఏంటి? తిన్నారు, చేసారు! కోరిన తిండి తిన్నారు, కోరిన గుడ్డ కట్టుకున్నారు. మా భాగం పొలం మగతాకి ఇచ్చుకుంటే మాకు డబ్బు రాకపోయిందీ? మా మగతా కంటే ఎక్కువ ఖర్చు పెట్టామా మేము? ఇంటరు ఇంట్లో తినిపోయి చదువుకుని

(మిగతా 19వ పేజీలో)

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

వాస్తవికతకు దూరమైన కథలు!

హ్యారీ పాటర్!
హ్యారీ పాటర్!

ఎవరు చూసినా అదే పాట. ఎవరిని అడిగినా అదే ముచ్చట. అవే పుస్తకాలు చదవటం! అవే సినిమాలు చూడటం! తీరా చూస్తే ఏముంది వాటిల్లో... మన పాతాళభైరవి కథలాగా గులేబకావళి సినిమాలాగా మాయలు మంత్రాలు! భూతాలు! రాక్షసులు! వింత వింత ఆకారాలు! వాటితో హీరో పోరాటాలు, యుద్ధాలు. దయ్యాలు, భూతాల మీద, మాయలు మంత్రాల మీద నమ్మకం కలిగించేలాగా ఏమిటీ కథలు! సినిమాలు! పిల్లల్ని పెడదారి పట్టించి అమానుష శక్తుల మీద నమ్మకం కలిగించేవిగా వున్నాయి.... అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మాలిని ఒక్కతె లోపలికి తలుపు తోసుకొని వచ్చింది.

"ఏం మాలినీ! ఆదిత్య ఏడి? సెలవుల్లో ఊరికెళ్ళాడా ఏమిటి?" అడిగాను.

"లేదు ఆంటీ! ఫ్రెండ్స్‌తో హ్యారీ పాటర్ సినిమాకు వెళ్ళాడు. ఇప్పుడే పంపించి ఇటు వస్తున్నా. నాతో ఒకసారి చూశాడు హారీ పాటర్. మళ్ళా ఫ్రెండ్స్‌తో వెళ్తానని వెళ్ళాడు" అంది మాలిని.

"పెద్దవాళ్ళు చిన్నవాళ్ళు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. ఈ హ్యారీపాటర్ సినిమాలు" అన్నాన్నేను.

"అవును ఆంటీ! హ్యారీ పాటర్ నవలలన్నా, సినిమాలన్నా నాకూ ఇష్టమే" అంది మాలిని.

నేను మాలిని మాటలు విని చిరునవ్వు నవ్వాను.

"హ్యారీ పాటర్... నాలుగు నవలలు వచ్చాయి. నాలుగు నవలలూ విపరీతంగా అమ్ముడుపోయాయట. అంతేకాదు ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువాదమై ఆ నవలలు బోలెడు అమ్ముడుపోయాయట. ఆ నవలల రచయిత్రి జె.కె.రౌలింగ్ ఇప్పుడు ప్రపంచంలో అతి ధనవంతుల పక్కన స్థానం సంపాదించుకుందట!" అన్నాన్నేను.

"అవును ఆంటీ! ఆ నవలలు చదువుతుంటే చాలా గమ్మత్తుగా వుంటాయి. బాగా విడిచిపెట్టకుండ చదివించేట్లుగా వుంటాయి" అంది మాలిని. ఆమె కండ్లు ఆనందంతో మెరుస్తున్నాయి.

"నిజమే! అట్లా చదివించేట్లుగా వున్నాయి కాబట్టే వందల కొద్ది పేజీలున్నా పాఠకులు విసుగూ విరామం లేకుండా ఆ నవలల్ని చదువుతున్నారు. మొత్తం మీద ఆ సాహిత్యం పిల్లల్ని ఆకర్షించి వాళ్ళల్లో మళ్ళా చదివే ఆకాంక్షను పెంచింది. లేకపోతే టీవీల ముందు కూర్చొని సృజనాత్మకత చంపేసే ఆ ప్రోగ్రామ్‌లు చూస్తుండే వాళ్ళు. అది పోయి మళ్ళా పుస్తకాల వైపు మళ్ళించాయి ఈ నవలలు అందర్నీ" అన్నాన్నేను.

"అవును ఆంటీ! ఆ నవలల్ని చదువుతుంటే ఈ లోకాన్నే మరచిపోతాం. చకచక కథ, సంఘటనలు నడిచిపోతుంటాయి" అంది మాలిని మళ్ళా ఉత్సాహంగా.

"మాలినీ! నువ్వన్నట్లు ఆ నవలల్లో చదివించే భాష, శైలి వున్నాయి. మా పిల్లలు చిన్నగా వున్నప్పుడు ఎనిడ్ బ్లైటన్ మొదలైన వాళ్ళు రాసిన నవలలు వచ్చేవి. ఆ నవలల్లో పిల్లల సాహసకార్యాలుండేవి. పిల్లల్ని ఉత్సాహవంతులుగా చేసే ఇతి వృత్తాలుండేవి. తోటిమానవులకు సాయం చేయాలి. జంతువుల మీద ప్రేమ కరుణ చూపాలి అని జీవిత క్రమాన్ని బోధించే ఇతి వృత్తాలు, కథలు సంఘటనలుండేవి. కాని ఇట్లా సమాజంతో సంబంధం లేని మాయలు మంత్రాలు, దయ్యాలు భూతాలుండేవి కావు. ఈ నవలలు, సినిమాలు మన విఠాలాచార్య సినిమాలను గుర్తుకు తెస్తున్నాయి. వాటిల్లో ఇతివృత్తం రాజులు, రాజకుమారులకు సంబంధించినవి కాబట్టి అవి ఏ కాలానికో సంబంధించినవిగా మనల్ని ఊహాలోకాలకు తీసుకొనిపోయేవి. మనల్ని ఆనందం, అద్భుత రసాల్లో ముంచేసేవి. కాని ఇప్పటి నవలల్లో ఇతివృత్తం సామాజికం ఇప్పటి కాలానికి సంబంధించినవిగా వుంటున్నాయి. పాత్రలు సమకాలిక సమాజంలో వుండేవే. కాలేజీలనీ హాస్టళ్ళని క్లాసురూమ్‌లని ప్రొఫెసర్లని ఇప్పటి వాతావరణంతో కలగలసి వుంటున్నాయి. దాంతో పాఠకులు సమకాలికమైన ఇతివృత్తాలను, కథలను చదివి ఆ మాయలు, మంత్రాల మీద నమ్మకం ఏర్పరచుకునే అవకాశం ఎక్కువగా వుంది" అన్నాన్నేను. మాలిని నా లెక్చరంతా ఓపిగ్గా వింది.

"అవును ఆంటీ! మీరన్నది నిజమే అనిపిస్తోంది నాకూ ఆలోచిస్తుంటే" అంది మాలిని మెల్లగా ఆలోచనలో పడిపోతూ.

"మాలినీ! పిల్లలకు హేతుబుద్ధిని పెంచే విధంగా కథలుండాలి. సమాజం పట్ల అవగాహన కలిగించేవిగా నీతిని, ధైర్యసాహసాలను బోధించేవిగా వుండాలి. కాని ఈ విధంగా అతీత శక్తుల మీద, మాయల మీద నమ్మకం కలిగించే విధంగా వుండటం మళ్ళా మనం మన అల్లావుద్దీన్ అద్భుతదీపం కథల్లోకి, ఇంద్రజాలం నవలల్లోకి వెళ్ళిపోయేటట్లుగా వుండటం పిల్లల్ని పెడదారి పట్టించినట్లవుతుందేమోనని నా భయం!" అన్నాన్నేను.

"ఈ రోజు చాలా ఆవేశంగా మాట్లాడుతున్నారు ఆంటీ!" నవ్వింది మాలిని. నేనూ నవ్వాను.

"సమాజానికి దూరంగా తీసుకెళ్ళిపోతున్న ఈ నవలలు, సినిమాలు నన్నిట్లా మాట్లాడించాయి. అంతే!" అన్నాన్నేను.

"అవును ఆంటీ! మీరన్నది నిజమే. ఆ మధ్య 'లార్డ్ ఆఫ్ రింగ్స్' అనే ఓ సినిమా వచ్చింది. దానికి ఎన్నో అవార్డులు రావడం నాకు ఆశ్చర్యం కలిగించింది. అది ఇట్లానే మన భైరవద్వీపం కథ లాగానే వుంది. అంతేకాదు ఈ కంప్యూటర్ వచ్చిన తర్వాత సినిమా టెక్నిక్‌లో అద్భుతాలే ఎక్కువ కనిపిస్తున్నాయి కాని వాస్తవికత ఆలోచింప జేసే అంశాలు లేకుండా పోతున్నాయి" అంది.

"అదే నేను అనేది. సాంకేతిక విజ్ఞానం వల్ల మన సరళమైన ఊహాత్మకతను పెంచే శైలి పోయి కేవలం మనల్ని అద్భుతంలో ముంచెత్తే అవాస్తవికత చోటు చేసుకుంటు న్నదన్నదే నా బాధ" అన్నాన్నేను ఆవేదనను వ్యక్తం చేస్తూ. ◆

కొమ్మాలపాటి సాహిల్

జంతువుల కుస్తీపోటీ

ఆదివారం కదా. పిల్లలంతా నానమ్మ చుట్టూ చేరారు. 'కథ చెప్పాల్సిందే'! అని పట్టుపట్టారు. 'ఏం కథ చెప్పమంటారర్రా!' అంది నానమ్మ సాలోచనగా. ఇంతలో అందరికంటే బుడ్డోడు లేచి 'నానమ్మా! నానమ్మా!! కొంతమంది పిల్లిని పెంచుకుంటారు కదా. అసలు బోలెడన్ని జంతువులు వున్నప్పుడు ... వాటన్నిటినీ వదిలేసి .... దాన్నే ఎందుకు పెంచుకుంటారు? మాకు దీని గురించి కథ చెప్పవూ' అన్నాడు గారాంగా. నానమ్మ వాడి బుగ్గలు పట్టుకుని ముద్దు చేసి 'సరే' అని మొదలెట్టింది.

❀ ❀ ❀

'అనగనగా ఓ చిన్ని దేశం. దానికి మాధవవర్మ రాజు. పాపం ఆయనకు 'నా' అన్నవాళ్లు ఎవరూ లేరు. తల్లిదండ్రులేమో వయోభారం వల్ల చనిపోయారు. ఏ కారణంగానో అతను పెళ్లి చేసుకోలేదు. అందువల్ల అంత పెద్ద రాజభవనంలో బిక్కుబిక్కుమంటూ ఒక్కడే వుండేవాడు. ఆయనకు సపర్యలు చేయడానికి పరివారం వుండేది. అయినప్పటికీ ఒంటరితనం ఆయనను బాధించేది. దాంతో బాగా ఆలోచించి ...ఏదైనా ఒక జంతువును పెంచుకోవాలనుకున్నాడు. వెంటనే ఓ సైనికుణ్ణి పిలిచి 'నేను ఏదైనా జంతువును పెంచుకోవాలనుకుంటున్నాను. అడవిలోకి వెళ్లి బాగా వెతికి తీసుకురా! ఇది మా ఆజ్ఞ!!' అన్నాడు. 'చిత్తం మహారాజా' అని గబగబా రాజభవనం నుంచి బయటకు వచ్చాడు సైనికుడు.

కానీ ఆ తర్వాత అతనికి అదో పెద్ద సమస్య అయ్యింది. రాజుగారు పెంచుకోవడానికి ఏ జంతువును తీసుకెళ్లాలో అతనికి అర్థం కాలేదు. బుర్రబద్దలు కొట్టుకుని మరీ ఆలోచించాడు. అయినా ఏం తట్టలేదు. ఏదైతే అదైందని చివరికి అడవిలోకి వెళ్లాడు.

జంతువులన్నిటినీ పిలిచాడు. పులి మొదలుకుని పిల్లి వరకు అన్ని జంతువులు అక్కడకు వచ్చాయి. ఓసారి వాటిని పరిశీలనగా చూసి 'జంతువులారా! మా రాజుగారు మీలో

ఒకరిని పెంచుకోవాలనుకుంటున్నారు. కానీ దేన్ని తీసుకెళ్లాలో నాకర్థం కావడంలేదు. అందుకని ఒక నిర్ణయానికి వచ్చాను. మీకు కుస్తీ పోటీ పెడతాను. అందులో నెగ్గిన వారిని మా రాజుగారి దగ్గరకు తీసుకెళతాను. ఎంచక్కా రాజభవనంలో దర్జాగా బతకొచ్చు. కాకపోతే ఈ పోటీకి సంబంధించి ఒక షరతు పెడుతున్నాను. అదేంటంటే! పోటీలో ఎవరైనా సరే.... కిందపడటం అంటూ జరిగితే... అది కాళ్ల మీదే నిలబడాలి. అంతేకాని మరే విధంగా పడినా ఓడిపోయినట్టే' అన్నాడు. అందుకు జంతువులన్నీ అంగీకరించాయి.

మొదట ఏనుగు, నీటి ఏనుగు పోటీ పడ్డాయి. పాపం నీటి ఏనుగు ఓడిపోయింది. తర్వాత ఏనుగు, సింహం ఎదురుపడ్డాయి. సింహం గెలిచింది. ఆ తర్వాత గొరిల్లా, సింహం తలపడ్డాయి. గొరిల్లా నెగ్గింది. ఆనక మొసలి, గొరిల్లాను ఎదుర్కొంది. దాన్ని మట్టి కరిపించింది. తర్వాత కోతి, మొసలిని ఓడించింది. ఇహ ఆ తర్వాత నిప్పుకోడి, కోతితో తలపడి ఓడించింది.

పిదప జీబ్రా దిగింది రంగంలోకి. నిప్పుకోడిని మట్టి కరిపించింది. ఆ తర్వాత కుక్క వచ్చి జీబ్రాను ఓడించింది.

చివరికి పోటీలో రెండంటే రెండే జంతువులు మిగిలాయి. అవే... కుక్క, పిల్లి. ఓడిపోయిన జంతువులు, సైనికుడు 'ఎవరు గెలుస్తారా?' అని ఎంతో ఉత్సుకతతో చూస్తున్నారు. చివరికి కుక్క, పిల్లి మధ్య కుస్తీ పోటీ జరిగింది. కుక్క ఎంతో తెలివిగా పిల్లిని దెబ్బ తియ్యాలని చూసింది. కానీ పిల్లి మరింత ఉపాయంతో .... కింద పడిన ప్రతిసారీ కాళ్ల మీదే నిలిచింది. కిందపడలేదు. అలా పిల్లిని మట్టి కరిపించాలని కుక్క ఎంతగానో ప్రయత్నించి... చివరికి నీరసించి కింద పడిపోయింది.

అప్పుడు సైనికుడు ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ 'జంతువుల కుస్తీ పోటీ ముగిసింది. పిల్లి గెలిచింది' అని ప్రకటించాడు. జంతువులన్నీ పిల్లిని అభినందించాయి. సైనికుడు దాన్ని చంకలో పెట్టుకుని రాజభవనానికి తీసుకెళ్లాడు.

ఇహ అప్పటి నుంచి పిల్లి రాజుగారికి బాగా దగ్గరైంది. అలా... అలా... పిల్లులు మనుషులకు సన్నిహితమయ్యాయన్న మాట. ఇంతకీ ఎన్నో బలమైన జంతువులు వుండంగా పిల్లే ఆ పోటీలో ఎందుకు గెలిచిందో తెలుసా? అది ఎంత ఎత్తు నుంచి దూకినా, కింద పడినా కాళ్ల మీదే నిలబడుతుంది. అందుకు' అంది నానమ్మ. కథ విన్న పిల్లలంతా ఎంతో సంతోషించారు. ఆనందంగా ఇళ్లకు వెళ్లిపోయారు.



చిన్నారి చిత్రకారులు



కె.అస్మిత,
5వ తరగతి,
విజయవాడ.

జె.గణేష్,ఆంధ్రపబ్లిక్‌స్కూల్, హరిపాలెం.



జ్ఞానేశ్వర్, 1వ తరగతి,
లైఫ్‌లైన్ స్కూల్,
భ్రమరాంబిక నగర్, బీరంగూడ.

ఎస్.సాయినాథ్, 7వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం,
సుందరయ్యనగర్, తాడేపల్లి, గుంటూరు.



పి.నాగప్రవీణ్,
7వ తరగతి,
రఘుట్యూషన్ సెంటర్, పామర్రు, కృష్ణా.

కళ్లల్లో కళ్లు పెట్టి చూడు!

నేస్తాలూ! ఈ బొమ్మను బాగా పరిశీలనగా చూడండి. ఎవర కనిపిస్తున్నారు? ఓ అమ్మాయి. అవునా! మరి ఆమె ఎలా వుంది? 'కళ మూసుకుని వుంది' అంటున్నారు చిన్నారులంతా ఎంతో ఉత్సాహంగ కానీ ఇక్కడే పప్పులో కాలు వేశారు. మరింత పరిశీలనగా చూసి చెప్పండి 'ఎంత గుచ్చి గుచ్చి చూసినా అంతే. ఆమె కళ్లు మూసే వున్నాయి అంటున్నారు నేస్తాలు కాస్త చిరాగ్గా. కానీ మేం ఓ క్లూ ఇస్తాం. ఆ తర్వా చూసి ఎలా వుందో చెప్పాలి. ఓకేనా!

మీరు రెప్పవెయ్యకుండా 30 సెకండ్లపాటు ఆ అమ్మాయి మూసిన కళ్ల వైపు చూడండి. ఆలా చూస్తే ... ఆమె కళ్లు తెరుస్తుంది అప్పడు ఆమె కనుగుడ్లు కూడా కనిపిస్తాయి. చూశారా! అల కనిపించిందా!! కాని బొమ్మ మూసిన కళ్లను తెరవదుకదా. అదే మ దృష్టి భ్రమ అంటే. మనల్ని అలా భ్రమింపచేసేలా బొమ్మ వేసిన ఆర్టిస అంకుల్‌ని అభినందించాల్సిందేకదా.

చుక్కలు కలిపేద్దాం



మీ స్కూలు ఎలా వుంటుంది?

నేస్తాలూ... మీ స్కూలు ఎలా వుంటుంది? అన్ని సబ్జెక్టులకు మాష్టార్లు వస్తున్నారా! ప్లేగ్రౌండు, లైబ్రరీ... వున్నాయా? ఇంకా మీ బడిలో ఏం వుంటే బావుంటుందనుకుంటున్నారు? పూర్తి అడ్రస్‌తో కార్డుమీద రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

ఆ పదం ఏంటబ్బా!

హేయ్ చిన్నారులూ! ఇవాళ మీ ఆంగ్ల భాషా పరిజ్ఞానానికి ఓ పరీక్ష పెట్టాలనుకుంటున్నాం. మరి అడగమంటారా?

ఆంగ్లంలో ఓ పదం వుంది. అందులో తొమ్మిది అక్షరాలు వున్నాయి. ఈ పదంలోంచి ఒక్కో అక్షరం తగ్గిస్తూ వుంటే ఒక్కో కొత్త మాట తయారవుతుంది. చివరి అక్షరంతో సహా ప్రతి పదానికి ఏదో ఒక అర్థం వుంటుంది.

ఏంటి? బుర్ర గోక్కుంటూ ఆలోచిస్తున్నారు? ఆ పదం ఏంటా? అనా! మరికొందరైతే 'ఆ పదం ఏంటో చెప్పొచ్చుకదా. ఎంచక్కా కొత్త పదాలను తయారుచేస్తాం' అన్నట్టు చూస్తున్నారు. ఎంత ఆశ! అసలు అది చెప్పేస్తే ఇంక మీ బుర్రకు పనేం వుంటుంది? బాగా ఆలోచించండి. తెలీకపోతే మాత్రం వచ్చేవారం ఇదే శీర్షికలో చూడండే.

బయటది తింటాం! లోపలది పడేస్తాం!!

ఏమిటది?

హేయ్ ఈ వారం మీకోసం ఓ తిండిపదార్థం వచ్చింది. అదేంటో చెప్పాలి మీరు. మరి ప్రశ్న అడగమంటారా?

మనం ఒకటి కొంటాం. కొన్నాక బయటది తీసేస్తాం. లోపలది ఉడకపెడతాం. తర్వాత బయటది తింటాం. మళ్లీ లోపలది పడేస్తాం. ఏమిటది?

'అబ్బో తికమకగా వుందే. బయటది పడేస్తాం. లోపలది... అమ్మో కాస్త ఆలోచించుకోవాల్సిందే' అనుకుంటున్నారు కొందరు చిన్నారులు. మరి బాగా ఆలోచించుకోండి. సరైన సమాధానం కావాలంటే ఏ...డు...రో...జు...లు ఆగాల్సిందే.

చిక్కుప్రశ్న

ఎత్తైన శిఖరం అదే!

ఎవరెస్టను కనుగొనక ముందు కూడా ఎత్తైన శిఖరం ఎవరెస్టే. అంతేకదా. ఎవరెస్ట్‌ని మనం కనుక్కోకపోయినా ... అది అక్కడే వుంది కదా. అంటే ఎత్తైన శిఖరం అదే కదా.

ఇంద్రపాలితుడు-ధనగుప్తుడు

ఒక పట్టణంలో ఇంద్రపాలితుడనే వర్తకుడున్నాడు. అతను ఒకరోజు వ్యాపారం కోసం దూరదేశానికి బయలుదేరాడు. వెళ్లే ముందు తన దగ్గర వున్న అరవై బారువుల ఇనుమును ధనగుప్తుడనే స్నేహితుని ఇంట్లో వుంచాడు. "మిత్రమా! ఈ లోహాన్ని తిరిగి వచ్చాక తీసుకుంటాను. అందాకా నీ దగ్గరే వుంచు" అన్నాడు ఇంద్రపాలితుడు. "అలాగే" అన్నాడు ధనగుప్తుడు. కొన్నాళ్లకు ఇంద్రపాలితుడు తిరిగి వచ్చాడు.

వెంటనే ధనగుప్తుని కలిసి, "మిత్రమా! నేను వ్యాపారంలో బాగా నష్టపోయాను. ఇప్పుడు ఇనుము ధర పెరిగింది. నీ దగ్గర దాచిన ఇనుమును అమ్మి కొంత నష్టం పూడ్చుకోవాలనుకుంటున్నాను. అది తెచ్చివ్వు..." అన్నాడు. "ఏం చెప్పమంటావు మిత్రమా! నీవు దాచుకున్న ఇనుమును ఎలుకలు తినేశాయి" అన్నాడు ధనగుప్తుడు విచారంగా.



ఇంద్రపాలితుడికి ధనగుప్తుడి ఉద్దేశం అర్థమయ్యింది. అయినా అతను కోపం తెచ్చుకోలేదు. 'మోసాన్ని మోసంతోనే జయించాలి. ఈ ధనగుప్తుడికి తగిన బుద్ధి చెప్పాలి' అనుకున్నాడు. "ధనగుప్తా! లోహాన్ని ఎలుకలు తింటే నువ్వు మాత్రం ఏం చేస్తావు? అంతా నా దురదృష్టం" అని ఇంటికి వెళ్లిపోయాడు ఇంద్రపాలితుడు.

ఆ రోజు నుండి ఇంద్రపాలితుడు వీలైనప్పుడల్లా ధనగుప్తుడి ఇంటికి వెళ్లసాగాడు. మునుపటి కంటే స్నేహంగా మెలగసాగాడు. ఒకరోజు ధనగుప్తుని కొడుకు ఏడుస్తుంటే, "పండ్లు కొనుక్కొని వద్దాం" అని అన్నాడు. ధనగుప్తుడు కూడా ఎదురుచెప్పలేదు. ఇంద్రపాలితుడు ఆ కుర్రవాడిని తీసుకువెళ్లి స్నేహితుని ఇంట్లో దాచి ఒంటరిగా ధనగుప్తుడి దగ్గరకు వెళ్లాడు. "ఒక్కడివే వచ్చావేంటి? మా అబ్బాయి ఎక్కడ?" అని అడిగాడు ధనగుప్తుడు. "ఏం చెప్పమంటావు మిత్రమా? మీ అబ్బాయికి పండ్లు కొనిపెట్టి ఇంటికి తీసుకువస్తుంటే గద్ద తన్నుకుపోయింది" అన్నాడు ఇంద్రపాలితుడు. వెంటనే ధనగుప్తుడు రాజుగారికి ఫిర్యాదు చేశాడు. రాజుగారు ఇంద్రపాలితుడిని పిలిపించారు. "ఇంద్రపాలితా! బజారుకు వెళ్తూ ధనగుప్తుని కొడుకుని తీసుకువెళ్లావా?"

"అవును ప్రభూ!"

"ఆ పిల్లవాడిని గద్ద ఎత్తుకుపోయిందని చెప్పావట? గద్ద ఎక్కడైనా పిల్లల్ని ఎత్తుకుపోతుందా? విడ్డూరం కాదా?" అన్నాడు రాజు.

"ప్రభూ! అరవై బారువుల ఇనుమును ఎలుకలు తిన్నాయని అనడం కంటే ఇది విడ్డూరమా? ఎలుకలు ఇనుమును తిన్నాయో లేదో ధనగుప్తుడికి తెలుసు. అడిగి చూడండి?" అన్నాడు ఇంద్రపాలితుడు.

"ఏం ధనగుప్తా! ఇంద్రపాలితుడి మాటలు నిజమేనా?" అని ప్రశ్నించాడు రాజు. "నిజమే ప్రభూ!" అన్నాడు ధనగుప్తుడు తలవంచుకొని.

"మహారాజా! నేను వ్యాపారం చేయడానికి దూరదేశానికి వెళ్తూ అరవై బారువుల ఇనుమును అతని వద్ద దాచాను. తిరిగి వచ్చి నా ఇనుము నాకు ఇమ్మంటే ఎలుకలు తినేశాయని అన్నాడు. ఇనుమును ఎలుకలు తినడం కంటే పిల్లవాడిని గద్ద తన్నుకుపోవడం విడ్డూరమా?" అన్నాడు ఇంద్రపాలితుడు. ధనగుప్తుడు చేసిన మోసానికి గట్టిగా బుద్ధి చెప్పాలని ఇంద్రపాలితుడు ఇలాంటి ఉపాయం పన్నాడని గ్రహించాడు రాజు. తర్వాత ధనగుప్తుణ్ణి తీవ్రంగా మందలించి ఇంద్రపాలితుడి ఇనుమును తెప్పించి, అతనికి ఇప్పించాడు. పిల్లవాడిని పిలిపించి ధనగుప్తునికి అప్పగించాడు.

ఎటుచూసినా మంచు.
కనుచూపు మేరలో తెల్లని పర్వతాలు ఐరావతాల్లా తళతళలాడుతున్నాయి. మంచు కొండల పై నుంచి వీస్తున్న గాలి శరీరాన్ని చల్లగా చుట్టేస్తోంది. ఆకాశంలో దూది పింజల్లాంటి మేఘాలు మంచులో కలిసిపోతున్నాయి.

విరిగిన పర్వత శిఖరం

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

జామీ ఆండ్రూ నిస్త్రాణంగా కూలబడ్డాడు. భుజం మీదున్న కిట్టును పక్కన పెట్టుకున్నాడు.

చలికి శరీరం గడ్డకట్టుకుపోయేలా ఉంది. అయినా అతనికి నిరుత్సాహం కలగడం లేదు. ఎంత తొందరగా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించాలా అని ఉత్సాహపడుతున్నాడు.

బ్రిటన్‌లో ఉన్న బెన్‌నెవిస్ అనే మంచు పర్వతం చాలా ఎత్తయినది. దానిని అధిరోహించిన వారు అతి కొద్దిమంది. వారి గురించి అందరూ గొప్పగా చెప్పుకుంటారు. అలా తన గురించి కూడా అందరూ చెప్పుకోవాలని జామీ ఆండ్రూ తాపత్రయం. అందుకు అనుగుణంగానే ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

ఎత్తయిన పర్వతశిఖరం ఎక్కడానికి సిద్ధపడినప్పుడు సన్నిహితులు, స్నేహితులు అందరూ వద్దన్నారు. ఒకసారి ప్రమాదం నుంచి బైటపడిన తర్వాత బుద్ధిగా ఉండకుండా మళ్ళీ ఈ తాపత్రయం ఎందుకని హేళన చేశారు.

'కాళ్ళూ చేతులూ లేకపోయినా పట్టుదలకు లోటులేదు అని మరికొంతమంది హేళన చేశారు. దీంతో ఆండ్రూలో పట్టుదల మరింతగా పెరిగిపోయింది.

ఎలాగైనా అనుకున్నది సాధించాలి.

అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న వారే అధిరోహించడానికి ధైర్యం చేయలేని బెన్‌నెవిస్ పర్వతాన్ని తాను ఎక్కాలి. బ్రిటన్‌లో అందరూ ముక్కుమీద వేలు వేసుకునేలా విజయం సాధించాలి. వికలాంగులు సాధించలేనిది ఏమీ లేదని నిరూపించాలి అనుకున్నాడు ఆండ్రూ.

అందుకే పర్వతారోహణకు శ్రీకారం చుట్టాడు.

రెండు కాళ్ళూ లేనందువల్ల అమర్చిన కర్రకాళ్ళను సరిచేసుకున్నాడు. ఆ కాళ్ళకి ప్రత్యేకమైన బూట్లు తొడిగాడు. రెండు చేతులు లేకపోయినా పెట్టుడు చేతులు అమర్చుకున్నాడు. ఆ చేతులతో హ్యాండ్‌స్టిక్స్ కూడా పట్టుకున్నాడు.

ఓ సహాయకుడు మాత్రం వెంట వచ్చాడు.

వంద అడుగులు ఎక్కేసరికి అలసట మొదలైంది. కాళ్ళు చేతులూ సరిగా పని చేయడం లేదు. మంచుపైన పట్టుదొరకకపోవడంతో అతి కష్టం మీద నిలదొక్కుకుంటున్నాడు.

అడుగు తీసి అడుగు వేయడం కష్టం అవుతోంది.

ఆండ్రూ అవస్థ చూస్తుంటే అతని సహాయకుడికి కూడా దుఃఖం తన్నుకు వస్తోంది. అతని కర్తవ్యం ముందు తాను ఎంతో అల్పుడినని గుర్తించాడు.

"సార్! గంట విశ్రాంతి తీసుకుందాం!" జాన్ చెప్పడంతో ఆండ్రూ మనసు విశ్రాంతి వైపు మళ్ళింది. అప్పటికే అతని శరీరం, మనసు ముందుకు ప్రయాణం చేయడానికి సహకరించడం లేదు.

''సరే నీ ఇష్టం!'' అంటూ కూలబడిపోయాడు.

జాన్ తాత్కాలిక టెంటును ఏర్పాటు చేసి మంచు గాలులు లోపలికి ప్రవేశించకుండా చుట్టూ పరదా కట్టాడు. ఆ పక్కన ఓ మూల చిన్న మంట రాజేశాడు. రిలాక్స్ అవడానికి వాలు కుర్చీని అమర్చాడు.

జామీ ఆండ్రూ జారగిలబడ్డాడు.

పర్వతం ఎత్తు 4409 అడుగులు. అడుగు తీసి అడుగు వెంటవెంటనే వేసినప్పటికీ వారం పది రోజులు పడుతుంది. అయినప్పటికీ నిరాశ పడకూడదు అనుకున్నాడు. ఇంకా ఎన్నో వందల అడుగులు ఎక్కాలి, అనుకోకుండా అప్పుడే వంద అడుగులు ఎక్కిపోయాను అన్న విధంగా మనసులో మానసికంగా సంసిద్ధత సమకూర్చుకున్నాడు.

జాన్ బ్రెడ్ స్లయిస్ వేడిచేసి వెన్న రాస్తున్నాడు.

పర్వత శ్రేణుల్లో గాలి ప్రవాహం అదోలాంటి శబ్దాన్ని మోసుకుని వస్తోంది. మంచు తుంపర్ల వాన మొదలైంది:

జామీ ఆండ్రూ చేతి కర్రను తీసుకున్నాడు.

ఆ కర్రను చూస్తున్నప్పుడు ఆండ్రూకు తన స్నేహితుడు కెన్నడీ గుర్తుకు వచ్చాడు. అతని చిరునవ్వు గుర్తుకు వచ్చింది. కష్టాల్లోనూ, నష్టాల్లోనూ నేనున్నాను అనే అతని స్నేహ మాధుర్యం గుర్తుకు వచ్చింది.

'ఏడి కెన్నడీ?'

తన వెన్నంటి నడిపించిన వాడు... తనతో పర్వతాలను అధిరోహించిన వాడు మరి లేడు... రాడు. మంచులో సమాధి అయిపోయాడు' ఈ ఊహను కూడా జామీ ఆండ్రూ జీర్ణించుకోలేకపోతున్నాడు.

అప్రయత్నంగా అతని కనుకొలుకుల్లోంచి కన్నీళ్ళొచ్చాయి.

కెన్నడీ నవ్వు... అతని మాటలు...తన భుజం మీద చెయ్యి వేసి ముందుకు నడిపించుకుపోయే అతని సాహచర్యం కళ్ళముందు మెదిలాయి.

అవును... కెన్నడీ భౌతికంగా లేకపోవచ్చు. శరీరంతో తనకు కన్పించకపోవచ్చు. కెన్నడీ తన చుట్టూ ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు.... తన ఆలోచనల్లో ఉంటాడు. తన మనసులో ఉంటాడు... తనతోనే ఉంటాడు...

జామీ ఆండ్రూ మనసు పొరల్లో కెన్నడీ మెదిలాడు.

* * *

జామీ ఆండ్రూ ముప్పయ్యేళ్ళ యువకుడు. స్కాట్‌లాండ్ దేశస్తుడు. చిన్నతనం నుంచి పర్వతాలను అధిరోహించాలన్న మక్కువ కలిగి ఉండేవాడు. పర్వతాలకు సంబంధించిన పుస్తకాలను చదివేవాడు. ఏ దేశంలో ఏ పర్వతం ఎంత ఎత్తు ఉందో దానిని అప్పటివరకూ ఎంతమంది అధిరోహించారో మొదలైన విషయాలను తెలుసుకొనేవాడు.

పర్వతారోహకులు తమ విజయాలను, అనుభవాలను వివరిస్తూ రాసే పుస్తకాలు, వారి ఇంటర్వ్యూలు ప్రచురించిన పత్రికలు కొనుక్కుని భద్రపరుచుకునేవాడు.

తాను కూడా పర్వతాలను, మంచు పర్వతాలను ఎక్కాలి. అంతవరకూ విజయాలను సొంతం చేసుకున్న వారి రికార్డులను అధిగమించాలి. మంచిపేరు తెచ్చుకోవాలి అని తపన పడేవాడు.

ఆ సమయంలో కెన్నడీ పరిచయం అయ్యాడు.

ఇద్దరి అభిప్రాయాలు, ఆలోచనలు ఒకటి కావడంతో తొందరలోనే మంచి స్నేహితులుగా మారిపోయారు. కలిసి ప్రయాణం చేయాలని నిశ్చయించుకున్నారు.

జామీ ఆండ్రూ, కెన్నడీ కలిసికట్టుగా ఎన్నో పర్వతాలను ఎక్కారు. తమ అనుభవాలను, మంచు పర్వతాలపై వాతావరణ పరిస్థితుల్ని తమ అనుభూతులుగా వ్యాసాలు వెలువరించారు. కొత్త కొత్త పర్వతాలను ఎక్కి తమ స్నేహాన్ని నిరూపించుకున్నారు.

ఫ్రాన్సులో ఆల్ప్స్ పర్వత శ్రేణిని అధిరోహించాలని స్నేహితులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఈ పర్వతాలలో 'మౌంట్‌బ్లాక్' అనేది ఎత్తయినది. దానిని ఎక్కి తమ రికార్డులను మరోసారి నమోదు చేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

ఎక్కడానికి అవసరమైన సరంజామా... ఇతర పరికరాలు అన్నీ సిద్ధం చేసుకున్నారు.

1995 మేలో ప్రయాణాన్ని మొదలు పెట్టారు.

ఎత్తయిన ఆ మంచు పర్వతం ఎక్కడం వారికి కొత్తగా అనిపించింది. తమ సామాను తామే మోసుకుంటూ పైపైకి ఎక్కడం ప్రారంభించారు.

ముందుగా ఎత్తయిన ప్రాంతంపై మేకు దిగకొట్టి, దానికి తాడు కట్టి, దాని ఆధారంగా పైపైకి ఎక్కవలసి వచ్చేది. ముందుగా మేకులు దిగగొట్టి ఒకరికొకరు తోడుగా పైకి ఎక్కుతుండగా అనుకోని ప్రమాదం జరిగింది.

కొట్టిన మేకు వద్ద మంచు కరిగిపోయింది.

వంకరగా కొట్టిన మేకు బరువుకు జారిపోయింది.

అంతే స్నేహితులిద్దరు దొర్లుకుంటూ లోయలో పడ్డారు. సామాన్లు చిందరవందర అయిపోయాయి.

కెన్నడీ నడుం విరిగిపోయింది.

జామీ ఆండ్రూ తీవ్రంగా గాయపడ్డాడు.

ఇద్దరూ లేవలేకపోయారు. లేచినా లోయలోంచి బైటికి వచ్చే మార్గం కూడా వారికి కనిపించలేదు. మూడు రోజుల పాటు శవాల్లా పడి ఉండిపోయారు.

జామీ ఆండ్రూ మెల్లగా కళ్ళు విప్పాడు. శరీరమంతా పచ్చిపుండులా అయిపోయింది. దూరంగా పడివున్న కెన్నడీని పిలవాలని ప్రయత్నించాడు. నోరు పెగల్లేదు. అతికష్టం మీద కుడిచెయ్యిని కదిలించి చిన్న మంచుగడ్డను కెన్నడీ వైపువిసిరాడు. ఫలితం కనిపించలేదు.

ఫ్రాన్సులో పర్వతారోహణకు బయలుదేరిన విషయం ఇద్దరు మిత్రులు అందరికీ తెలియజేశారు. వారి ప్రయత్నం ఎంతవరకు వచ్చిందో చూద్దామని రక్షణ బృందం హెలికాప్టర్‌పై రావడంతో వీరి విషయం తెలిసింది.

జామీ ఆండ్రు కాళ్ళూ, చేతులు చచ్చుబడిపోయాయి.

వాటిని తొలగించకపోతే ప్రాణానికి ప్రమాదమని వైద్యులు తొలగించారు.

తెలివి వచ్చిన తర్వాత కెన్నడీ గురించి వాకబు చేశాడు.

మంచు లోయలో సజీవ సమాధి అయిపోయాడని రక్షణ సిబ్బంది చెప్పారు. బతికి వున్న తన పరిస్థితి కన్నా స్నేహితుడు ఈ లోకం నుంచే సెలవు తీసుకున్నాడని తెలిసి పొగిలి పొగిలి ఏడ్చాడు.

నాలుగేళ్ళ తర్వాత –

జామీ ఆండ్రు కోలుకున్నాడు.

తొలగించిన కాళ్ళూ చేతుల స్థానంలో కృత్రిమ అవయవాలను అమర్చారు. మొదట నడవడానికి చాలా కష్టంగా అనిపించేది. చేతివేళ్ళు లేకపోవడంతో దేనినీ పట్టుకోవడానికి కుదిరేది కాదు. అయినా, అతను నిరాశ పడలేదు.

రెండేళ్ళ పాటు నిరంతర సాధన చేశాడు.

తన చేతులు, కాళ్ళు కృత్రిమ అవయవాలు అన్న విషయం చెబితే తప్ప ఇతరులు తెలుసుకోలేని విధంగా తయారయ్యాడు.

అతని ఆలోచనల్లో ఎప్పుడూ కెన్నడీయే.

కెన్నడీతో తాను కన్న కలలన్నీ సాకారం చేసుకోవడానికి నిరంతరం తపన చెందేవాడు. మళ్ళీ పర్వాతారోహణ చేయాలని నిర్ణయించుకున్నాడు. తన ప్రాణ స్నేహితుడికి అదే నిజమైన నివాళి అని అనుకున్నాడు.

* * *

మంచు పర్వతం శిఖరాగ్రం కనుచూపు మేరలో కన్పిస్తోంది. జామీ ఆండ్రూకు కర్తవ్యం గుర్తుకు వచ్చింది. వెంటనే లేచి నిలుచున్నాడు.

"జాన్! బీ రెడీ!" అంటూ సిద్ధం చేశాడు.

ఆండ్రూ పట్టుదల జాన్‌కు ఎంతో నచ్చింది.

ప్రయాణానికి అవసరమైన సామాన్లు అన్నీ ప్యాక్ చేసి ఒక కిట్టుగా తయారు చేశాడు. ఆండ్రూ భుజానికి తగిలించాడు. ఏర్పాట్లకు సంబంధించిన కిట్టును తాను తగిలించుకున్నాడు.

ప్రయాణం మొదలైంది.

బెన్‌నెవిస్ అనే పర్వతం బ్రిటన్‌లోనే. చాలా ఎత్తయినదని ప్రసిద్ధి చెందింది. అందుకే ఆండ్రూ ఆ పర్వతాన్ని ఎక్కాలని నిశ్చయించుకున్నాడు.

నాలుగు పగళ్ళు... నాలుగు రాత్రులు నిరంతరాయంగా ప్రయాణం కొనసాగింది. కర్తవ్యం ముందు అలసట గుర్తుకు రాలేదు. లక్ష్యసాధన ముందు శారీరక వైకల్యం అడ్డు రాలేదు. కాళ్ళు చేతులు సహజమైనవైతే కొంతవరకు మనసు నుంచి వచ్చే సంకేతాలకు స్పందిస్తుంటాయి. ఆండ్రూ చేతులూ, కాళ్ళు కృత్రిమమైనవి. మెదడుకు వాటితో కనెక్షన్ లేదు. అందువల్ల ఏ పని చేయాలన్నా కుదరడం లేదు. అయినప్పటికీ ఆండ్రూ పట్టుదల సడలిపోలేదు.

నాలుగువేల అడుగులు ఎక్కేసరికి ఇద్దరూ అలిసిపోయారు. జాన్ మరి ముందుకు వెళ్ళలేనని కూలబడిపోయాడు. ఆండ్రూ కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత తన కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

మంచుకు శరీరం కొంకర్లు తిరిగిపోతోంది. ఎటు చూసినా తెరల్లాంటి తెల్లని మంచు.. గమ్యం కంటికి కనిపిస్తున్నా అడుగు వేయడం కష్టంగా ఉంటోంది.

శక్తిని కూడదీసుకుని ఒక్కొక్క అడుగు కదిలించాడు. ఎవరూ వెంట రాకున్నా ఒక్కడే 'బెన్‌నెవిస్' పర్వతాన్ని అధిరోహించాడు. శిఖరాగ్రం చేరుకున్న తర్వాత సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

రెండు చేతులూ పైకి ఎత్తి హ్యాండ్ స్టిక్‌ను గాలిలోకి తిప్పుతూ చిన్నపిల్లవాడిలా కేరింతలు కొట్టాడు. ఆనందం పట్టలేక 'యాహూ?' అంటూ గట్టిగా అరిచాడు.

దూరంగా కింద వున్న సహాయకుడు జాన్ ఇదంతా గమనిస్తూనే వున్నాడు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న తాను ఎక్కలేక ఆగిపోయిన శిఖరాగ్రాన్ని ఆండ్రూ అధిరోహించడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. పట్టుదల, తపన, కృషి, దృఢచిత్తం ఉంటే ఎటువంటి పని అయినా చేయవచ్చునని ఆండ్రూని చూసి తెలుసుకోవచ్చునని అనుకున్నాడు.

ఈ లోపు ఆండ్రూ తను పర్వతాన్ని అధిరోహించిన గుర్తుగా విజయపతాకాన్ని అక్కడ పాతాడు. చెక్కించి తెచ్చిన శిలాఫలకాన్ని ఆ కింద తాపడం చేశాడు. దానిపైన లామినేషన్ చేయించి మంచుకు పాడవని కెన్నడీ చిత్రపటాన్ని అమర్చాడు. ఆ ఫొటో కింద శిలాఫలకంలో కెన్నడీ స్మృతికి ఈ విజయం అంకితం' అని ఉంది. కింద జామీ ఆండ్రూ పేరు, ఆనాటి తేదీ చెక్కి ఉంది.

అన్ని కార్యక్రమాలు సక్రమంగా పూర్తి చేసిన తర్వాత కిందకు దిగాడు. జాన్ ఆగిపోయిన ప్రాంతానికి వచ్చి "4209 అడుగుల ఎత్తున్న ఈ పర్వతం ఎక్కగలనని అనుకోలేదు. నా స్నేహితుడు కెన్నడీయే మీద నుంచి నన్ను పిలుస్తున్నట్లు ఎక్కించాడు" అన్నాడు గద్గద స్వరంతో.

"స్నేహితుని కోసం దేనినీ లక్ష్య పెట్టకుండా మీరు సాధించిన విజయం గొప్పది. బ్రిటన్‌లో ఎంతో ఎత్తయిన ఈ శిఖరం మీ పట్టుదల ముందు తల వంచి ఒదిగినట్లయింది. వైకల్యంతో మీరు సాధించిన విజయం ఎందరికో మార్గదర్శకం..' జాన్ అభినందించాడు.

జామీ ఆండ్రూకు తన స్నేహితుడు కళ్ళముందు మెదిలాడు. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ◆

లక్ష్మి

ఆండాళమ్మ భర్త...

ఎవరైనా అబద్ధాలు చెబుతున్నప్పుడు - కతలు వినిపించవద్దంటారు!

అంటే ఏమిటి? కథకీ అబద్ధానికీ దగ్గిర పోలికలున్నాయని తెలిసిపోతోంది గదా!

కథలో - వాస్తవం కంటే అబద్ధమే ఎక్కువగా వుంటుంది!

ఒక వాస్తవాన్ని కథగా రాయాలనుకున్నప్పుడు - జరిగింది జరిగినట్లు రాస్తే ఆ కథకి పట్టుండదని కథకులు చెబుతుంటారు!

జరిగింది యథాతథంగా రాస్తే అది 'వార్త' అవుతుంది!

వార్తలు సరఫరా చేసేందుకు అనేకమైన ఏర్పాట్లుండగా - అవి చాలవన్నట్లు - కథలు కూడా ఎందుకని పాఠకులు విసుక్కునే ప్రమాదముంది!

ఈ టైపులో రాసే రచయితను విలేకరి అంటారేగాని కథా రచయితగా పిలవకూడదని కూడా కోప్పడతారు!

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే - మొన్నామధ్య ఒక పేరంటానికి వెళ్ళేను. ఆ పేరంటంలో ప్రముఖ రచయిత్రి ఆండాళమ్మగారిని కలుసుకోడం జరిగింది!

ఆవిడ కథలు నామట్టుకు నేను చాలా చదివేను!

నాకిష్టమైన రచయిత్రుల్లో ఆవిడొకరు!

అంచేత-

పేరంటాన్ని విడిచిపెట్టి ఆవిడతో చాలాసేపు ముచ్చట్లతో గడిపేను. ఆండాళమ్మగారు కలుపుగోలు మనిషి. మనం అయిదు నిమిషాలు మాటాడితే ఆవిడ అరగంట మాటాడుతారు!

ఆవిడ ధోరణి నాకు నచ్చింది!

అందుకే చనువుగా అడిగేను!

అందరూ అడిగేదే! కథలు రాయాలనే కోరిక మీకు ఎప్పుడు కలిగిందని అడిగేను!

పెళ్ళయింతర్వాత కలిగిందన్నారు!

అంతకుముందు కథలు రాసేవారు కాదా అని రెండో ప్రశ్న అడిగేను. కనీసం కథలు చదివేదాన్ని కూడా కాదని సమాధానమిచ్చేరు!

అయితే మీ కథా రచనకి మీ వారే కారణమంటారు! అవునా? అని మూడో ప్రశ్న అడిగేను. అవును అన్నారు ఆవిడ!

మీ వారు కూడా కథా రచయితేనా అని నాలుగో ప్రశ్న అడిగేను!

కాదు అన్నారు ఆవిడ!

పోనీ కథలెక్కువగా చదువుతుంటారా అని అడిగేను!

అస్సలు చదవరు అన్నారు ఆవిడ!

ఆవిడ సమాధానాలు విని తెల్లమొహం వేసేను. కథా రచనకు వాళ్ళాయనే కారణమన్న ఆండాళమ్మగారు - తన భర్త కథా రచయిత కాదనీ అస్సలు కథలే చదవరని చెబుతున్నప్పుడు ఆశ్చర్యంగా వుండదూ!

అందుకే కుండబద్దలు కొట్టినట్టు - కథలు రాయకుండా, కథలు చదివే అలవాటు బొత్తిగా లేకుండా - మీ వారు మిమ్మల్ని కథా రచనకు ఎట్లా ప్రోత్సహించేరని ఆవిడ్ని అడిగేసేను!

నా ప్రశ్నకు ఆండాళమ్మ నవ్వేసేరు!

నవ్వు పూర్తయింతర్వాత తాపీగా చెప్పేరు!

"ప్రోత్సాహమంటారో కేవలం ప్రేరణ అంటారో విడిచిపెట్టండి. కథా రచయిత్రిగా ఇవాళ నాకింత గుర్తింపు లభించిందంటే - అందుక్కారణం మా వారే! నిజంగా మావారే! ఆశువుగా అబద్ధం చెప్పడంలో మావారు గొప్ప చమత్కారి! చిన్న చిన్న విషయాల్లో కూడా మావారు కథలే వినిపిస్తారు! అబద్ధాలు చాలా మంది చెప్పచ్చు. అందంగా చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి. ఆఫీసు నుంచి లేటుగా ఎందుకుకొచ్చేరో చెబుతారు.. ఇంటి నుంచి ఎర్లీగా ఎందుకు వెళ్ళిపోతున్నారో చెబుతారు... ప్రత్యేకించి కాకినాడ కేంపు ఎందుకు పడిందో చెబుతారు... వరంగల్‌లో సముద్రం లేదని మనకు తెలుసు. ఆయన చెబుతున్నప్పుడు మాత్రం కచ్చితంగా వుండే వుంటుందని అనుకుంటాం. ఆ వరంగల్ బీచ్ గురించి ఎంతో అందంగా మన కళ్ళకక్కట్టినట్టు చెబుతారు! ఆయన అబద్ధాల్లో బొమ్మలు కూడా కనిపిస్తాయి. సినీమా చూస్తున్నట్లే వుంటుందనుకోండి. ఆయన చెప్పే సినీమా కథలు వింటున్నప్పుడు - ఆ కథల ప్రభావంతో నేనోకథ రాయలేనా? మా వారికి కథలు రాయడంలోగానీ చదవడంలోగానీ ప్రవేశం లేకపోయినా కథలు చెప్పడంలో మాత్రం గొప్ప క్రియేటివిటీ వున్న మనిషి. శ్రీవారి పుణ్యమాని నేను కథా రచయిత్రినయ్యేను" అన్నారావిడ.

ఆవిడ చెప్పిన ఉదంతం విని ఆశ్చర్యపోయేను!

నా ఆశ్చర్యాన్ని గమనించి ఆవిడే అడిగేరు -

"మీ వారికి కథలు రాసే అలవాటుందా?"

"లేదు!"

"మరి చెప్పరే? అందుకే మీరు కథలు రాయడం లేదు. పేర్లెందుకులేండిగానీ - నాకు తెలిసిన రచయిత్రులు చాలా మంది పాపం నా టైపే! ఇంటో శ్రీవారు చెప్పే కథల ధోరణికి బాగా అలవాటు పడి కథలు రాయడం ప్రారంభించేరు. ఇప్పుడనిపిస్తోంది లక్ష్మిగారూ - కట్టుకున్న వాడు ఆశువుగా అబద్ధాలు చెప్పే మనిషైతే - కథా వస్తువు కోసం సదరు రచయిత్రి వెతుక్కోనక్కర్లేదు. రాసుకునే ఓపిక వుండాలేగాని - భర్త మహాశయుడు చెప్పే అబద్ధాలతోనే వేలాది కథలు పూర్తి చేసుకుని ఎంచక్కా ఆస్థాయిలోనే పేరు తెచ్చుకోవచ్చు. ఏవంటారు?"

ఆవిడ ఇంత చెప్పిన తర్వాత ఇంకా ఏమంటాను?

నేను ఏమీ అనుకుండానే ఆవిడే అన్నారు -

"మచ్చుకి ఏదో ఒక కథ శ్రీవారికి అంకితమిచ్చి రుణం తీర్చుకోడం వరకు మంచిదేగాని - ప్రత్యేకించి శ్రీవారికే ఎందుకు అంకితమివ్వవలసి వచ్చిందో చెప్పకూడదు. తొందరపడి చెబితే మునుముందు కథా వస్తువులు దొరక్కుండాపోతాయి!"

అంతేగదా మరి? ◆

మీ స్కూలు ఎలా వుంటుంది?

నేస్తాలూ... మీ స్కూలు ఎలా వుంటుంది? అన్ని సబ్జెక్టులకు మాష్టార్లు వస్తున్నారా! ప్లేగ్రౌండు, లైబ్రెరీ... వున్నాయా? ఇంకా మీ బడిలో ఏం వుంటే బావుంటుందనుకుంటున్నారు? పూర్తి అడ్రస్‌తో కార్డుమీద రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

ఆ పదం ఏంటబ్బా!

హేయ్ చిన్నారులూ! ఇవాళ మీ ఆంగ్ల భాషా పరిజ్ఞానానికి ఓ పరీక్ష పెట్టాలనుకుంటున్నాం. మరి అడుగమంటారా?

ఆంగ్లంలో ఓ పదం వుంది. అందులో తొమ్మిది అక్షరాలు వున్నాయి. ఈ పదంలోంచి ఒక్కో అక్షరం తగ్గిస్తూ వుంటే ఒక్కో కొత్త మాట తయారవుతుంది. చివరి అక్షరంతో సహా ప్రతి పదానికి ఏదో ఒక అర్థం వుంటుంది.

ఏంటి? బుర్ర గోక్కుంటూ ఆలోచిస్తున్నారు? ఆ పదం ఏంటో? అనా! మరికొందరైతే 'ఆ పదం ఏంటో చెప్పొచ్చుకదా. ఎంచక్కా కొత్త పదాలను తయారుచేస్తాం' అన్నట్టు చూస్తున్నారు. ఎంత ఆశ! అసలు అది చెప్పేస్తే ఇంక మీ బుర్రకు పనేం వుంటుంది? బాగా ఆలోచించండి. తెలీకపోతే మాత్రం వచ్చేవారం ఇదే శీర్షికలో చూడండే.

బయటది తింటాం! లోపలది పడేస్తాం!! ఏమిటది?

హేయ్ ఈ వారం మీకోసం ఓ తిండిపదార్థం వచ్చింది. అదేంటో చెప్పాలి మీరు. మరి ప్రశ్న అడగమంటారా?

మనం ఒకటి కొంటాం. కొన్నాక బయటది తీసేస్తాం. లోపలది ఉడకపెడతాం. తర్వాత బయటది తింటాం. మళ్లీ లోపలది పడేస్తాం. ఏమిటది?

'అబ్బో తికమకగా వుందే. బయటది పడేస్తాం. లోపలది... అవెబ్బా కాస్త ఆలోచించుకోవాల్సిందే' అనుకుంటున్నారు కొందరు చిన్నారులు. మరి బాగా ఆలోచించుకోండి. సరైన సమాధానం కావాలంటే ఏ..డు..రో..జు..లు ఆగాల్సిందే.

చిక్కుప్రశ్న

ఎత్తైన శిఖరం అదే!

ఎవరెస్ట్‌ను కనుగొనక ముందు కూడా ఎత్తైన శిఖరం ఎవరెస్టే. అంతేకదా. ఎవరెస్ట్‌ని మనం కనుక్కోకపోయినా ... అది అక్కడే వుంది కదా. అంటే ఎత్తైన శిఖరం అదే కదా.

ఇంద్రపాలితుడు - ధనగుప్తుడు

ఒక పట్టణంలో ఇంద్రపాలితుడనే వర్తకుడున్నాడు. అతను ఒకరోజు వ్యాపారం కోసం దూరదేశానికి బయలుదేరాడు. వెళ్లే ముందు తన దగ్గర వున్న అరవై బారువుల ఇనుమును ధనగుప్తుడనే స్నేహితుని ఇంట్లో వుంచాడు. "మిత్రమా! ఈ లోహాన్ని తిరిగి వచ్చాక తీసుకుంటాను. అందాకా నీ దగ్గరే వుంచు" అన్నాడు ఇంద్రపాలితుడు. "అలాగే" అన్నాడు ధనగుప్తుడు. కొన్నాళ్లకు ఇంద్రపాలితుడు తిరిగి వచ్చాడు.

వెంటనే ధనగుప్తుని కలిసి, "మిత్రమా! నేను వ్యాపారంలో బాగా నష్టపోయాను. ఇప్పుడు ఇనుము ధర పెరిగింది. నీ దగ్గర దాచిన ఇనుమును అమ్మి కొంత నష్టం పూడ్చుకోవాలనుకుంటున్నాను. అది తెచ్చివ్వు..." అన్నాడు. "ఏం చెప్పమంటావు మిత్రమా! నీవు దాచుకున్న ఇనుమును ఎలుకలు తినేశాయి" అన్నాడు ధనగుప్తుడు విచారంగా.

ఇంద్రపాలితుడికి ధనగుప్తుడి ఉద్దేశం అర్థమయ్యింది. అయినా అతను కోపం తెచ్చుకోలేదు. 'మోసాన్ని మోసంతోనే జయించాలి. ఈ ధనగుప్తుడికి తగిన బుద్ధి చెప్పాలి' అనుకున్నాడు. "ధనగుప్తా! లోహాన్ని ఎలుకలు తింటే నువ్వు మాత్రం ఏం చేస్తావు? అంతా నా దురదృష్టం" అని ఇంటికి వెళ్లిపోయాడు ఇంద్రపాలితుడు.

ఆ రోజు నుండి ఇంద్రపాలితుడు వీలైనప్పుడల్లా ధనగుప్తుడి ఇంటికి వెళ్లసాగాడు. మునుపటి కంటే స్నేహంగా మెలగసాగాడు. ఒకరోజు ధనగుప్తుని కొడుకు ఏడుస్తుంటే, "పండ్లు కొనుక్కొని వద్దాం" అని అన్నాడు. ధనగుప్తుడు కూడా ఎదురుచెప్పలేదు. ఇంద్రపాలితుడు ఆ కుర్రవాడిని తీసుకువెళ్లి స్నేహితుని ఇంట్లో దాచి ఒంటరిగా ధనగుప్తుడి దగ్గరకు వెళ్లాడు. "ఒక్కడివే వచ్చావేంటి? మా అబ్బాయి ఎక్కడ?" అని అడిగాడు ధనగుప్తుడు. "ఏం చెప్పమంటావు మిత్రమా? మీ అబ్బాయికి పండ్లు కొనిపెట్టి ఇంటికి తీసుకువస్తుంటే గద్ద తన్నుకుపోయింది" అన్నాడు ఇంద్రపాలితుడు. వెంటనే ధనగుప్తుడు రాజుగారికి ఫిర్యాదు చేశాడు. రాజుగారు ఇంద్రపాలితుడిని పిలిపించారు. "ఇంద్రపాలితా! బజారుకు వెళ్తూ ధనగుప్తుని కొడుకుని తీసుకువెళ్లావా?"

"అవును ప్రభూ!"

"ఆ పిల్లవాడిని గద్ద ఎత్తుకుపోయిందని చెప్పావట? గద్ద ఎక్కడైనా పిల్లల్ని ఎత్తుకుపోతుందా? విడ్డూరం కాదా?" అన్నాడు రాజు.

"ప్రభూ! అరవై బారువుల ఇనుమును ఎలుకలు తిన్నాయని అనడం కంటే ఇది విడ్డూరమా? ఎలుకలు ఇనుమును తిన్నాయో లేదో ధనగుప్తుడికి తెలుసు. అడిగి చూడండి?" అన్నాడు ఇంద్రపాలితుడు.

"ఏం ధనగుప్తా! ఇంద్రపాలితుడి మాటలు నిజమేనా?" అని ప్రశ్నించాడు రాజు. "నిజమే ప్రభూ!" అన్నాడు ధనగుప్తుడు తలవంచుకొని.

"మహారాజా! నేను వ్యాపారం చేయడానికి దూరదేశానికి వెళ్తూ అరవై బారువుల ఇనుమును అతని వద్ద దాచాను. తిరిగి వచ్చి నా ఇనుము నాకు ఇమ్మంటే ఎలుకలు తినేశాయని అన్నాడు. ఇనుమును ఎలుకలు తినడం కంటే పిల్లవాడిని గద్ద తన్నుకుపోవడం విడ్డూరమా?" అన్నాడు ఇంద్రపాలితుడు. ధనగుప్తుడు చేసిన మోసానికి గట్టిగా బుద్ధి చెప్పాలని ఇంద్రపాలితుడు ఇలాంటి ఉపాయం పన్నాడని గ్రహించాడు రాజు. తర్వాత ధనగుప్తుణ్ణి తీవ్రంగా మందలించి ఇంద్రపాలితుడి ఇనుమును తెప్పించి, అతనికి ఇప్పించాడు. పిల్లవాడిని పిలిపించి ధనగుప్తునికి అప్పగించాడు.

ఎటుచూసినా మంచు.

కనుచూపు మేరలో తెల్లని పర్వతాలు ఐరావతాల్లా తళతళలాడుతున్నాయి. మంచు కొండల పై నుంచి వీస్తున్న గాలి శరీరాన్ని చల్లగా చుట్టేస్తోంది. ఆకాశంలో దూది పింజల్లాంటి మేఘాలు మంచులో కలిసిపోతున్నాయి.

ఒదిగిన పర్వత శిఖరం

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

జామీ ఆంద్రూ నిస్త్రాణంగా కూలబడ్డాడు. భుజం మీదున్న కిట్టును పక్కన పెట్టుకున్నాడు.

చలికి శరీరం గడ్డకట్టుకుపోయేలా ఉంది. అయినా అతనికి నిరుత్సాహం కలగడం లేదు. ఎంత తొందరగా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించాలా అని ఉత్సాహపడుతున్నాడు.

బ్రిటన్‌లో ఉన్న బెన్‌నెవిస్ అనే మంచు పర్వతం చాలా ఎత్తయినది. దానిని అధిరోహించిన వారు అతి కొద్దిమంది. వారి గురించి అందరూ గొప్పగా చెప్పుకుంటారు. అలా తన గురించి కూడా అందరూ చెప్పుకోవాలని జామీ ఆంద్రూ తాపత్రయం. అందుకు అనుగుణంగానే ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

ఎత్తయిన పర్వతశిఖరం ఎక్కడానికి సిద్ధపడినప్పుడు సన్నిహితులు, స్నేహితులు అందరూ వద్దన్నారు. ఒకసారి ప్రమాదం నుంచి బైటపడిన తర్వాత బుద్ధిగా ఉండకుండా మళ్ళీ ఈ తాపత్రయం ఎందుకని హేళన చేశారు.

'కాళ్ళూ చేతులూ లేకపోయినా పట్టుదలకు లోటులేదు అని మరికొంతమంది హేళన చేశారు. దీంతో ఆంద్రూలో పట్టుదల మరింతగా పెరిగిపోయింది.

ఎలాగైనా అనుకున్నది సాధించాలి.

అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న వారే అధిరోహించడానికి ధైర్యం చేయలేని బెన్‌నెవిస్ పర్వతాన్ని తాను ఎక్కాలి. బ్రిటన్‌లో అందరూ ముక్కుమీద వేలు వేసుకునేలా విజయం సాధించాలి. వికలాంగులు సాధించలేనిది ఏమీ లేదని నిరూపించాలి అనుకున్నాడు ఆంద్రూ.

అందుకే పర్వతారోహణకు శ్రీకారం చుట్టాడు.

రెండు కాళ్ళూ లేనందువల్ల అమర్చిన కర్రకాళ్ళను సరిచేసుకున్నాడు. ఆ కాళ్ళకి ప్రత్యేకమైన బూట్లు తొడిగాడు. రెండు చేతులు లేకపోయినా పెట్టుడు చేతులు అమర్చుకున్నాడు. ఆ చేతులతో హ్యాండ్‌స్టిక్స్ కూడా పట్టుకున్నాడు.

ఓ సహాయకుడు మాత్రం వెంట వచ్చాడు.

వంద అడుగులు ఎక్కేసరికి అలసట మొదలైంది. కాళ్ళు చేతులూ సరిగా పని చేయడం లేదు. మంచుపైన పట్టుదొరకకపోవడంతో అతి కష్టం మీద నిలదొక్కుకుంటున్నాడు.

అడుగు తీసి అడుగు వేయడం కష్టం అవుతోంది.

ఆంద్రూ అవస్థ చూస్తుంటే అతని సహాయకుడికి కూడా దుఃఖం తన్నుకు వస్తోంది. అతని కర్తవ్యం ముందు తాను ఎంతో అల్పుడినని గుర్తించాడు.

"సార్! గంట విశ్రాంతి తీసుకుందాం!" జాన్ చెప్పడంతో ఆంద్రూ మనసు విశ్రాంతి వైపు మళ్ళింది. అప్పటికే అతని శరీరం, మనసు ముందుకు ప్రయాణం చేయడానికి సహకరించడం లేదు.

''సరే నీ ఇష్టం!'' అంటూ కూలబడిపోయాడు.

జాన్ తాత్కాలిక టెంటును ఏర్పాటు చేసి మంచు గాలులు లోపలికి ప్రవేశించకుండా చుట్టూ పరదా కట్టాడు. ఆ పక్కన ఓ మూల చిన్న మంట రాజేశాడు. రిలాక్స్ అవడానికి వాలు కుర్చీని అమర్చాడు.

జామీ ఆంద్రూ జారగిలబడ్డాడు.

పర్వతం ఎత్తు 4409 అడుగులు. అడుగు తీసి అడుగు వెంటవెంటనే వేసినప్పటికీ వారం పది రోజులు పడుతుంది. అయినప్పటికీ నిరాశ పడకూడదు అనుకున్నాడు. ఇంకా ఎన్నో వందల అడుగులు ఎక్కాలి, అనుకోకుండా అప్పుడే వంద అడుగులు ఎక్కిపోయాను అన్న విధంగా మనసులో మానసికంగా సంసిద్ధత సమకూర్చుకున్నాడు.

జాన్ బ్రెడ్ స్లయిస్ వేడిచేసి వెన్న రాస్తున్నాడు.

పర్వత శ్రేణుల్లో గాలి ప్రవాహం అదోలాంటి శబ్దాన్ని మోసుకుని వస్తోంది. మంచు తుంపర్ల వాన మొదలైంది.

జామీ ఆంద్రూ చేతి కర్రను తీసుకున్నాడు.

ఆ కర్రను చూస్తున్నప్పుడు ఆంద్రూకు తన స్నేహితుడు కెన్నడీ గుర్తుకు వచ్చాడు. అతని చిరునవ్వు గుర్తుకు వచ్చింది. కష్టాల్లోనూ, నష్టాల్లోనూ నేనున్నాను అనే అతని స్నేహ మాధుర్యం గుర్తుకు వచ్చింది.

'ఏడి కెన్నడీ?'

తన వెన్నంటి నడిపించిన వాడు... తనతో పర్వతాలను అధిరోహించిన వాడు మరి లేడు... రాడు. మంచులో సమాధి అయిపోయాడు' ఈ ఊహను కూడా జామీ ఆంద్రూ జీర్ణించుకోలేకపోతున్నాడు.

అప్రయత్నంగా అతని కనుకొలుకుల్లోంచి కన్నీళ్ళొచ్చాయి.

కెన్నడీ నవ్వు... అతని మాటలు..తన భుజం మీద చెయ్యి వేసి ముందుకు నడిపించుకుపోయే అతని సాహచర్యం కళ్ళముందు మెదిలాయి.

అవును... కెన్నడీ భౌతికంగా లేకపోవచ్చు. శరీరంతో తనకు కన్పించకపోవచ్చు. కెన్నడీ తన చుట్టూ ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు.... తన ఆలోచనల్లో ఉంటాడు. తన మనసులో ఉంటాడు... తనతోనే ఉంటాడు...

జామీ ఆంద్రూ మనసు పొరల్లో కెన్నడీ మెదిలాడు.

* * *

జామీ ఆండ్రూ ముప్పయ్యేళ్ళ యువకుడు. స్కాట్‌లాండ్ దేశస్తుడు. చిన్నతనం నుంచి పర్వతాలను అధిరోహించాలన్న మక్కువ కలిగి ఉండేవాడు. పర్వతాలకు సంబంధించిన పుస్తకాలను చదివేవాడు. ఏ దేశంలో ఏ పర్వతం ఎంత ఎత్తు ఉందో దానిని అప్పటివరకూ ఎంతమంది అధిరోహించారో మొదలైన విషయాలను తెలుసుకునేవాడు.

పర్వతారోహకులు తమ విజయాలను, అనుభవాలను వివరిస్తూ రాసే పుస్తకాలు, వారి ఇంటర్వ్యూలు ప్రచురించిన పత్రికలు కొనుక్కుని భద్రపరుచుకునేవాడు.

తాను కూడా పర్వతాలను, మంచు పర్వతాలను ఎక్కాలి. అంతవరకూ విజయాలను సొంతం చేసుకున్న వారి రికార్డులను అధిగమించాలి. మంచిపేరు తెచ్చుకోవాలి అని తపన పడేవాడు.

ఆ సమయంలో కెన్నడీ పరిచయం అయ్యాడు.

ఇద్దరి అభిప్రాయాలు, ఆలోచనలు ఒకటి కావడంతో తొందరలోనే మంచి స్నేహితులుగా మారిపోయారు. కలిసి ప్రయాణం చేయాలని నిశ్చయించుకున్నారు.

జామీ ఆండ్రూ, కెన్నడీ కలిసికట్టుగా ఎన్నో పర్వతాలను ఎక్కారు. తమ అనుభవాలను, మంచు పర్వతాలపై వాతావరణ పరిస్థితుల్ని తమ అనుభూతులుగా వ్యాసాలు వెలువరించారు. కొత్త కొత్త పర్వతాలను ఎక్కి తమ స్నేహాన్ని నిరూపించుకున్నారు.

ఫ్రాన్సులో ఆల్ప్స్ పర్వత శ్రేణిని అధిరోహించాలని స్నేహితులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఈ పర్వతాలలో 'మౌంట్‌బ్లాక్' అనేది ఎత్తయినది. దానిని ఎక్కి తమ రికార్డులను మరోసారి నమోదు చేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

ఎక్కడానికి అవసరమైన సరంజామా... ఇతర పరికరాలు అన్నీ సిద్ధం చేసుకున్నారు.

1995 మేలో ప్రయాణాన్ని మొదలు పెట్టారు.

ఎత్తయిన ఆ మంచు పర్వతం ఎక్కడం వారికి కొత్తగా అనిపించింది. తమ సామాను తామే మోసుకుంటూ పైపైకి ఎక్కడం ప్రారంభించారు.

ముందుగా ఎత్తయిన ప్రాంతంపై మేకు దిగకొట్టి, దానికి తాడు కట్టి, దాని ఆధారంగా పైపైకి ఎక్కవలసి వచ్చేది. ముందుగా మేకులు దిగగొట్టి ఒకరికొకరు తోడుగా పైకి ఎక్కుతుండగా అనుకోని ప్రమాదం జరిగింది.

కొట్టిన మేకు వద్ద మంచు కరిగిపోయింది.

వంకరగా కొట్టిన మేకు బరువుకు జారిపోయింది.

అంతే స్నేహితులిద్దరు దొర్లుకుంటూ లోయలో పడ్డారు. సామాన్లు చిందరవందర అయిపోయాయి.

కెన్నడీ నడుం విరిగిపోయింది.

జామీ ఆండ్రూ తీవ్రంగా గాయపడ్డాడు.

ఇద్దరూ లేవలేకపోయారు. లేచినా లోయలోంచి బైటికి వచ్చే మార్గం కూడా వారికి కనిపించలేదు. మూడు రోజుల పాటు శవాల్లా పడి ఉండిపోయారు.

జామీ ఆండ్రూ మెల్లగా కళ్ళు విప్పాడు. శరీరమంతా పచ్చిపుండులా అయిపోయింది. దూరంగా పడివున్న కెన్నడీని పిలవాలని ప్రయత్నించాడు. నోరు పెగల్లేదు. అతికష్టం మీద కుడిచెయ్యిని కదిలించి చిన్న మంచుగడ్డను కెన్నడీ వైపువిసిరాడు. ఫలితం కనిపించలేదు.

ఫ్రాన్సులో పర్వతారోహణకు బయలుదేరిన విషయం ఇద్దరు మిత్రులు అందరికీ తెలియజేశారు. వారి ప్రయత్నం ఎంతవరకు వచ్చిందో చూద్దామని రక్షణ బృందం హెలికాప్టర్‌పై రావడంతో వీరి విషయం తెలిసింది.

జామీ ఆండ్రు కాళ్ళూ, చేతులు చచ్చుబడిపోయాయి.

వాటిని తొలగించకపోతే ప్రాణానికి ప్రమాదమని వైద్యులు తొలగించారు.

తెలివి వచ్చిన తర్వాత కెన్నడీ గురించి వాకబు చేశాడు.

మంచు లోయలో సజీవ సమాధి అయిపోయాడని రక్షణ సిబ్బంది చెప్పారు. బతికి వున్న తన పరిస్థితి కన్నా స్నేహితుడు ఈ లోకం నుంచే సెలవు తీసుకున్నాడని తెలిసి పొగిలి పొగిలి ఏడ్చాడు.

నాలుగేళ్ళ తర్వాత –

జామీ ఆండ్రు కోలుకున్నాడు.

తొలగించిన కాళ్ళూ చేతుల స్థానంలో కృత్రిమ అవయవాలను అమర్చారు. మొదట నడవడానికి చాలా కష్టంగా అనిపించేది. చేతివేళ్ళు లేకపోవడంతో దేనినీ పట్టుకోవడానికి కుదిరేది కాదు. అయినా, అతను నిరాశ పడలేదు.

రెండేళ్ళ పాటు నిరంతర సాధన చేశాడు.

తన చేతులు, కాళ్ళు కృత్రిమ అవయవాలు అన్న విషయం చెబితే తప్ప ఇతరులు తెలుసుకోలేని విధంగా తయారయ్యాడు.

అతని ఆలోచనల్లో ఎప్పుడూ కెన్నడీయే.

కెన్నడీతో తాను కన్న కలలన్నీ సాకారం చేసుకోవడానికి నిరంతరం తపన చెందేవాడు. మళ్ళీ పర్వాతారోహణ చేయాలని నిర్ణయించుకున్నాడు. తన ప్రాణ స్నేహితుడికి అదే నిజమైన నివాళి అని అనుకున్నాడు.

* * *

మంచు పర్వతం శిఖరాగ్రం కనుచూపు మేరలో కన్పిస్తోంది. జామీ ఆండ్రూకు కర్తవ్యం గుర్తుకు వచ్చింది. వెంటనే లేచి నిలుచున్నాడు.

"జాన్! బీ రెడీ!" అంటూ సిద్ధం చేశాడు.

ఆండ్రూ పట్టుదల జాన్‌కు ఎంతో నచ్చింది.

ప్రయాణానికి అవసరమైన సామాన్లు అన్నీ ప్యాక్ చేసి ఒక కిట్టుగా తయారు చేశాడు. ఆండ్రూ భుజానికి తగిలించాడు. ఏర్పాట్లకు సంబంధించిన కిట్టును తాను తగిలించుకున్నాడు.

ప్రయాణం మొదలైంది.

బెన్‌నెవిస్ అనే పర్వతం బ్రిటన్‌లోనే చాలా ఎత్తయినదని ప్రసిద్ధి చెందింది. అందుకే ఆండ్రూ ఆ పర్వతాన్ని ఎక్కాలని నిశ్చయించుకున్నాడు.

నాలుగు పగళ్ళు... నాలుగు రాత్రులు నిరంతరాయంగా ప్రయాణం కొనసాగింది. కర్తవ్యం ముందు అలసట గుర్తుకు రాలేదు. లక్ష్యసాధన ముందు శారీరక వైకల్యం అడ్డు రాలేదు. కాళ్ళు చేతులు సహజమైనవైతే కొంతవరకు మనసు నుంచి వచ్చే సంకేతాలకు స్పందిస్తుంటాయి. ఆండ్రూ చేతులూ, కాళ్ళు కృత్రిమమైనవి. మెదడుకు వాటితో కనెక్షన్ లేదు. అందువల్ల ఏ పని చేయాలన్నా కుదరడం లేదు. అయినప్పటికీ ఆండ్రూ పట్టుదల సడలిపోలేదు.

నాలుగువేల అడుగులు ఎక్కేసరికి ఇద్దరూ అలిసిపోయారు. జాన్ మరి ముందుకు వెళ్ళలేనని కూలబడిపోయాడు. ఆండ్రూ కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత తన కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

మంచుకు శరీరం కొంకర్లు తిరిగిపోతోంది. ఎటు చూసినా తెరల్లాంటి తెల్లని మంచు.. గమ్యం కంటికి కనిపిస్తున్నా అడుగు వేయడం కష్టంగా ఉంటోంది.

శక్తిని కూడదీసుకుని ఒక్కొక్క అడుగు కదిలించాడు. ఎవరూ వెంట రాకున్నా ఒక్కడే 'బెన్‌నెవిస్' పర్వతాన్ని అధిరోహించాడు. శిఖరాగ్రం చేరుకున్న తర్వాత సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

రెండు చేతులూ పైకి ఎత్తి హ్యాండ్ స్టిక్‌ను గాలిలోకి తిప్పుతూ చిన్నపిల్లవాడిలా కేరింతలు కొట్టాడు. ఆనందం పట్టలేక 'యాహూ?' అంటూ గట్టిగా అరిచాడు.

దూరంగా కింద వున్న సహాయకుడు జాన్ ఇదంతా గమనిస్తూనే వున్నాడు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న తాను ఎక్కలేక ఆగిపోయిన శిఖరాగ్రాన్ని ఆండ్రూ అధిరోహించడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. పట్టుదల, తపన, కృషి, దృఢచిత్తం ఉంటే ఎటువంటి పని అయినా చేయవచ్చునని ఆండ్రూని చూసి తెలుసుకోవచ్చునని అనుకున్నాడు.

ఈ లోపు ఆండ్రూ తను పర్వతాన్ని అధిరోహించిన గుర్తుగా విజయపతాకాన్ని అక్కడ పాతాడు. చెక్కించి తెచ్చిన శిలాఫలకాన్ని ఆ కింద తాపడం చేశాడు. దానిపైన లామినేషన్ చేయించి మంచుకు పాడవని కెన్నడీ చిత్రపటాన్ని అమర్చాడు. ఆ ఫొటో కింద శిలాఫలకంలో 'కెన్నడీ స్మృతికి ఈ విజయం అంకితం' అని ఉంది. కింద జామీ ఆండ్రూ పేరు, ఆనాటి తేదీ చెక్కి ఉంది.

అన్ని కార్యక్రమాలు సక్రమంగా పూర్తి చేసిన తర్వాత కిందకు దిగాడు. జాన్ ఆగిపోయిన ప్రాంతానికి వచ్చి "4209 అడుగుల ఎత్తున్న ఈ పర్వతం ఎక్కగలనని అనుకోలేదు. నా స్నేహితుడు కెన్నడీయే మీద నుంచి నన్ను పిలుస్తున్నట్లు ఎక్కించాడు" అన్నాడు గద్గద స్వరంతో.

"స్నేహితుని కోసం దేనినీ లక్ష్య పెట్టకుండా మీరు సాధించిన విజయం గొప్పది. బ్రిటన్‌లో ఎంతో ఎత్తయిన ఈ శిఖరం మీ పట్టుదల ముందు తల వంచి ఒదిగినట్లయింది. వైకల్యంతో మీరు సాధించిన విజయం ఎందరికో మార్గదర్శకం..' జాన్ అభినందించాడు.

జామీ ఆండ్రూకు తన స్నేహితుడు కళ్ళముందు మెదిలాడు. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ◆

లక్ష్మి

ఆండాళమ్మ భర్త...

ఎవరైనా అబద్ధాలు చెబుతున్నప్పుడు - కతలు వినిపించవద్దంటారు! అంటే ఏమిటి? కథకీ అబద్ధానికీ దగ్గిర పోలికలున్నాయని తెలిసిపోతోంది గదా!

కథలో - వాస్తవం కంటే అబద్ధమే ఎక్కువగా వుంటుంది!

ఒక వాస్తవాన్ని కథగా రాయాలనుకున్నప్పుడు - జరిగింది జరిగినట్లు రాస్తే ఆ కథకి పట్టుండదని కథకులు చెబుతుంటారు!

జరిగింది యథాతథంగా రాస్తే అది 'వార్త' అవుతుంది!

వార్తలు సరఫరా చేసేందుకు అనేకమైన ఏర్పాట్లుండగా - అవి చాలవన్నట్లు - కథలు కూడా ఎందుకని పాఠకులు విసుక్కునే ప్రమాదముంది!

ఈ టైపులో రాసే రచయితను విలేకరి అంటారేగాని కథా రచయితగా పిలవకూడదని కూడా కోప్పడతారు!

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే - మొన్నామధ్య ఒక పేరంటానికి వెళ్ళేను. ఆ పేరంటంలో ప్రముఖ రచయిత్రి ఆండాళమ్మగారిని కలుసుకోడం జరిగింది!

ఆవిడ కథలు నామట్టుకు నేను చాలా చదివేను!

నాకిష్టమైన రచయిత్రుల్లో ఆవిడొకరు!

అంచేత-

పేరంటాన్ని విడిచిపెట్టి ఆవిడతో చాలాసేపు ముచ్చట్లతో గడిపేను. ఆండాళమ్మగారు కలుపుగోలు మనిషి. మనం అయిదు నిమిషాలు మాటాడితే ఆవిడ అరగంట మాటాడుతారు!

ఆవిడ ధోరణి నాకు నచ్చింది!

అందుకే చనువుగా అడిగేను!

అందరూ అడిగేదే! కథలు రాయాలనే కోరిక మీకు ఎప్పుడు కలిగిందని అడిగేను!

పెళ్ళయింతర్వాత కలిగిందన్నారు!

అంతకుముందు కథలు రాసేవారు కాదా అని రెండో ప్రశ్న అడిగేను. కనీసం కథలు చదివేదాన్ని కూడా కాదని సమాధానమిచ్చేరు!

అయితే మీ కథా రచనకి మీ వారే కారణమంటారు! అవునా? అని మూడో ప్రశ్న అడిగేను. అవును అన్నారు ఆవిడ!

మీ వారు కూడా కథా రచయితేనా అని నాలుగో ప్రశ్న అడిగేను!

కాదు అన్నారు ఆవిడ!

పోనీ కథలెక్కువగా చదువుతుంటారారా అని అడిగేను!

అస్సలు చదవరు"అన్నారు ఆవిడ!

ఆవిడ సమాధానాలు విని తెల్లమొహం వేసేను. కథా రచనకు వాళ్ళాయనే కారణమన్న ఆండాళమ్మగారు - తన భర్త కథా రచయిత కాదనీ అస్సలు కథలే చదవరని చెబుతున్నప్పుడు ఆశ్చర్యంగా వుండదూ!

అందుకే కుండబద్దలు కొట్టినట్టు - కథలు రాయకుండా, కథలు చదివే అలవాటు బొత్తిగా లేకుండా - మీ వారు మిమ్మల్ని కథా రచనకు ఎట్లా ప్రోత్సహించేరని ఆవిడ్ని అడిగేసేను!

నా ప్రశ్నకు ఆండాళమ్మ నవ్వేసేరు!

నవ్వు పూర్తయింతర్వాత తాపీగా చెప్పేరు!

"ప్రోత్సాహమంటారో కేవలం ప్రేరణ అంటారో విడిచిపెట్టండి. కథా రచయిత్రిగా ఇవాళ నాకింత గుర్తింపు లభించిందంటే - అందుక్కారణం మా వారే! నిజంగా మావారే! ఆశువుగా అబద్ధం చెప్పడంలో మావారు గొప్ప చమత్కారి! చిన్న చిన్న విషయాల్లో కూడా మావారు కథలే వినిపిస్తారు! అబద్ధాలు చాలా మంది చెప్పచ్చు. అందంగా చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి. ఆఫీసు నుంచి లేటుగా ఎందుకొచ్చేరో చెబుతారు.. ఇంటి నుంచి ఎర్లీగా ఎందుకు వెళ్ళిపోతున్నారో చెబుతారు... ప్రత్యేకించి కాకినాడ కేంపు ఎందుకు పడిందో చెబుతారు... వరంగల్‌లో సముద్రం లేదని మనకు తెలుసు. ఆయన చెబుతున్నప్పుడు మాత్రం కచ్చితంగా వుండే వుంటుందని అనుకుంటాం. ఆ వరంగల్ బీచ్ గురించి ఎంతో అందంగా మన కళ్ళకట్టినట్టు చెబుతారు! ఆయన అబద్ధాల్లో బొమ్మలు కూడా కనిపిస్తాయి. సినీమా చూస్తున్నట్టే వుంటుందనుకోండి. ఆయన చెప్పే సినీమా కథలు వింటున్నప్పుడు - ఆ కథల ప్రభావంతో నేనోకథ రాయలేనా? మా వారికి కథలు రాయడంలోగానీ చదవడంలోగానీ ప్రవేశం లేకపోయినా కథలు చెప్పడంలో మాత్రం గొప్ప క్రియేటివిటీ వున్న మనిషి. శ్రీవారి పుణ్యమాని నేను కథా రచయిత్రినయ్యేను" అన్నారావిడ.

ఆవిడ చెప్పిన ఉదంతం విని ఆశ్చర్యపోయేను!

నా ఆశ్చర్యాన్ని గమనించి ఆవిడే అడిగేరు -

"మీ వారికి కథలు రాసే అలవాటుందా?"

"లేదు!"

"మరి చెప్పరే? అందుకే మీరు కథలు రాయడం లేదు. పేర్లెందుకులెండిగానీ - నాకు తెలిసిన రచయిత్రులు చాలా మంది పాపం నా టైపే! ఇంటో శ్రీవారు చెప్పే కథల ధోరణికి బాగా అలవాటు పడి కథలు రాయడం ప్రారంభించేరు. ఇప్పుడనిపిస్తోంది లక్ష్మిగారూ - కట్టుకున్న వాడు ఆశువుగా అబద్ధాలు చెప్పే మనిషైతే - కథా వస్తువు కోసం సదరు రచయిత్రి వెతుక్కోనక్కర్లేదు. రాసుకునే ఓపిక వుండాలేగాని - భర్త మహాశయుడు చెప్పే అబద్ధాలతోనే వేలాది కథలు పూర్తి చేసుకుని ఎంచక్కా ఆస్థాయిలోనే పేరు తెచ్చుకోవచ్చు. ఏవంటారు?"

ఆవిడ ఇంత చెప్పిన తర్వాత ఇంకా ఏమంటాను?

నేను ఏమీ అనుకుండానే ఆవిడే అన్నారు -

"మచ్చుకి ఏదో ఒక కథ శ్రీవారికి అంకితమిచ్చి రుణం తీర్చుకోడం వరకు మంచిదేగాని - ప్రత్యేకించి శ్రీవారికే ఎందుకు అంకితమివ్వవలసి వచ్చిందో చెప్పకూడదు. తొందరపడి చెబితే మునుముందు కథా వస్తువులు దొరక్కుండాపోతాయి!"

అంతేగదా మరి? ◆

రుక్మిణి

"హలో కలెక్టరాఫీసా... నేను పచ్చబాబును.. మొన్న ఫైళ్ళన్నీ క్లియర్ చేసి పట్టుకు రమ్మన్నానా... ఏం తిక్కగా వుందా. ఎక్కువగా మాట్లాడుతున్నావ్... బుద్ధిగా పని చేసుకుపోవాలని తెలవదా... ఇట్లా అయితే మన విజన్ 2020 సాధించేది ఎట్లా... 'స్వర్ణాంధ్ర' మన లక్ష్యం గదా..."

మాయా... మాయా... ఫలితం

అవతల నుండి కిసకిసమని నవ్వు వినిపించడంతో బాటు ఫోను కూడా కట్టయింది. పచ్చబాబు ఒళ్ళు మండిపోయింది.

"ఒరే బామ్మర్దీ సోమయ్యా" అని పొలికేక పెట్టాడు. వాడు పరుగు పరుగున వచ్చి వినయంగా నిలబడ్డాడు.

"సోమయ్యా కారు సిద్ధం చేయి - పోలీసాఫీసుకు పోయి రావాలి. మొన్నటి బాంబుల కేసును నేను స్వయంగా పరిశీలించాలని తెలియజేసుకుంటున్నాను."

సోమయ్య బావగారి వంక బహుజాలిగా చూశాడు.

"అన్నట్లు ఇంజనీర్లందర్నీ సమావేశానికి రమ్మను. వాళ్ళకెవరికీ పనిమీద శ్రద్ధ లేదు. వీళ్ళకు మైండ్‌సెట్ చేయాలి. అందుకే అమెరికా నుండి ఉద్యోగస్తుల మైండ్‌సెట్ మార్చడానికీ - రాజస్థాన్ నుండి యోగాపాఠాలు నేర్పడానికీ అన్ని ఏర్పాట్లు చేయించు" పచ్చబాబు హూంకరించాడు.

సోమయ్య ధైర్యం చేసి స్టూలు లాక్కుని ఎదురుగా కూర్చున్నాడు. "బావా... నువ్వింకా అధికారంలో వున్నాననే భ్రమలో వున్నావు. అది భ్రమో, అహంకారమో తెలవడం లేదు. నీ మాయా లోకాన్ని నువ్వే సృష్టించుకుని నువ్వే మురిసిపోతున్నావు. చాలా కాలం ప్రజల్ని భ్రమల్లో ముంచీ, ముంచీ చివరికి నువ్వే భ్రమల్లో మునిగిపోయావు."

ఈ హితబోధతో పచ్చబాబు కాస్తంత తెప్పరిల్లాడు. పైకప్పుకేసి దీర్ఘంగా - సాలోచనగా చూసి తలగోకుతున్నాడు.

"సరేగాని బామ్మర్దీ... ప్రజలు మనల్ని 'ఛీ' కొట్టడానికి కారణాలేమిటంటావ్?"

"తమకు అక్కరలేని పనిని ఎవడూ చేసుకోడు. ఇదీ అంతే - టోటల్‌గా ప్రజలకు పనికిరాని పనులు చేస్తూ అదే 'అభివృద్ధి' అంటే ఎవడు పట్టించుకుంటాడు" మొదట్లో నీ మాయలో పడి తమ బతుకులేవో బాగుపడిపోతాయని కొంతకాలం సహించారు. పోనుపోను ఈ పటాటోప ప్రచారం, కొద్దిమంది నీ అనుచరులు రాత్రికి రాత్రే కోటీశ్వరులైపోతుంటే మిగతా జనం నిజాన్ని గ్రహించారు"

"మరి - జన్మభూమీ - ఇంకుడుగుంతలు - కాంటూరు కందకాలు-గ్యాసు బండలు- వేలపథకాలు - పచ్చదనం... మరివాటి మాటేమిటి వాటివల్ల జనాలకు మేలు జరగలేదా?" మటమటలాడుతూ పచ్చబాబు ప్రశ్నించాడు - సోమయ్య జాలిగా నవ్వాడు.

"బావా ఇవన్నీ మనిషికి రంగురంగుల బనీను గుడ్డల్లాంటివి - అయితే మరి దాని మీద చొక్కాలేదు. కింద ఫ్యాంటులేదు - ఎంతకాలమని జనం అట్లా రంగుబనీన్లతో నగ్నంగా తిరుగుతారు. అంటే వేలకోట్ల రూపాయలతో ప్రజలకు పనికివచ్చే ఒక ప్రాజెక్టుగానీ ఒక ఫ్యాక్టరీ గానీ కట్టించామా? పైగా వీడియో కాన్ఫరెన్సులు... ఇరవై నాలుగు గంటలూ జిల్లా అధికారులతో జిల్లాల వారీగా ఉపన్యాసాలకు తగులుకుని ఒక పనికిరాని టెక్నికల్ మాయను తయారు చేస్తివా?

పచ్చబాబు నిట్టూర్చాడు.

"మనం చేసినన్ని వాగ్దానాలు ఎవరూ చేయలేదు. ఫ్లైఓవర్లు - వెడల్పాటి సిమెంటు రోడ్లను ప్రజలు కొరుక్కుతిని బ్రతకరని గమనించలేకపోతిమి. ఈ బిల్డింగులేందో... పటాటోపం ఏంటో... హెలికాప్టరులో లక్షలు ఖర్చు చేసి తిరిగి ఏం సాధించినట్లు...

"కానిరా బామ్మర్దీ... మనం చివరికి ఇంత చిన్న కొంపలోకి వచ్చి పడ్డాం. మన రాజభోగం... ఫారిన్ డెలిగేట్స్... కన్సల్టెంట్లూ... పర్యటనలు...

"భ్రమ" ప్రజలకు దూరమైన ప్రభువులకు పట్టే గతి గింతేగానీ.. జర అటుచూడుబావా...

పచ్చబాబు కిటికిలో నుండి తొంగిచూశాడు. లారీల కొద్దీ వీడియో కాన్ఫరెన్స్ యంత్రాలు... నెట్‌వర్క్ సరంజామా తరలిస్తున్నారు.

"అరె.. అవన్నీ ఎక్కడికిరా..." చెవట్లు తుడుచుకుంటూ కంగారుగా అన్నాడు.

"పాత ఇనుప సామాన్ల దుకాణంలోకి... పనికిరాని వాటిని వదిలించుకోవాలిగా.. పచ్చబాబు ఢామ్మని మూర్ఛపోయాడు.

◆

మొటిమలు - యుక్త వయస్సులోవున్న ఆడ, మగవారిలో సాధారణంగా శరీర ధర్మాల్లో భాగంగా వస్తాయి. అయితే జపాన్ వంటి దేశాల్లో ఇవి తక్కువ. చెమట గ్రంథులు దీర్ఘకాలిక వాపును మొటిమలు అంటారు.

డా॥ నాగినేని భాస్కరరావు

మొటిమలు

కొన్ని కారణాలు :

1) ఆండ్రోజన్స్ : యుక్తవయస్సులో ఆండ్రోజన్స్ ఉత్పత్తి విపరీతంగా పెరిగిపోవడం వల్ల చెమట గ్రంథులు ఎక్కువగా వృద్ధి చెందుతాయి.

2) వంశపారంపర్యత : చెమట గ్రంథుల అధికమైన చర్యలు - బహుశా ఆండ్రోజన్స్ ప్రభావానికి చివరి అవయవాల ప్రతిచర్యగా వుండవచ్చు. దీనిని నియంత్రించవచ్చు.

3) ఫోలిక్యులార్ కెరాటినైజేషన్ : అసాధారణంగా వెంట్రుకల కుదుళ్ళు గట్టిపడటం వల్ల మొటిమలు వస్తాయి.

4) ప్రొపియోని బ్యాక్టీరియన్ మొటిమలు : ఈ బాక్టీరియా ఎక్కువగా చర్మంపై ఉండటం వల్ల మొటిమలు వస్తాయి.

కౌమార దశలోనూ, యుక్త వయస్సులో వున్న వారికి మొటిమలు వస్తాయి. ఒక్కోసారి మధ్య వయస్సు వచ్చే వరకూ ఉంటాయి. లేదా మధ్య వయస్సులో ప్రారంభం అవుతాయి. స్త్రీల కన్నా మగవారిలో ఎక్కువగా వస్తాయి. లేక నూనె సంబంధమైన పదార్థాలు తగిలినచో మొటిమలు ఎక్కువవుతాయి. ఈ మొటిమల్ని తీవ్రతను బట్టి ఐదు గ్రేడులుగా విభజించవచ్చు.

గ్రేడు ఒకటి : వాపు, ఎరుపులోని మొటిమలు - చర్మంపై 1-2 మి.మీ. వ్యాసంతో మధ్యలో తెల్లబిందువు - ఆ వెంట్రుక కుదురు ద్వారంగా మొటిమల ప్రాథమిక దశ, కొన్ని ద్వారములలో నల్లని పదార్థం వుంటుంది. ఈ మొటిమల్ని వత్తితే తెల్లని లేక నల్లని పదార్థం వస్తుంది.

గ్రేడు రెండు : 2-4 మి.మీ. వ్యాసంతో అనేక ఎర్రని, శంఖు ఆకారంలో వున్న మొటిమలు పైన చీములు పట్టి వుంటాయి.



గ్రేడు మూడు : 5 మి.మీ. కన్నా ఎక్కువ వ్యాసంతో ఎర్రని గడ్డలతో మొటిమలు. పెద్ద, లోవల చీముతో కూడా మొటిమలుంటాయి.

గ్రేడు నాలుగు : చర్మం రంగుతో చర్మంపైకి తేలిన గడ్డలతో మొటిమలు. ఇవి చాలా నొప్పిగా వుంటాయి. క్రమేణా గడ్డలు పెరిగి నొప్పి లేనివిగా మారి నీరు చేరిన సంచుల్లా మారి చివరకు పగిలిపోయి మానిపోతాయి. మచ్చలు మిగులుతాయి.

గ్రేడు అయిదు : ఈ దశలో మచ్చ పెరిగిపోతుంది. అంతేకాక లోపలి నుండి రంధ్రం పడి బయటకు ఒక మార్గం ఏర్పడటంతో రసిని లేక చీమును పంపుతుంది.

మొటిమలు - ముఖంలో నుదురు, బుగ్గలు, ముక్కు, గడ్డంపైన వస్తాయి. అంతేకాక వీపుపై భాగం, ఛాతీ, భుజాలు, చేతులపైన కూడా మొటిమలు వస్తాయి.

విషపరిణామాలు :

1) యుక్త వయస్సు వచ్చిన వారిలో మొటిమలు చికాకు కలిగిస్తాయి. పనితీరును దెబ్బతీస్తాయి.

2) చీమువట్టిన మొటిమలు ముదిరిపోయి ఎప్పుడూ రసికారుతున్నట్లయితే పని చేయడం కష్టమవుతుంది.

3) మొటిమల వల్ల మచ్చలు పడి అందవికారాన్ని కలిగిస్తాయి. మానసికంగా కొందరిని కృంగదీస్తాయి.

4) అరుదుగా మొటిమలు కాన్సరుకు దారితీస్తాయి.

5) మొటిమలు వాచి, చీము పట్టిన దశలో జ్వరం, ఒళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు వస్తాయి.

నివారణ - జాగ్రత్తలు :

1) రోజుకు నాలుగు సార్లు నీళ్ళతో, సబ్బుతో ముఖం కడుక్కోవాలి. దీనివల్ల ముఖంలో జిడ్డు తొలగిపోయి, బ్యాక్టీరియాను తగ్గించి మొటిమలను మెత్తపరచి మొటిమ ద్వారం తెరచుకునేటట్లు చేస్తుంది. ప్రత్యేకమైన సబ్బులు బాక్టీరియాను నశింప చేసే గుణాన్ని, శుభ్రపరచే గుణాన్ని కలిగి వుంటాయి.

2) ఉష్ణవాతావరణాన్ని, తేమ ఎక్కువవుండే వాతావరణాన్ని నియంత్రించుకోవాలి.

3) జిడ్డు లేక నూనె పదార్థాల వాడకం తగ్గించుకోవాలి.

4) స్త్రీలలో హైపర్‌యాన్డ్రోజెనిజమ్‌ను నియంత్రించాలి.

చికిత్స : పై పూత మందులు రాయాలి. ఉదా : 0.025%, 0.05%, రెటినోయిక్ ఆమ్లం, 1% క్లిండామైసిన్, 2% ఎరిత్రోమైసిన్, 2.5-5% బెంజైల్ పెరాక్సైడ్ పూతమందు. గ్రేడు-2 రోగులకు టెట్రాసైక్లిన్ గొట్టాలు 250 మి.గ్రా. ఆరు గంటలకు ఒక గొట్టం చొప్పున రోజుకు 4 నెలల పాటు వాడాలి. తీవ్రతను బట్టి 6 నెలలు కూడా వాడాలి. గ్రేడు ఒకటి రోగులకు పూతమందుతో పాటు విటమిన్-ఎ రోజుకు 1 లక్ష యూనిట్లు చొప్పున 2-3 నెలలు ఇవ్వాలి. గ్రేడు 4-5 మగ రోగులకు ఐసోట్రెటియోనిన్ రోజుకు 20-40 మి.గ్రా. చొప్పున 4-8 వారాల పాటు వాడాలి. గ్రేడు 3-4 ఆడ రోగులకు సెబోస్టాటిక్ సిప్రోట్రెరోన్-2 మి.గ్రా. సైక్లికల్ ఈస్ట్రోజన్‌తో ఇవ్వాలి. ◆

వేలం

(9వ పేజీ తరువాయి)

రావడమేగా! టిటిసీకి నాలుగైదువేలు ఖర్చయినయ్యేమొ! మేం పెద్ద వేలు వేలు ఖర్చు పెట్టినట్లు మాట్లాడుతున్నారే!" అన్నాడు పెద్ద మరిది.

చిన్న మరిదీ అదేమాట!

పోనీ అత్తమామలు తమ వైపు మాట్లాడారా అంటే అదేమీ కాదు. వాళ్ళూ వాళ్ళ వైపే!

"నువ్వు విరగబడి చేసిందేందిరా? పనులన్నీ టాక్టర్లే చేస్తండే! వాళ్ళకి బాడుగల ఇయ్యక తప్పుతుందా? ఎద్దుల్ని పెట్టి ఎగసాయం చేసి రేయింబొగుళ్ళు కష్టపడినట్టు మాట్లాడుతన్నావేమిరా?" అన్నాడు మామ.

"ఉమ్మడిగా పెత్తనం చేస్తా నువ్వు చాలా డబ్బు వేనకేసుకున్నావంటున్నారు వూళ్ళో జనం. దానికేం చెబుతావు?" అన్నాడు చిన్నమరిది.

చివరికి తమకి అపనిందలు, తిట్లు, శాపనార్థాలే మిగిలాయి. వాళ్ళని అనుకుని లాభం లేదు. తప్పంతా ఈయన్దే! మొదట్నించీ తను వేరుగా వుందామని అంటూనే వుంది.

తమ్ముళ్ళకి పెళ్ళిళ్ళు కాకుండా వాళ్ళని వదిలేసి వస్తే లోకులు ఆక్షేపిస్తారని చెపుతూ వచ్చాడు.

తన మాట ఎప్పుడూ వినలేదు. మొదట్నించీ ఒక మాట కాకపోతే ఒక మాట వినివున్నా ఇంత పరిస్థితి వచ్చి వుండేది కాదు.

ఆడబిడ్డకి పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. ఆ పెళ్ళికి తోడికోడళ్ళు ఇద్దరూ నగలు దిగేసుకుని వచ్చి వయ్యారాలు వలకపోస్తుంటే తను బోసిమెడతో, బోసి చేతులతో దేభ్యం ముఖం వేసుకుని వుండాలి. వచ్చిన బంధువులు తనని దాసిది అనుకోవాలి.

తనకి లేకపోతేపోనీ, బిడ్డలు ఇద్దరికీ కనీసం చెవులకి కూడా లేవు. పెళ్ళిలో తన బిడ్డలు ఇద్దరూ దరిద్రపు ముఖాలు వేసుకుని వుంటే బంధువులు నవ్వుకోవాలి.

ఆయన సంపాదించి ఇచ్చిన బంగారం అయితే పోతే పోనీలే, ఆయన సంపాదించి ఇచ్చాడూ, ఆయనే కాజేసుకున్నాడు అనుకోవచ్చు.

అది తనకి పుట్టింటి వాళ్ళు పెట్టింది.

వాళ్ళు వున్న వాళ్ళు కాదు. కూలీనాలీ చేసుకుని, కష్టపడీ, తినీతినకా, రూపాయి రూపాయి కూడబెట్టి పెళ్ళికి అవసరం అవుతుందని తన కోసం కొనిపెట్టిన బంగారం అది. ఈ బంగారం కోసం అమ్మా నాన్నలు ఎంత కష్టపడ్డారో, ఎంత చాకిరీ చేశారో, ఎన్ని రోజులు రెక్కలు ముక్కలు చేసుకుని చెమటలు చిందించారో ఆ భగవంతుడికే తెలుసు.

విషయం తలుచుకుంటేనే దుఃఖం ఆగడం లేదు సుగుణకి. ఈ బంగారం కారణంగానే అన్న కూడా తనకి పగ అయిపోయాడు.

అన్న, పాపం చాలా ఇబ్బందుల్లో వుండి డబ్బు అవసరం పడి ఇక్కడికి వచ్చాడు.

"పిల్లవాడి చదువుకి డబ్బు అవసరం పడింది బావా! వడ్డీ ఇస్తాను. డబ్బు సర్దుబాటు చేయి బావా!" అని ఈయనని అడిగాడు.

"మా దగ్గిర డబ్బు ఎక్కడుందోయ్? మాదీ అప్పుల సంసారం అయిపోయింది. ఇయ్యాల పొలానికి పెట్టుబడికి మాకే డబ్బు అవసరం!" అన్నాడు ఈయన.

తరువాత కొద్దిసేపటికి ఈయన బైటకి వెళ్ళాడు. అప్పుడు అన్న తనని అడిగాడు.

"పిల్లవాడి చదువు మజ్జెలో ఆగిపోయిద్దమ్మా సుగుణా! పిల్లోడు చదువులో బాగా చురుగ్గా పోతన్నాడు. అసుంటోడ్ని మజ్జెలో ఎట్ట ఆపుతాం? నీ బంగారం ఇయ్యమ్మా! బేంకిలో పెట్టుకుని డబ్బు తెచ్చుకుని పిల్లోడికి పంపిస్తాను. చాలా బాకీలు అయ్యాను. రెండు నెలల్లో పొలం అమ్మి నీ వస్తువులు నీకు పువ్వుల్లో పెట్టి తెచ్చిస్తానమ్మా! ఈ మేలు చేసావంటే మమ్మల్ని కష్టకాలంలో ఆదుకున్నదానివవుతావు. ఊళ్ళో పుట్టుదల కాకనే ఇంతదూరం వచ్చి అడుగుతున్నాను" అని చాలా సేపు బతిమలాడాడు. కళ్ళనీళ్ళు కూడా పెట్టుకున్నాడు.

తన మనసు కరగలేదు. బాగా అప్పుల్లో వున్నాడని ఆయన మాటల బట్టి తెలుస్తూనే వుంది.

ఏది పోయి ఎలా వస్తుందో? డబ్బు పొర్లక రేపు ఇవ్వలేకపోతే! తనకి ఇదే ఆధారం! అంత్యనిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలు! ఇబ్బందులు లేని వాళ్ళు ఎవరు?

"మా బంగారం అంతా బేంకిలో ఉందన్నా!" తడబడుతూ అన్నది తను.

"ఎందుకమ్మా కాని మాటలు చెపుతావు? పేరంటానికి పోయి వచ్చి రాత్రి నా కళ్ళ ముందే గదమ్మా అవి తీసి పెట్టెలో పెట్టుకుంది? అబద్ధం ఎందుకు, ఇవ్వడం కుదరదు అంటే ఒక్కమాటతో పోయే!"

నేల చూపులు చూడటం మినహా తను మరో మాట మాట్లాడలేకపోయింది.

"సరే కానీ... వాడికి ఎట్టరాసి పెట్టి వుందో! నే వెళ్తా" అని లేచి బయల్దేరాడు. భోజనం చేసే వేళ అది.

"అన్నం తిని పో అన్నా" అని తను నాలుగు సార్లు అడిగింది.

"అన్నం ఎందుకులేమ్మా? కడుపు నిండిపోయింది, చాల్లే! రోజులు ఎల్లకాలం ఇట్నే వుంటయ్యా!" అంటూ వెళ్ళిపోయాడు.

అప్పటినించీ అన్న తన గడప తొక్కలేదు.

పుట్టింటికి నాలుగయిదుసార్లు తను వెళ్ళినా కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకరించలేదు.

ఈ బంగారం కారణంగానే తోడబుట్టిన వాడు తనకి పగయ్యాడు.

ఆయనకి కొడుకు, తనకి కూతురు! మేనల్లుడు ఇప్పుడు మంచి చదువు చదువుకుంటున్నాడు. తన కూతుర్ని చేసుకొమ్మని రేపు తను ఏ ముఖం పెట్టుకుని అడుగుతుంది? ఒక వేళ అడిగినా "చేసింది చాల్లేమ్మా! ఆపదలో బాగానే ఆదుకున్నారు!" అని ముఖాన్నే అనరూ?

అన్న అడిగిన వెంటనే బంగారం ఇచ్చి వుంటే ఇప్పుడు అది తనకి నిలబడి వుండేదేమో! మాయదారి పొలం. ఈ పొలం కారణంగానే తాము ఇంతగా చితికిపోవాల్సి వచ్చింది.

మొదటి ఏడాది రెండు ఎకరాలు మిరపతోట వేశారు. ఆ మిరపకి అవసరమైన పెట్టుబడికోసమే తన బంగారం బ్యాంకులోనికి వెళ్ళింది.

అప్పుడు ఇరగా మరగా చాకిరీ చేసి మిరపని విరగపండించారు. చాలా వస్తుందని ఆశించారు. కల్లం మీద కాయలు మరుసటి రోజు అమ్మాలనుకుంటుండగా వాన మొదలైంది. ఎడతెరిపిలేని వాన. వానకి కాయ తడిచి పనికి రాకుండా పోయింది.

70, 80 వేలు వస్తాయనుకున్న కాయల మీద 7 వేలు వచ్చాయి.

తరువాత ఏడాది పత్తి వేశారు. వానల్లేక, పురుగు పడీ అదీ సరిగా పండక దండగవచ్చింది. మూడో ఏడు మళ్ళీ మిరప వేశారు. అంతకుముందు ఏడాది 45 వందల మీద కొనుగోలు చేసిన మిరపకాయలు, ఆ ఏడాది 20 వందలకి వచ్చాయి. ధరలోనే 50 వేలు పోయాయి.

ఇలాగ ఒక ఏడూ, రెండేళ్ళూ కాదు. ఐదేళ్ళ నించీ దెబ్బ మీద దెబ్బ. గింగిరాలు తిరిగే దెబ్బలు తగిలాయి.

కాపురం చితికిపోయింది. అప్పుల సంసారం అయిపోయింది.

మరో ఆదాయంలేదు. మరోపని చేతకాదు. మరో దారి లేదు.

పొలాన్ని నమ్ముకున్నారు. చివరికి ఆ పొలమే నట్టేట్లో ముంచింది.

తెచ్చిన అప్పుకి వడ్డీలు పెరిగిపోయాయి.

నాలుగు నెలల నాడు బ్యాంకు వాళ్ళు బంగారం వేలం వేస్తామని మొదటి నోటీసు ఇచ్చారు. వెళ్ళి అడిగితే కొంత డబ్బు కడితే వేలం వేయకుండా నిలుపుదల చేస్తామని చెప్పారు.

అప్పట్నించీ తను పోరు పెడుతూనే వుంది. అప్పోసప్పో ఎక్కడో చోట కొంతడబ్బు తెచ్చికడితే బంగారం నిలిచి వుండేది. ఇంత వూళ్ళో నాలుగు నెలల నించీ నాలుగైదు వేలు అప్పు పుట్టదా!

తన అమ్మా నాయనల కష్టం, తన బంగారం ఇవ్వాళ పరాయి వాళ్ళ చేతుల్లోనికీ, వాళ్ళ మెడల్లోనికీ పోబోతోంది.

ఏడుపు ఆగలేదు సుగుణకి.

మధ్యాహ్నానికి దిగాడు భర్త వెంకటేశ్వర్లు. సుగుణ అతని వైపు నిరసనగా తలతిప్పి కూడా చూడలేదు.

వెంకటేశ్వర్లుకీ బాగా బాధగానే వుంది. ఏం చేయాలో తోచక, తన బాధని మర్చిపోవడానికీ, భార్య పడే బాధని చూడాల్సి వస్తుందనీ తనూ దిగులుగానే పొద్దున్నే పొలంవైపు వెళ్ళిపోయాడు.

వచ్చి, బయట తొట్టి దగ్గిర కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్ళాడు.

"అన్నం పెడుదువు రావే!" సుగుణ కదల్లేదు.

"నిన్నే... అన్నం పెడుదువురా!"

"దేనికీ గతిలేకపోయినా తిండికి మాత్రం లోటు లేదు. కూడు ఎవుడు వండాడు?"

"ఎందుకు వండలా?" "ఎందుకు వండాలి?"

వెంకటేశ్వర్లుకి ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు. కొద్దిసేపటికి తేరుకుని అన్నాడు.

"అదేం మాటే?"

"మరేంది? ఇయ్యాల బంగారం వేలం వేస్తారని తెలియదూ? పొద్దున్నే నిద్రలేచి ఎక్కడికి పోయినట్టూ?"

"చేనుకెల్లిపోయానే!"

"ఏం అగోరించను? ఎవురోకరి కాళ్ళో గడ్డాలో పట్టుకుని ఐదారు వేలయినా చూసి బేంకిలో కడితే బంగారం వేలం వేయడాన్ని ఆపరూ ? నాకూ, నా బిడ్డలకీ వున్నది అదే ఆధారం! నువ్వేమీ సంపాయించి మమ్మల్ని ఉద్ధరిస్తావని ఆశల్లేవు. మా సొమ్ము అయినా మాకు దక్కనియ్యి!"

ఇక మాటామాటా పెరిగింది. ఘర్షణ పెద్దదైంది.

ఆ రోజు మరుసటి రోజూ పొయ్యి ముట్టించలేదు. సుగుణ దుప్పటి ముసుగు పెట్టింది. మంచం దిగలేదు.

పిల్లలూ దిగులు పడిపోయారు.

మూడోరోజు ఉదయం ఇరుగమ్మా పొరుగమ్మా చేరి అన్నం వండి సుగుణకీ, పిల్లలకీ, వెంకటేశ్వర్లుకీ పెట్టారు.

పదిరోజుల తర్వాత బ్యాంక్‌నించి కాగితం వచ్చింది.

బంగారం ఫలానా ధరకి వేలం వేసినట్లూ, అసలూ+వడ్డీ+నోటీసుకి 90 రూపాయల లెక్కన మూడు నోటీసులకీ 270+పేపర్ ప్రకటనకి 450 చెల్లుపెట్టుకుని మిగతా డబ్బు వెంకటేశ్వర్లు సేవింగ్స్ ఖాతాలో జమ చేసినట్లు నోటీసులో తెలియజేశారు.

అది చదువుకున్న సుగుణ దానిని చింపి మండుతున్న పొయ్యిలో వేసింది ఉబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ. ◆

బతుకంటే కదలికే!



రెక్కల సంతకాలు
రచన : డా॥ సి.నారాయణరెడ్డి
వెల : రు. 100, **పేజీలు** : 111
సోల్‌డిస్ట్రిబ్యూటర్స్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలలో; వరణ్య క్రియేషన్స్, ఫ్లాట్ నెం. 48, ఫిలింనగర్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్

అధికార పీఠాలు, జ్ఞానపీఠాలు కూడా అధిరోహించిన కవి సి.నారాయణరెడ్డి. నిరంతరాయంగా రాస్తూనే వుంటారు. రోజూ ఒకటికి మించిన సాహిత్యసభల్లో పాల్గొన్నట్టే వారానికి వారం పత్రికల్లో ఆయన కవితలు, గజళ్లు వెలువడుతూనే వుంటాయి. ఇంత సుదీర్ఘకాలం, ఇంత పరిమాణంలో కవిత్వం రాస్తూనే వున్న వారు తక్కువనే చెప్పాలి. కాకుంటే ఆయన కవితల పరిధి చాలా విశాలమైంది. ఎంత విశాలమైందంటే వాటిలో దైనందిన జీవిత సమస్యలు, రాజకీయ, సామాజికాంశాలు చాలా నామమాత్రంగానే దర్శనమిస్తుంటాయి. చాలా స్థూలమైన దృష్టిలో మానవుడు ఆయన కవితలకు లక్ష్యంగా వుంటాడు. చాలా సార్లు ప్రకృతితో పోలుస్తూ మానవుడి గొప్ప లక్షణాలను లేదా హీనత్వాన్ని విమర్శిస్తూంటారు.

నేను ఎన్నుకున్న దారి తిరిగిరానిది
అమ్ములా దూసుకుపోతున్న నా అడుగు మొన
తిరుగులేనిది

....

ఎన్ని ప్రలోభాల వర్ణ చిత్రాలు ఈల వేస్తున్నా
తన వొళ్లోకి వాలిపొమ్మని
తియ్యని పిలుపుల సుమపాశాలతో
లాగేస్తున్నా
తిరిగి చూడను.
నా ఎదుట సుఖాల ముఖమల్ తివాసీలు
పరుచుకుని వున్నాయని కాదు
సురభిళ స్వప్న ద్వారాలు తెరుచుకుని
వున్నాయనికాదు...

అంటూ ప్రారంభమయ్యే ఈ కావ్యం మొదటి కవితలో 'నన్ను నేనే ప్రయోగించుకున్న మానవాస్త్రాన్ని నేను' అంటూ ముగుస్తుంది. ఒక విధంగా ఈ మొదటి కవిత మొత్తం సంపుటి స్వభావాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పొచ్చు. మనిషి చైతన్యవంతుడుగా వుండాలే గాని జడత్వంలో కూరుకుపోకూడదని ఈ కవితల్లో సినారె పదే పదే చెబుతారు. 'బతుకంటే కదలికే' కవితలో "ఉన్నట్టే ఉండాలంటే ఎలా? కాసేపు నిద్రపోవే ఊపిరీ అంటే చచ్చేట్లు నవ్వుకోదూ" అంటూ ప్రశ్నిస్తారు. స్పందించే "విశ్వనాడికి విశ్రాంతి లేదు, పురోగమించే జన చేతన విశ్రాంతి కోరుకోదు" అంటూ ముగిస్తారు.

చలనం, చైతన్యం ఈ కావ్యానికి ప్రధాన వస్తువులు. స్తబ్దంగా వుండకూడదనేదే సందేశం. మరి చలనం లేని జీవితం శ్వాస కోల్పోని సమాధి అని వర్ణిస్తాడు. భ్రమణంలోని ఉత్తేజం విశ్రమణంలో ఉండదని చెబుతారు. ఇందుకోసం సినారె చాలా ఉదాహరణలు ఇస్తారు. చెట్టు, సముద్రం, ఆకాశం, మేఘం, గాలి, బాణం ఇలా. ఈ కవితల్లో దాదాపు ఇవే ఉపమానాలు పునరావృత మవుతుంటాయి. కొన్ని సహజంగా, అందంగా అమరితే మరికొన్ని ఉపన్యాస వాక్యాల్లా తేలిపోతుంటాయి కూడా.

గుజరాత్ మారణహోమం తర్వాత రాసిన ఒక కవితలో 'మతదుర్మతులు విరజిమ్మే విషమయ పూత్కారాలలో ఆకుపచ్చని వాతావరణం కమిలి పోయిందని' ఒక చోట మాత్రం ప్రస్తావన వుంది. అయితే దాని వెన్నంటి కుటిల రాజకీయాలు వగైరాల కొనసాగింపుతో దాని తీవ్రత తగ్గిపోతుంది.

అక్షరం గురించి కూడా ఈ సంపుటిలో చాలా ప్రస్తావనలున్నాయి. అక్షరం పాచిక కాదు ఆడుకోవడానికి, అది వృక్షాన్ని ప్రసవించే విత్తనం' అంటాడు. చించిపారేసిన కాగితంలోని అక్షరాలన్నీ గాలికి కొట్టుకుపోవని, కొన్ని గుండె బలంతో నిలదొక్కుకుంటాయని ప్రకటిస్తారు. గాలి యధేచ్ఛగా లోపలికి వెళ్లి తన కొనవేళ్లతో పుస్తకాల పుటలను తిరగేసి జ్ఞాన కణాలను తీసుకెళుతుంది అని వర్ణిస్తాడు. నిద్రపోని కలంతో రచనా వ్యాసంగాన్ని భావుకతను వర్ణిస్తారు.

పారం
గురువే చెప్పక్కరలేదు
నడకలో ఎదురు తగిలిన ప్రతి రాయీ చెబుతుంది

వంటి చరణాలు పదిలంగా జ్ఞాపకముండి పోతాయి. శూన్యారణ్యాలు మూగ మూల్గులు, ఆశయాస్త్రం, శ్రవణ సహనం, నిశ్శబ్ద ఝుంకారాలు, మానసిక శవావస్థ వంటి పదబంధాలు అర్థవంతంగా అమరుతాయి. కాని వంతెనల కున్న సామరస్యంతో మనుషులు చేతులు కలపలేరా అంటూ రాసినప్పుడు వట్టి ఉపన్యాస వాక్యాల్లా వినిపిస్తాయి. మరీ ముఖ్యంగా గజళ్లలో చివరి వాక్యాలు– సినారె అంటూ తనను తాను సంబోధించుకుని చెప్పినవి పదవులెన్ని వచ్చినా పాటే ప్రాణం, కాగితాలతో విసుగెత్తితే సృష్టి పుటలపైనే రాసెయ్యి జీవకావ్యం వంటివి ఆత్మగతంలా అగుపిస్తాయి. మొత్తంపైన పరిణిత కవి కనక బిగువైన కవితలున్నాయి. కాని అమూర్తమైన అస్పష్ట సూక్తుల్లా సాగడం వల్ల సినారె తన కవితల్లో మరీ మరీ చెప్పిన జీవం లోపించినట్టు అనిపిస్తుంది.

-పీపీ

స్వీకారం

మూడుత్తరాలు
రచన : బద్ది నాగేశ్వరరావు;
వెల : రు. 15; **ప్రతులకు** : బద్ది నాగేశ్వరరావు, డోర్ నెం. 13-9-5, గోలిస్ట్రీట్, దేమునిగుమ్మం, అనకాపల్లి - 531 001; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును

ఘోష
రచన : తరిమెల అమరనాథరెడ్డి;
వెల : రు. 30; **ప్రతులకు** : తరిమెల అమరనాథరెడ్డి, కన్వీనర్, మానవత రక్తదాతల సంస్థ, 13-2-202, రామచంద్రనగర్, అనంతపురం



మెరీనా
రచన : డాక్టర్ మణిగోపాల్;
వెల : రు. 50;
ప్రతులకు : డాక్టర్ మణిగోపాల్, ఫ్లాట్ నెం. 203, షా రెసిడెన్సీ దత్తాత్రేయ కాలనీ, అసిఫ్‌నగర్, హైదరాబాద్;
అన్ని విశాలాంధ్ర బుక్‌స్టాల్స్‌లో

మహాబలిపురం

శేషు

క్రీస్తుశకం ఏడవ శతాబ్దంలో తమిళనాడును ఏలిన పల్లవ రాజుల కళాభిరుచికి, వారి శిల్పకళా చాతుర్యానికి బంగాళాఖాతం తీరాన గల మహాబలిపురం అద్దం పడుతుంది. పల్లవ వంశానికి చెందిన మహేంద్రవర్మ ఈ రేవు పట్టణాన్ని నిర్మించాడు. రాతితో చెక్కిన శిల్పాలు, గుహాలయాలు, రాళ్లపై పురాణాలు చెక్కిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. రథాకారంలో ఉండే ఐదు ఆలయాలు పంచపాండవుల పేరుతో నిర్మించారు. ఈ రథాలు, వాటిపై చెక్కిన శిల్పాలు ఒక అద్భుత పురాణాలుగా చెప్పవచ్చు. ఈ ఐదింటిలో ఒకటి మాత్రం బౌద్ధ శిల్పాకృతులను కలిగి ఉంది. మిగిలినవన్నీ ద్రావిడ సంస్కృతికి అద్దం పడతాయి. సముద్రతీరాన గల ఈ ఆలయం పర్యాటకులకు ఎంతో ప్రశాంతతను ఇవ్వడమే గాకుండా పదమూడు వందల సంవత్సరాల నాటి ఆ రాతి ఆలయాలు ఆశ్చర్యానందాలను పంచుతాయి. సాధారణంగా ఒకే ఆలయంలో శివుడు, విష్ణువు విగ్రహాలు ఉండటం అరుదు. దక్షిణ భారతదేశంలోనే అరుదుగా ఇటువంటివి కనిపిస్తాయి. ఇక్కడ కూడా శివ, విష్ణువుల దేవతామూర్తులు పర్యాటకులను ఆకర్షిస్తాయి.

కాంచీపురం

పట్టుచీరల కాణాచిగా, కంచి కామాక్షి నిలయంగా పేరుపొందిన కాంచీపురం రెండు వందల సంవత్సరాల పాటు పల్లవుల రాజధానిగా వెలుగొందింది. చెన్నయి -బెంగుళూరు జాతీయ రహదారిపై చెన్నయి నగరానికి 70 కిలోమీటర్ల దూరాన గల ఈ పట్టణం ఆలయాల కేంద్రంగా కూడా ప్రసిద్ధి చెందింది. పల్లవుల కాలంలోనే ఇక్కడ పెద్దసంఖ్యలో ఆలయాలు వెలిశాయి. కంచి మగ్గాలపై తయారయ్యే పట్టుచీరలను దేశం నలుమూలల నుండి వచ్చి కొనుగోలు చేస్తారు. ఇక్కడి పట్టుచీరలకు విదేశాల్లో సైతం గిరాకీ ఉంది.



కంచికామాక్షి ఆలయం



కంచిపట్టు చీరలు

తంజావూరు

చెన్నయి నగరానికి 334 కిలోమీటర్ల దూరాన గల ఈ పట్టణం చరిత్రలో ప్రసిద్ధికెక్కింది. రాజ రాజ చోళుడి కాలం నుండి ఈ పట్టణం చోళుల రాజధానిగా ఉండేది. దేవాలయాల పట్టణంగా కూడా వాసికెక్కింది. రాజరాజ చోళుడు నిర్మించిన బృహదీశ్వర ఆలయం చోళుల కళాతృష్ణ తెలియచేస్తుంది. తంజావూరు పట్టణం హస్తకళా వస్తువులకు, దక్షిణభారత దేశంలోని సంగీత పరికరాలకు, పెయింటింగ్‌లకు నిలయం. ఇక్కడి హస్తకళా వస్తువులు, సంగీత పరికరాలు, అద్దకాలు ప్రపంచం నలుమూలలకు ఎగుమతి అవుతాయి. ◆

ఈ ఏడాది కూడా " నంది" కేశుడు ఎగిరి గంతులేయలేదు. కళాత్మకంగా ఓ రంకె వేసి ఊరుకున్నాడు. నందిని వీక్షించిన జడ్జీలు "ఏం చేస్తాం? ఉన్నదాంట్లోనే ఉత్తమం. ద్వితీయం అనుకున్నాం..." అంటున్నారు. నిజానికి న్యాయనిర్ణేతలూ చేయగల్గిందేమీలేదు. "నంది" ఉత్సవాలను నిర్వహించమన్న ప్రభుత్వం ఎట్లాగూ విధి నిర్వహణాత్మకంగా మాత్రమే చూడగలదు. ఎటొచ్చీ క్షేత్ర కార్యనిర్వాహకులైన నంది నాటకోత్సవాల డైరెక్టర్‌కూ, స్క్రూటినీ చేసిన వారికి మాత్రం పొగడ్తల పూలు, విమర్శల రాళ్లు తప్పవు.

"నంది" రంకె మాత్రమే వేశాడు

శంకర్

1999 సంవత్సరంలో మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి రోజు నుండి ఈ నంది నాటకోత్సవం మొదలైంది. ఈ ఏడాది 6వ నంది ఉత్సవం జూన్ 19 నుండి 26 వరకు 32 పద్య, సాంఘిక, నాటక, నాటికలు ప్రదర్శించింది. పది పద్యనాటకాల్లో ఎక్కువ భాగం ప్రేక్షకులు అనేకసార్లు చూసిన పాండవోద్యోగం, మోహినీ భస్మాసుర లాంటి రామాయణ, భారత కథా విశేషాలే. నారద సంసారం, ఆషాఢమేఘం, శ్రీఆండాళ్ కళ్యాణము, చిరుతొండనంబి లాంటివి కొద్దిపాటి విలక్షణంగా వున్నాయి. ఈ విభాగంలో బంగారు నంది బహుమతి పొందిన 'చిరుతొండనంబి' కూడా తెలుగు, తమిళ భక్త జనులకు తెలిసిన భక్త శిరియాళుడు, అతని తండ్రి చిరుతొండనంబిల కథాంశమే. పద్యనాటకమంటే తెలుగుపల్లెల్లోని నిరక్షరాస్యులు సైతం ఇట్టే పట్టేసి అట్టా రాగాన్నాలపించేంత ఇష్టత కల్గించాలి. అలాంటి రమ్యత, పద్యరాగ విశేషాలు ఈ పద్య నాటకం ప్రదర్శించింది. ముఖ్యంగా ఈ నాటకంలోని చిన్నారులు గండుకోయిలలాగా ఖంగుమంటూ పాడిన పద్యాలూ, తీసిన రాగాలు ప్రేక్షకుల్ని మెప్పించాయి. కథాంశం కూడా వైష్ణవాన్ని ఎదురొడ్డిన వీరశైవానికి చెందినది.

'చిరుతొండనంబి' పద్యనాటకంలోని దృశ్యం

'భక్తి-ముక్తి-మహత్యం' అనే అతిశయోక్తి అలంకారాన్ని మినహాయించుకుంటే ఈ కథా వస్తువు ఒకనాటి సామాజిక వాస్తవమే. భారీ సెట్టింగులు, మిరుమిట్లు గొలిపే లైటింగ్‌లతో టెక్నికల్‌గా కూడా ప్రేక్షకుల్ని ఆకర్షించింది. అయితే అదే సమయాన హైటెక్ మైక్‌లు విఫలమవడం పద్యాభిమానులకు ఆశనిపాతమయ్యింది. ఈ ఆటంకాన్ని కూడా అధిగమించి 'చిరుతొండనంబి' ప్రదర్శించిన శ్రీ మీరా కళాజ్యోత్స్న, విశాఖపట్నం బంగారు నంది సాధించింది. ద్వితీయ స్థానంలో 'వెండినంది'ని తోలుకెళ్ళిన కళా రైతు హైదరాబాద్‌లో వున్న యువకళావాహిని. ఆ టీమ్ ప్రదర్శించిన పద్యనాటకం 'రాణాప్రతాప్' అనే హిందూదేశభక్త చారిత్రకం. ఈ కథ చాలా మంది హిందూత్వవాద పరివారానికి ముస్లిం వ్యతిరేక హిందూ పూనకమయ చారిత్రకంగా ఎరిగినదే. దీన్ని కొన్ని పత్రికల్లో "దేశభక్తి ప్రదర్శించిన" అని పేర్కొన్నారు. కానీ ఆనాడు మన దేశం భారతదేశంగా ఏర్పడలేదు. చిన్న చిన్న రాజ్యాలలో ఒక రాజ్యమైన మేవాడ రాజ్యాధీశుడుగా ఉన్న రాణాప్రతాప్ ఒక రాజు. కాబట్టి రాజ్యభక్తుడంటే సరిపోతుంది. ఈ వివాదాన్ని వదిలేస్తే ఈ చారిత్రక నాటకంలో ప్రదర్శనా విలువలు, అభినయ విలువలున్నాయి. రాయలసీమ ఫ్యాక్షన్ విలన్‌గా చూడ్డానికి మనం అలవాటుపడ్డ జయప్రకాశరెడ్డి ఈ నాటకంలో అక్బర్‌గా బాగా నటించారు.

సమకాలీనతను మనం ఎక్కువగా నాటకరంగం నుంచి ఆశిస్తాం. సమకాలీనతను నిష్కర్షగా ప్రతిబింబించడం నిప్పుల మీద అభినయం, కత్తివారన నృత్యం లాంటిది. భలే సాహసోపేతమైనది. ఇలాంటి సాహసం ఉద్యమ నాటకరంగం చేయగలుగుతుంది. కానీ ఉద్యమ నాటకరంగం వద్ద పరిషత్ నాటకరంగమంతటి కళాత్మకత లేదు. పరిషత్ నాటకకారులకు ఉద్యమ నాటక కళాకారుల్లో ఉన్నంత నిబద్ధత లేదు. 10 నాటకాలు, 12 నాటికల్లో మన దేశానికి పునాది అయిన గ్రామీణ జీవన, వ్యావసాయిక నేపథ్యాన్ని ప్రతిబింబించినవి రెండు

సురభి బాబురావుకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్., కేంద్ర మంత్రి దాసరి

మూడో మాత్రమే. మిగిలినవి మధ్యతరగతి కుటుంబ జీవనపు బ్యాక్‌డ్రాప్ అలా వేసి... వండిన సమస్యలను కథావస్తువులుగా ఇలా వేశారు. అందుకే ఈ నంది నాటకాలు చూడ్డానికి వచ్చిన ఒక రైతు పి.సుబ్బారావు సాంఘిక నాటకాల్లో 'అంత ఓవరాక్షనెందుకు?' అన్నారు. కథాపరంగానా? నటనాపరంగానా? అని విడమర్చి చూస్తే కథల్లోనే అనవసర తీవ్రత వుండటం వల్లే నటనలోనూ వచ్చి చేరిందన్నారు. ఒక్క "ఆశల పల్లె..కి" (నాటిక) మాత్రమే గ్రామీణ వ్యవసాయక ప్రాధాన్యతను రంగస్థలమెక్కించింది. 'ఉన్నంతలో మంచి" అనే సూత్రం ప్రకారం ఉత్తమ నాటికగా బంగారు నంది 'ఆశల పల్లె...కే' వెళ్ళింది. అలాంటి తీర్పునిచ్చి జ్యూరీ తనపై సదభిప్రాయం కలిగించుకుంది.

కుటుంబ సంబంధాల్లో ఒకప్పటి సంబంధాలను వెనక్కి తిరిగి చూసుకునేలా ఫొటో ఆల్బం చాలా మంది మధ్యతరగతి వారి ఇళ్ళల్లో ఉంటుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దరిదాపుల్లో లేని నేటి రోజుల్లో అలాంటి అనుభూతి కలిగించిన 'ఆల్బం' నాటిక వెండి నంది పొందింది. మాయమవుతున్న మానవతా విలువల గురించి నేడు ఒక్క నాటకరంగమే మొరపెడుతోంది. హృద్యంగా చూపుతోంది. 'మనిషితనాన్ని, మంచితనాన్ని, మారుమూల పల్లెతనాన్ని బతికించుకోకపోతే...' అనే హెచ్చరిక చేస్తున్న కళారూపం కూడా జానపదకళ తరువాత నాటకమే. అలాంటి విజ్ఞాపన తన మేరకు చేసిన నాటకం 'ఎక్కడ వున్నా ఏమైనా' కళాలయ, కొలకలూరు ప్రదర్శించిన ఈ నాటకానికి నంది న్యాయనిర్ణేతలు ఉత్తమ నాటకంగా బంగారునంది నిర్ణయించారు.

'టామీ' నాటిక వీధి అనాధ బాలల చిత్రణతో మొదలవుతుంది. ఒక వేశ్య ఇంటి అరుగుపై వున్న అనాధ బాలుడు ఆమెకు తమ్ముడన్నంత దగ్గరవుతాడు. ప్రేమాభిమానాలు పొందుతాడు. ఆమెను ఉంచుకున్న ఆసామికిది నచ్చదు. తెమ్మన్న బ్రాందీ సీసా పడేశాడని కొట్టడం, హింసించడం చేస్తాడు. చివరకు అక్కనుకున్న ఆమె కూతుర్ని కూడా ఆ ఆసామి మహానుభావుడు చెరబట్టడం చూసి ఎదురుతిరుగుతాడు. దీనిలో మంచి 'డ్రామా'ను రూపకల్పన చేశారు. అందుకే "టామీ" ద్వితీయ ఉత్తమ నాటికగా హైదరాబాద్, అమృతవర్షిణి సంస్థ వెండినంది పురస్కారం పొందింది.

గర్భస్థ ఆడపిండాలను చిదిమి వేయడాన్ని వ్యతిరేకించిన 'ఆడపులి', పిల్లల ఉత్తమ ప్రవర్తనకు పెద్దలు పాటించాల్సిన అంశాలను బోధిస్తూ 'పెద్దలకు మాత్రమే', ప్రభుత్వ పథకాల డొల్లతనాన్ని బట్టబయలు చేస్తూ 'సూదీదారం', రాజకీయ, ఆర్థిక అవినీతి, లంచగొండితనాలపై 'మినిస్టర్', 'ఎక్కండయ్యాబాబు', 'పిల్లికాదు మార్జాలం' నాటకాలు, ఆత్మహత్యలు పరిష్కారం కాదని చెబుతూ 'ఆఖరి ఉత్తరం' నాటకం, అత్యాశలూ ఆడంబరాలను వదిలిపెట్టమని చెప్పే 'దోసిట్లో సముద్రం' నాటకం 'అయ్యిందేదో అయ్యింది' (నాటిక) ప్రదర్శించారు. నవయుగ వైతాళికుడు, సామాజికోద్యమకారుడు అయిన కందుకూరి వీరేశలింగం గారి జీవనఘట్టాలపై 'వైతాళికుడు' నాటకం నాటకరంగాభిమానులు ఎంతో అభిమానంతో చూశారు. ఎంతైనా నాటక రంగానిక్కూడా ఆద్యుడే కదా మరి. తన సామాజికోద్యమ ఆశయాలను నాటక కళారూపం ద్వారానే ప్రచారం చేశారు. జడ్జీలలో దీనికొక పురస్కారం ఇవ్వక తప్పదనే స్థితి కలిగించేంత శక్తి ఈ నాటకానికి ఉంది.

'శ్వేతకపోతం', లాంటి ఉద్యమ ప్రస్తావనగల నాటకం త్రిపురనేని మహారథి లాంటి ప్రజాఉద్యమాభిమానులకు కోపం కలిగించింది. 'ప్రసవించే తల్లిపడాల్సిన ప్రసవవేదన - మంత్రసాని పడకూడదు' అన్న ఒక ముఖ్యమైన అంశాన్ని ఆషామాషీ నాటక రీతిలో ఎమెచ్యూర్ శైలిలో చెప్పబూనటం సాహసం. ఆ తీరు కన్విన్సింగ్‌గా లేకపోవడంతో బ్యాక్‌ఫైర్ అయ్యిందా అన్నట్టయ్యింది. ఒకనాటి నంది ఉత్సవంలో ఉద్యమాల ప్రస్తావన ఉన్న నాటిక 'పక్కింట్లో పుట్టండి'ని స్క్రూటినీలోనే కొట్టిపారేశారు. గమ్మత్తుగా ఈ ఏడాది ఉత్సవంలో 'శ్వేతకపోతం' ప్రదర్శనార్హం చేశారు. ఇది కూడా నంది ఉత్సవ 'చూపు' కొక విశ్లేషణనిస్తోంది. బహుమతి ప్రదానోత్సవంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన నాటకాల ప్రదర్శనలను రాష్ట్రమంతటా ఏర్పాటుచేస్తామన్న ముఖ్యమంత్రి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని పలువురు ఆశిస్తున్నారు. ◆

'ఆశలపల్లె...కి'లో ఓ దృశ్యం

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పరిష్కారం చూపండి!

నాకు పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. ఇంపొటెన్సీ బయటపడుతుందేమోనని భయం. కాని పెళ్ళి చేసేశారు. ఇన్నాళ్ళు ఎలాగో మానేజ్ చేశాను. ఆమె నా ఇంపొటెన్సీ తెలుసుకుని ఆ గ్రౌండ్స్ మీద విడాకులకు అప్లయ్ చేసుకొని నా పరువు తీయకమునుపే నేనే ఏదో గ్రౌండ్స్ మీద (ఆమె పట్ల క్రూరంగా ప్రవర్తించడం, వేరొకరితో తిరగడం, భార్యను పట్టించుకోకపోవడంలాంటి) కేసు వేసి ఆమె విడాకులు తీసుకునేలా చెయ్యవచ్చా? భార్య పట్ల క్రూరత్వం కాకుండా వేరే గ్రౌండ్స్ అంటే మేము కలిసి ఉండలేము. మా ఆలోచనలు, సిద్ధాంతాలు వేరు కనుక కలిసి ఉండలేము అనే బేస్ మీద విడాకులకు అప్లయ్ చేసుకోవచ్చా. నా సమస్యకు సమాధానం చెప్పండి.

- ఒక సోదరుడు.

మీరు ఇన్నాళ్ళు ఎలాగో 'మేనేజ్' చేశాను అంటున్నారు. మీ మేనేజ్‌లో తను భాగస్వామి అని మరచిపోతున్నట్టున్నారు. మీ మేనేజ్ అర్థమయ్యే తను కూడా సర్దుకుపోతున్నట్లుంది. లేదంటే మీ 'మేనేజ్' తను గ్రహించలేదనుకుంటే మీ పొరపాటే. మీ పరిస్థితి సవివరంగా అర్థం చేసుకునేలా చేసి మీరు ఆమెను సమ్మతింప చేసి ఆమె అంగీకారంతో 'మ్యూచువల్ డైవర్స్' తీసుకోవాలి. పెడ ధోరణులతో ఆలోచిస్తే పరిణామాలు విపరీతంగా ఉండే అవకాశం ఉంది. మీరు తనకు పూర్తిగా మీ పరిస్థితి తెలియచేసి డాక్టర్‌ని సంప్రదిస్తే ఫలితం ఉండొచ్చు. మీ కాపురం నిలబడవచ్చు.

నా సొమ్ము నాకు దక్కుతుందా?

నాకు వివాహమై సుమారు 10 సంవత్సరాలు గడిచాయి. నా వివాహ సమయంలో కట్నం నిమిత్తమై రు.10,000 నగదు, సుమారు 15 తులాల బంగారం, సారె మొదలైనవి పుట్టింటి వారు ఇచ్చారు. నా అత్తమామలు తమ కుమార్తె వివాహం నిమిత్తం అవసరమని చెప్పి రు.10,000 నగదు, బంగారం 15 తులాలు తీసుకున్నారు. ఇప్పుడు నా కుమార్తె వివాహం జరిపించాలి. నా వద్ద తీసుకున్న బంగారం, నగదు తిరిగి ఇమ్మంటే ఇవ్వడం లేదు. మా ఆయన ఉద్యోగి అయినందున నీవే మాకు జీవనభృతి ఇవ్వవలసి ఉందని బుకాయించి ఆయన వద్ద నుండి నెలవారీ రు.400లు తీసుకుంటున్నారు. లేకపోతే కోర్టులో కేసు వేస్తామని బెదిరిస్తున్నారు. నేను ఇచ్చిన నగదు, బంగారం చట్ట ప్రకారం తీసుకునే అవకాశం ఉందా? ఉంటే ఏం చేయాలి. దయచేసి తగు సలహా ఇవ్వవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

- టి.లక్ష్మి, శ్రీకాకుళం

మీ వద్ద నుండి మీ అత్తమామలు తమ కుమార్తె వివాహం సందర్భంగా తీసుకున్న రు.10,000, 15 తులాల బంగారం మీకు కట్నంగా ఇచ్చిన బాపతనీ, అవికాక రెండవసారి మళ్ళీ అంతే విలువగలవి మీ తల్లిగారి నుండి తీసుకొచ్చి ఇచ్చారా అనేది వివరంగా చెప్పలేదు. మీది సమిష్టి కుటుంబమై వుంటే కట్నంగా మీ తల్లిదండ్రులు వారికే ఇచ్చి ఉండేవారు. చెల్లెలి పెళ్ళి చేసే బాధ్యత తండ్రితోపాటు అన్నయ్యగా మీ భర్తకి కూడా ఉంటుంది. మీరు ఇచ్చినట్లుగా ఏ ఆధారాలు లేనట్లుగా వుంది. ఆధారాలుంటే మళ్ళీ వారు ఇస్తానని అన్నట్లుగా రుజువు చేయగలిగితే చట్టప్రకారం మీరు పొందగలరు. కాని మీ విషయంలో ఆ రుజువు లేనట్లుగానే కనబడుతోంది. తల్లిదండ్రులకు జీవనభృతి కల్పించడం ఎదిగిన కొడుకుగా మీ వారి బాధ్యత. ఆ బాధ్యత నుండి చట్ట ప్రకారం తప్పుకోలేరు. మీ వారు ఉద్యోగస్థుడంటున్నారు కావున ఆయనను తల్లిదండ్రుల రుణం తీర్చుకోనివ్వండి.

న్యాయాన్ని కాపాడండి

ఒక వ్యక్తి వ్యాన్ కొనే నిమిత్తం గ్రామీణ బ్యాంకు నుండి లోన్ తీసుకున్నాడు. అతనికి నేను ష్యూరిటీగా సంతకం చేసి, నా మంచితనం కొద్దీ నా హౌస్ డాక్యుమెంట్స్ బ్యాంక్ వారి వద్ద ఉంచాను. ఇప్పుడు సదరు వ్యక్తి ఉద్దేశ పూర్వకంగానే లోన్ కట్టడం మానివేసి చాలా కాలం గడిచినది. అందువలన బ్యాంకు వారు నాకు నోటీసులు పంపుతున్నారు. సదరు వ్యక్తికి నాకు తెలిసి 2 ఎకరాల భూమి, ఒక ఇల్లు ఉన్నాయి. నేను ష్యూరిటీ నుండి తప్పుకుని నా హౌస్ డాక్యుమెంట్స్ నాకు వచ్చే విధంగా న్యాయ సహాయం చేయండి.

- నాగేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా

మీరు ష్యూరిటీగా వున్నారు కాబట్టి బ్యాంకు వారు అతనితో పాటు మీకు నోటీసులు జారీ చేస్తుంటారు. బాకీ తీర్చాల్సిన బాధ్యత అతనితో పాటు మీకు సమానంగా ఉంటుంది. అతను చెల్లించలేని పక్షంలో మీరు చెల్లించాల్సి ఉంటుంది. మీరు, లోన్ తీసుకున్న వ్యక్తి, బ్యాంకు వారు కలిసి అంగీకరిస్తేనే మీరు ష్యూరిటీ వెనక్కు తీసుకోగలుగుతారు. మీరొక్కరే అనుకుంటే ఏం చేయలేరు. మీరే ఏ విధంగానైనా బలవంతంగా అతడితో కట్టించాల్సి ఉంటుంది.

తొక్కుడు లడ్డు

కావలసిన వస్తువులు :

శనగపిండి : ఒక కేజీ
పంచదార : ఒకటింబావు కేజీ
బియ్యపుపిండి : వంద గ్రాములు
జీడిపప్పు : పది గ్రాములు
పచ్చ కర్పూరం : తగినంత
నెయ్యి : రెండు స్పూన్లు
ఏలకులు : 10
కిస్‌మిస్ : 10 గ్రాములు
నూనె : ఒక కేజీ

తయారుచేసే విధానం:

శనగపిండిని శుభ్రంగా జల్లించుకొని బూందీ పిండిలాగా కలుపుకోవాలి. తరువాత పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనె కాగాక బూందీ గరిటెలో పిండిపోసి బూందీ దుయ్యాలి. కాలిన తరువాత తీసి వేయాలి. ఇలాగే అంతా చేసుకోవాలి. బూందీని ఆరనిచ్చి మిక్సీలో కొంచెం కొంచెం వేసి మెత్తగా పిండిలాగా కొట్టుకోవాలి. జీడిపప్పు, కిస్‌మిస్‌ను నేతిలో వేయించుకోవాలి. ఏలకులు పొడి కొట్టుకోవాలి. పంచదారలో నీళ్ళుపోసి పొయ్యి మీద పెట్టాలి. తీగపాకం వచ్చాక బూందీ పొడి వేసి కలపాలి. పచ్చ కర్పూరం నలిపి వెయ్యాలి. ఏలకుల పొడి, జీడిపప్పు కిస్‌మిస్ వేసి కలపాలి. దించి కొంచెం ఆరనివ్వాలి. నీళ్ళు తడి చేసుకుంటూ లడ్డూలు చుట్టుకోవాలి. ఆరాక డబ్బాలో పెట్టుకోవాలి. ఇవి పది రోజులు నిల్వ ఉంటాయి. వెరైటీగా చాలా రుచిగా ఉంటాయి. నూనె కాకుండా నేతితో చేసుకుంటే చాలా రుచిగా ఉంటాయి.

బీరకాయ వడలు

కావలసిన వస్తువులు :

బీరకాయ తరుగు : ఒక కప్పు
పచ్చిమిర్చి పేస్టు : ఒక టీ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్టు : ఒక టీ స్పూన్
ఉల్లి తరుగు : అర కప్పు
కొత్తిమీర తరుగు : అర కప్పు
ఉప్పు : తగినంత
బియ్యం పిండి : ఒక కప్పు

తయారుచేసే విధానం:

బీరకాయ తరుగును ఒక బౌల్‌లో వేసి బియ్యం పిండి, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు, ఉల్లి తరుగు, కొత్తిమీర తరుగు, ఉప్పు తగినంత వేసి అన్నీ కలిపి తగినన్ని నీళ్ళు పోసి ముద్దలా కలుపు కోవాలి. బాండీలో నూనె పోసి కాగగానే ఈ పిండిని కొంచెం కొంచెం తీసుకొని వడలుగా చేసి దోరగా వేయించి తీయాలి. వీటిని గ్రీన్ చట్నీతోగాని, టమాటా సాస్‌తో గానీ తింటే బాగుంటాయి. వీటిని భోజనంతో నంజుగా కూడా తిన వచ్చు. మీరు కూడా ఈ వైరైటీ వడలను రుచి చూడవచ్చు.

మీ పక్షం - మీ నేస్తం



ప్రజాశక్తి

దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, ఖమ్మం, కర్నూలు నుండి ప్రచురణ